
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 263
బుధవారం 7-6-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



టెస్టు కిరీటం కోసం..
నేటి నుంచి భారత్, ఆసీస్ మధ్య ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ - 12లో



లక్ష కోట్ల డాలర్లకు..
ఇంటర్నెట్ ఎకానమీ 2030 నాటికి ఆరింతలు పెరుగుతుందని అంచనా-13లో



నేవీ టార్పెడో పరీక్ష సక్సెస్
దేశీయంగా అభివృద్ధి చేసిన భారీ టార్పెడోను భారత నావికాదళం పరీక్షించింది. లక్ష్యాన్ని టార్పెడో విజయవంతంగా ఛేదించింది.
వివరాలు 6లో ▸



డ్యామ్‌పై రష్యా దాడి!
బాంబుల ధాటికి ఉక్రెయిన్‌లోని కఖోవ్కా డ్యామ్ దెబ్బతినడంతో దిగువ ప్రాంతాలను వరద ముంచెత్తింది.
వివరాలు 6లో ▸



కోర్టుకు హాజరైన ప్రిన్స్ హ్యారీ
ఫోన్ హ్యాకింగ్ కేసులో బ్రిటన్ రాజకుమారుడు హ్యారీ లండన్ హైకోర్టుకు హాజరై.. విట్నెస్ బాక్సులో నిలబడి సాక్ష్యం చెప్పారు.
వివరాలు 6లో ▸



ఖలిస్తాన్ స్థావరాల్లో ఎన్‌ఐఏ
పంజాబ్, హరియాణాలోని ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ ఉగ్రవాద సంస్థ స్థావరాల్లో ఎన్‌ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు.
వివరాలు 6లో ▸





పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు, అధికారులు

పోలవరం చకచకా..

ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏరియల్ సర్వే

- మండుటెండలో ప్రాజెక్టు ప్రాంతంలో కలియతిరుగుతూ పనుల పరిశీలన
- ఎగువ కాఫర్ డ్యామ్‌పై ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన సీఎం జగన్
- ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను పూడ్చే పనుల పరిశీలన
- దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను తిరిగి నిర్మించడంపై అధికారులతో చర్చ
- ఆ తర్వాత ప్రాజెక్టు వద్దే అధికారులతో సమీక్ష.. దిశా నిర్దేశం
- శరవేగంగా అగాధాల పూడ్చివేత, కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం
- కీలకమైన పనులు రికార్డు సమయంలో పూర్తి చేశామన్న అధికారులు
- సీడబ్ల్యూసీ డిజైన్ల ప్రకారమే గైడ్ వాల్ నిర్మించామని వెల్లడి
- గైడ్ వాల్‌లో చిన్న సమస్యను సీడబ్ల్యూసీ సూచనల ప్రకారం సరిదిద్దుతామని స్పష్టీకరణ
- దౌర్భాగ్య మీడియా ఈ చిన్న సమస్యను పెద్ద విపత్తులా చూపుతోందన్న ముఖ్యమంత్రి
- ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌లో విధ్వంసం, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ కనిపించవా అని నిలదీత
- అన్ని సమస్యలను అధిగమించి ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని ఆదేశం
- సీఎం జగన్ కృషి వల్లే తొలి దశ నిధుల విడుదలకు కేంద్రం అంగీకరించిందన్న అధికారులు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి, ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చాలని జల వనరుల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. టీడీపీ సర్కార్ హయాంలో కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు చేసిన తప్పిదం వల్ల గోదావరి వరదల ఉధృతికి ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నదీ గర్భంలో ఇసుక తిన్నెలు కోతకు గురై ఏర్పడిన అగాధాలను ఇసుకతో నింపి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల కొత్తగా సమాంతరంగా 'యూ' ఆకారంలో
మిగతా 2వ పేజీలో ▶

గడువులోగా ఆయకట్టుకు నీళ్లు.. రైతులకు ప్రయోజనం

“ గత ప్రభుత్వ హయాంలో ఎగువ కాఫర్ డ్యాంలో ఖాళీలు వదిలేశారు. ఈ ఖాళీల గుండా వరద నీరు అతి వేగంతో ప్రవహించడం వల్ల ప్రాజెక్టు నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి కీలకమైన డయాఫ్రమ్ వాల్ దారుణంగా దెబ్బతింది. దీని వల్ల ప్రాజెక్టు పనులు ఆలస్యం కావడమే కాదు.. వాటిని చక్కదిద్దడం కోసం రూ.2 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇది మాత్రం ఎల్లో మీడియాకు కనిపించలేదు. ఎందుకంటే.. అప్పట్లో ఆ పనులను రామోజీరావు బంధువులకే నామినేషన్ పద్ధతిలో అప్పగించారు కాబట్టి. ఆ తప్పిదాలన్నింటినీ సరిదిద్దుతూ.. ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాం.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

న్యూస్‌రీల్

రైలు ప్రమాదంపై సీబీఐ కేసు నమోదు



ఒడిశా రైలు ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉందంటూ అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రైల్వే శాఖ, ఒడిశా ప్రభుత్వ ఫిర్యాదు మేరకు సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. దర్యాప్తు ప్రారంభించింది.
వివరాలు 6లో ▸

నేడు హజ్ యాత్రకు తొలి బృందం



రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు బుధవారం ఉదయం తొలి విమానం బయలుదేరనుంది. ఇందుకోసం 170 మందితో కూడిన హాజీల తొలి బృందం గుంటూరు జిల్లా నంబూరులోని మదరసా(తాత్కాలిక హజ్ హౌస్)కు మంగళవారం చేరుకుంది.
వివరాలు 2లో ▸

ఆర్బీకేల పనితీరు బాగుంది



ఏపీలో రైతులకు సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాల పనితీరు బాగుందని స్వచ్ఛ భారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి, జలశక్తి శాఖ డైరెక్టర్ జితేంద్ర శ్రీవాత్సవ కొనియాడారు. పారిశుధ్య పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ.. గుర్తింపు పొందిన ఏలూరు జిల్లా భీమడోలు, దుద్దేపూడి పంచాయతీలను ఆయన సందర్శించారు.
వివరాలు 3లో ▸

'స్మార్ట్'గా కాపీ కొడుతూ దొరికిపోయారు



హైదరాబాద్‌లోని వివిధ పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో స్మార్ట్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ఐదుగురు స్నేహితులు అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వారి నుంచి ఫోన్లు స్వాధీనం చేసుకొని.. పోలీసులు కేసు నమోదు చేశారు.
వివరాలు 14లో ▸

నిధులు మళ్లించాం.. కానీ ఎక్కడికో తెలియదు

సీఐడీ విచారణలో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

- విచారణకు సహకరించకుండా మొండికేసిన శైలజ
- కాసేపు జ్వరం, కళ్లు తిరిగాయని, విదేశాల నుంచి వచ్చానని సాకులు
- చిట్టీల మొత్తం చెల్లించలేకపోవడంపై మౌనమే సమాధానం.. శైలజను మరోసారి విచారించాలని సీఐడీ నిర్ణయం



తమ చందాదారుల నుంచి ఎంత మొత్తం వసూలు చేశారో తెలియదు! బ్రాంచీలు, ప్రధాన కార్యాలయంలో ఉన్న నిధులెన్నో తెలియదు! మిగిలిన నిధులను ఎక్కడికి మళ్లించారో కూడా తెలియదు! కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం గురించి ఏమాత్రం తెలియదు! అసలు నాకేమీ తెలియదు.. తెలియదు.. తెలియదు!!
-సీఐడీ విచారణలో మార్గదర్శి ఎండీ శైలజ తీరు ఇదీ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్ ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–2గా ఉన్న సంస్థ ఎండీ చెరుకూరి శైలజా కిరణ్‌ను సీఐడీ అధికారులు మంగళవారం హైదరాబాద్‌లో మరోసారి విచారించారు. సీఐడీ ఎస్పీలు అమిత్ బర్దర్, హర్షవర్ధన్‌రాజు, విచారణ అధికారి రవికుమార్‌తోపాటు 30 మందితో కూడిన సీఐడీ అధికారుల బృందం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసానికి ఉదయం 10 గంటలకు చేరుకోగా దాదాపు అరగంటపాటు గేటు తాళం తీయలేదు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సీఐడీ విచారణ కొనసాగింది. 'మీరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ కదా? మీ పేరిటే చెక్ పవర్ కూడా ఉంది. నిధుల మళ్లింపుపై ఆధారాలు ఇవిగో..! మరి వీటిపై ఏమంటారు..?' అని సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించడంతో 'నాకు ఆరోగ్యం బాగా లేదు! నేను సమాధానాలు చెప్పలేకపోతున్నా.. ఇబ్బంది పెట్టొద్దు..' అంటూ శైలజా కిరణ్ తప్పించుకునేందుకు యత్నించారు.

విచారణకు సహకరించకుండా..
తనకు ఆరోగ్యం బాగా లేదని, విదేశాల నుంచి రావడంతో జ్వరం వచ్చిందంటూ శైలజా కిరణ్ విచారణకు సహకరించకుండా చాలాసేపు జాప్యం చేశారు. విచారణ మొదలైన కొద్దిసేపటికే జ్వరంగా ఉందని, కళ్లు తిరుగుతున్నాయంటూ
మిగతా 14వ పేజీలో ▶



సమాలోచనలతో అభివృద్ధి సాధిద్దాం

- గిరిజనులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు
- ఈనెల 12న గిరిజనులతో సమావేశమవ్వనున్న రాష్ట్రపతి
- దేశంలో 75 పీవీటీజీలకు చెందిన 1,500 మందికి ఆహ్వానం
- ఏపీ నుంచి 180 మంది..

14లో

జొకోవిచ్ జోరు

ఫ్రెంచ్ ఓపెన్‌లో 12వసారి సెమీస్‌లోకి..
క్వార్టర్ ఫైనల్స్‌లో ఖచనోవ్‌పై విజయం

12లో

పీజీ వైద్య సీట్ల పంట

ఈ ఏడాది రాష్ట్రానికి అదనంగా 510 పీజీ సీట్లు

- నాలుగేళ్లలో 702 సీట్లు పెరుగుదల
- ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,668 పీజీ సీట్లు
- ఐదు కొత్త మెడికల్ కాలేజీలతో అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు



సాక్షి, అమరావతి: ఇటు ఎంబీబీఎస్ సీట్లు.. అటు పీజీ సీట్లు! ఒకేసారి కొత్తగా 750 ఎంబీబీఎస్ సీట్లతోపాటు అదనంగా 510 పీజీ వైద్య సీట్లతో రాష్ట్ర వైద్య విద్యా రంగంలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. వైద్య విద్యలో ఆంధ్రప్రదేశ్ గేమ్ ఛేంజర్‌గా అవతరిస్తోంది. ఒక్క ఏడాదిలోనే వీటిని సాధించడం ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్ర వైద్య విద్యా రంగం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పీజీ సీట్లు పెరుగుతున్నాయి. వైద్య విద్యను బలోపేతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత నాలుగేళ్లలో ఏకంగా 702 పీజీ సీట్లు కొత్తగా సమకూరడం గమనార్హం. అధికారంలోకి రాగానే ప్రభుత్వ వైద్య రంగాన్ని తీర్చిదిద్దుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్తగా 17 వైద్య కళాశాలలను
మిగతా 3వ పేజీలో ▶

భారీగా పోస్టుల భర్తీ

ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం వైద్య సీట్లు పెరగాలంటే ఆయా విభాగాల్లో తగినంత మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్లు, ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది విధిగా ఉండాలి. స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఒక్కో ప్రొఫెసర్‌కు 3 పీజీ సీట్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 2 పీజీ సీట్ల చొప్పున ఎన్ఎంసీ మంజూరు చేస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక డీఎంఈలో 106 ప్రొఫెసర్, 312 అసోసియేట్ ప్రొఫెసర్, 832 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కొత్తగా సృష్టించారు. వీటితో కలిపి 1,585 పోస్టులను ఇప్పటివరకూ భర్తీ చేశారు. పదోన్నతుల ద్వారా 500 వరకూ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ అయ్యాయి.



..ఇప్పుడు మీరు చేస్తున్నది అదేగా!!

• ఆకాశమే హద్దు

ఎగుమతుల్లో ఏపీ దూకుడు

రికార్డు స్థాయిలో ఆహార ఉత్పత్తుల ఎక్స్‌పోర్ట్స్

- 2022–23లో రూ.22,762 కోట్ల విలువైన 79.25 లక్షల టన్నులు
- నాలుగేళ్లలో రెండున్నర రెట్లు పెరుగుదల.. సింహభాగం నాన్ బాస్మతి బియ్యం, మొక్కజొన్న, జీడిపప్పు, బెల్లం, అపరాలు
- తొలిసారి గోధుమలు, పశుదాణా, ఆయిల్ కేక్స్ ఉత్పత్తులు కూడా..
- అధికంగా మిడిల్ ఈస్ట్, దక్షిణాసియా దేశాలకే..
- ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమంటున్న అధికారులు, ఎగుమతిదారులు




సాక్షి, అమరావతి: ఆకాశమే హద్దుగా ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ దూకుడు కనబరుస్తోంది. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల్లో రికార్డు స్థాయిలో ఎగుమతులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణలు.. పెద్ద ఎత్తున కల్పిస్తున్న మార్కెటింగ్ సౌకర్యాలు సత్ఫలితాలిస్తున్నాయి. ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువ 2018–19లో రూ.8,929 కోట్లు ఉండగా 2022–23లో ఈ మొత్తం రూ.22,761.99 కోట్లకు చేరింది. అంటే నాలుగేళ్లలోనే రెండున్నర రెట్లు పెరిగింది. 2021–22లో జరిగిన ఎగుమతుల విలువతో పోలిస్తే 2022–23లో రూ.2,860 కోట్ల విలువైన ఆహార ఉత్పత్తులు అధికంగా ఎగుమతయ్యాయి. ఇక జాతీయ స్థాయిలో 2022–23లో రూ.2.21 లక్షల కోట్ల
మిగతా 3వ పేజీలో ▶

ఏడాదిలోనే జీతాల వ్యయం.. రూ.8,068 కోట్లు పెరుగుదల

పెన్షన్ల వ్యయం ఏడాదిలో రూ.2,257 కోట్లు పెరుగుదల

- 2021–22లో జీతాల వ్యయం రూ.40,895 కోట్లు
- 2022–23లో జీతాల వ్యయం రూ.48,964 కోట్లు
- పెన్షన్ల వ్యయం 2021–22లో రూ.20,326 కోట్లు
- 2022–23లో పెన్షన్ల వ్యయం రూ.22,583 కోట్లు
- తెలంగాణ, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల కన్నా ఏపీలోనే జీతాల వ్యయం ఎక్కువ
- 2022–23 కాగ్ ప్రాథమిక గణాంకాల్లో వెల్లడి

14లో



మార్చురీలోని కొడుకును బతికించుకున్నాడు

6లో

ఒడిశా రైలు ప్రమాదంలో ఓ యువకుడిని చనిపోయినట్లుగా భావించిన అధికారులు మార్చురీలో ఉంచారు. అతని కోసం హౌరా నుంచి వచ్చిన తండ్రి.. బాలసోర్‌లోని మార్చురీలన్నీ వెతికాడు. చివరకు తాత్కాలిక మార్చురీలో తీవ్రగాయాలతో పడి ఉన్న తన కుమారుడిని గుర్తించిన తండ్రి.. అతన్ని కోల్‌కతా తీసుకెళ్లి బతికించుకున్నాడు.


దిగువ కాఫర్ డ్యాం ఫొటోలను చూస్తున్న సీఎం వైఎస్ జగన్



దిగువ కాఫర్ డ్యాం (నాడు-నేడు)


పోలవరంపై ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



ఎగువ కాఫర్ డ్యాం (నాడు-నేడు)

పోలవరం చకచకా..

▶ మొదటి పేజీ తరువాయి

కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ పనులు పూర్తయితే.. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయిన నేపథ్యంలో వాటి మధ్య గోదావరి వరదల్లోనూ ఈసీఆర్ఎఫ్ (ప్రధాన) డ్యామ్ పనులు చేపట్టి.. గడువులోగా పూర్తి చేయడానికి మార్గం సుగమం అవుతుందని సూచించారు. మంగళవారం ఉదయం 9.10 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన సీఎం వైఎస్ జగన్.. 9.50 గంటలకు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆ తర్వాత హెలికాప్టర్ దిగి నేరుగా పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్దకు చేరుకున్నారు.

మండుటెండలో కలియతిరుగుతూ..

మండుటెండలో తీవ్రమైన ఉక్కపోత మధ్య సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టు పనులను ఒక గంటా 40 నిమిషాలపాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, గైడ్ వాల్‌లను పరిశీలిస్తూ.. ఎగువ కాఫర్ డ్యామ్ వద్దకు చేరుకున్నారు. గత సీజన్‌లో వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 44 మీటర్లకు పెంచిన పనులను పరిశీలించారు. టీడీపీ సర్కార్ హయాంలో ఎగువ కాఫర్ డ్యామ్‌లో రెండు వైపులా 800 మీటర్లు ఖాళీ వదిలేసి, అరకొరగా చేసిన పనులను.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 44 మీటర్ల ఎత్తుతో పూర్తయిన ఎగువ కాఫర్ డ్యామ్ పనులను కళ్లకు కట్టినట్లు వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అగాధాలను ఇసుకతో నింపి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే పనులను పరిశీలించారు. 960 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న జల విద్యుదుత్పత్తి కేంద్రం పనులను పరిశీలిస్తూ.. దిగువ కాఫర్ డ్యామ్ వద్దకు చేరుకున్నారు. గోదావరి వరదల ఉధృతికి దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురవడం వల్ల ఏర్పడిన అగాధాన్ని పూడ్చి.. 31.5 మీటర్ల ఎత్తుతో ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేసిన ఆ డ్యామ్‌ను పరిశీలించారు. ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలలో ఇసుకను నింపి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే పనులను నిశితంగా పరిశీలించారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రాంతంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడంపై అధికారులతో చర్చించారు.


సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సీఎం చొరవ వల్లే నిధులు

క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత పోలవరం ప్రాజెక్టు వద్దే మీటింగ్ హాల్‌లో జల వనరుల శాఖ అధికారులతో సీఎం వైఎస్ జగన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టులో తొలి దశను పూర్తి చేయడానికి అవసరమైన రూ.12,911.15 కోట్లను విడుదల చేసేందుకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ఆర్థిక శాఖ మెమోరాండం జారీ చేసిందని జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సీఎంకు వివరించారు. గత ప్రభుత్వం ప్రణాళిక లోపంతో చేపట్టిన పనుల వల్ల ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చివేసి యథా స్థితికి తేవడం, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణాల కోసం రూ.2 వేల కోట్లు ఇచ్చేందుకు అంగీకరించిందని ఈఎన్‌సీ నారాయణరెడ్డి తెలిపారు. బిల్లుల చెల్లింపులో కాంపోనెంట్(విభాగాల) వారీ విధించిన పరిమితులను తొలగించేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని అధికారులు వివరించారు. మీ (సీఎం) చొరవ వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు.

పునరావాసం కల్పనపై ప్రత్యేక దృష్టి

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై సీఎం వైఎస్ జగన్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 20,946 నిర్వాసిత కుటుంబాలకుగాను 12,658 కుటుంబాలకు పునరావాసం కల్పించామని చెప్పారు. మరో 8,288 కుటుంబాలకు పునరావాసం కల్పించే పనులను వేగంగా చేస్తున్నామన్నారు. గతేడాది నిర్వహించిన లైడార్ సర్వేలో 41.15 మీటర్ల కాంటూర్‌లోకి 36 గ్రామాలు వస్తాయని తేలిందని, ఆ గ్రామాల్లోని 16,642 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలని చెప్పారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. పునరావాస కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యాక.. షెడ్యూలు ప్రకారం నిర్వాసితులను అక్కడికి తరలించాలని సూచించారు.

చిన్న సమస్యను విపత్తుగా చూపిస్తున్నారు

గైడ్ వాల్‌లో ఏర్పడిన చిన్న సమస్యను అధికారులు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తెచ్చారు. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్లతోనే గైడ్ వాల్ పనులు చేశామని చెప్పారు. ప్రస్తుత సమస్యను కూడా సీడబ్ల్యూసీకి నివేదించామన్నారు. గైడ్ వాల్‌లో ఉత్పన్నమైన సమస్యను సరిదిద్దడం పెద్ద విషయం కాదని.. సీడబ్ల్యూసీ అధికారులు పరిశీలించాక.. వారి సూచనల మేరకు వెంటనే మరమ్మతులు చేస్తామని వివరించారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ.. ప్రాజెక్టు నిర్మాణాల్లో సహజంగానే చిన్న చిన్న సమస్యలు వస్తాయన్నారు. వాటిని గమనించుకుంటూ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో ఇలాంటి ఒక చిన్న సమస్యను విపత్తుగా చూపించే దౌర్భాగ్య మీడియా మన రాష్ట్రంలో ఉందని ఎత్తిచూపారు. ప్రాజెక్టు స్ట్రక్చర్‌తో ఏమాత్రం సంబంధం లేని గైడ్ వాల్‌లో ఉత్పన్నమైన చిన్న సమస్యను పెద్ద విపత్తులా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని కూడా పాజిటివ్‌గా తీసుకుని సరిదిద్దే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో మంత్రులు అంబటి రాంబాబు, పినిపే విశ్వరూప్ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చీఫ్ విప్ ప్రసాదరావు, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు వద్ద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యాటకులను ఆకట్టుకునేలా బ్రిడ్జి నిర్మించాలని సూచించారు. పర్యాటకుల కోసం అధునాతన సదుపాయాలతో హోటల్ ఏర్పాటు చేయాలన్నారు.

కీలక పనుల్లో గణనీయమైన ప్రగతి

పోలవరం ప్రాజెక్టులోని కీలక పనుల్లో ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు వివరించారు. స్పిల్ వే కాంక్రీట్ పనులు పూర్తి చేశామని.. 48 రేడియల్ గేట్లను పూర్తి స్థాయిలో అమర్చామని.. రివర్ స్లూయిస్ గేట్ల ఏర్పాటు పూర్తయిందని చెప్పారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–3లో కాంక్రీట్ డ్యామ్ పూర్తయిందని చెప్పారు. జల విద్యుత్కేంద్రంలో సొరంగాల తవ్వకం పూర్తయిందని.. అప్రోచ్ ఛానల్ తవ్వకం పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని వివరించారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–1 నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాన్ని ఇసుకతో నింపి, వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెచ్చే పనులు పూర్తయ్యాయన్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2 నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను నింపడానికి అవసరమైన ఇసుకను వంద శాతం ఆ ప్రాంతానికి తరలించామని చెప్పారు. ఆ ఇసుకను అగాధాలలో నింపే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. దీనిపై సీఎం వైఎస్ జగన్ స్పందిస్తూ.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–1 పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గ్యాప్–2లో యథాస్థితికి తెచ్చే పనులను త్వరగా పూర్తి చేసి.. వీలైనంత తొందరగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రాంతంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలన్నారు. ఈ పనులు పూర్తయితే.. గ్యాప్–2లో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టి.. వరదల్లోనూ నిర్విఘ్నంగా కొనసాగించడం ద్వారా గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయవచ్చునని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్యాప్–2 నిర్మాణ ప్రాంతంలో అగాధాల పూడ్చివేత, కొత్త డయాఫ్రమ్ వాల్‌ను డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని అధికారులు వివరించారు.


మండుటెండలో పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

క్లుప్తంగా...


నేడు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుడి వివాహ వేడుకకు సీఎం జగన్ హాజరుకానున్నారు. ఇందుకోసం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయం నుంచి బయలుదేరి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి సీఎం చేరుకుంటారు. అక్కడి నుంచి కత్తిమండ గ్రామానికి చేరుకుని.. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రానికి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

నేడు కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తారు. ఇందులో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో మంగళవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.7	31.4
రాజమహేంద్రవరం	44.5	28.0
గుంటూరు	44.0	30.0
ఏలూరు	43.0	28.0
నెల్లూరు	42.3	31.0
విజయవాడ	42.0	31.0
ఒంగోలు	42.0	31.0
తిరుపతి	41.0	28.0
కర్నూలు	40.1	29.3
విశాఖపట్నం	40.0	29.2
కడప	39.8	30.3
శ్రీకాకుళం	39.0	28.0
అనకాపల్లి	38.8	27.0
విజయనగరం	38.0	28.0

పాపను ఆదుకోండన్నా

- ఏడు నెలల చిన్నారికి కిడ్నీ క్యాన్సర్..
- ఎలాగైనా కాపాడాలంటూ ఓ మహిళ విన్నపం
- వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి.. చికిత్సకు హామీ
- మొత్తం ఖర్చు భరిస్తామని భరోసా

సాక్షి ప్రతినిధి, ఏలూరు : 'అన్నా.. ఏడు నెలల నా కూతురు కిడ్నీ క్యాన్సర్‌తో బాధ పడుతోంది. విశాఖపట్నంలో డాక్టర్లకు చూపించి చికిత్స చేయిస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ తీసుకువెళ్లి చికిత్స చేస్తేనే ఫలితం ఉంటుందంటున్నారు. లక్షలు ఖర్చు పెట్టి ఆపరేషన్ చేయించే స్తోమత మాకు లేదు. మీరే మమ్మల్ని ఆదుకోవాలన్నా..' అని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఔరంగాబాద్ గ్రామానికి చెందిన పాక నాగ వెంకట అపర్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించడానికి వచ్చిన క్రమంలో ఆమె తన చిన్నారి నిస్సీ ఆరాధ్య ఆరోగ్య పరిస్థితిని విన్నవించి వినతిపత్రం అందజేశారు. విశాఖ వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కి కిమ్స్‌కు తీసుకెళ్లి చూపించగా, చికిత్సకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారని తెలిపారు. మీరే ఆదుకోవాలని కన్నీటిపర్యంతమయ్యారు. స్పందించిన ముఖ్యమంత్రి అపర్ణను ఓదార్చారు. వెంటనే తగు ఆర్థిక సాయం అందించి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాప వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం భరిస్తామని, అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు.


తన కూతురు ఆరోగ్య పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌కు విన్నవిస్తున్న వెంకట అపర్ణ

రేపు ఈ-ఆటోలను ప్రారంభించనున్న సీఎం

చెత్త సేకరణకు మొత్తం 516 ఈ-ఆటోలు

నెహ్రూనగర్ (గుంటూరు)/భవానీపురం (విజయవాడ పశ్చిమ): క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ కోసం కేటాయించిన ఈ–ఆటోలను ఈ నెల 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 9 గంటలకు మొత్తం 516 ఈ–ఆటోలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీడీఎంఏ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ, ఇతర అధికారులను పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఆదేశించారు. కాగా గుంటూరు నగరపాలక సంస్థకు గతంలో 220 ఈ–ఆటోలు కేటాయించిన సంగతి తెలిసిందే. వీటిని ప్రభుత్వం రూ.12 కోట్లకు కొనుగోలు చేసింది. పూర్తి స్థాయిలో గురువారం నుంచి ఈ–ఆటోలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఇంటింటా చెత్త సేకరణ వేగంగా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే శ్రమ, ఇంధనం ఖర్చు కూడా తగ్గుతుందని అంటున్నారు. అంతేకాకుండా క్లీన్‌గుంటూరు, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కల సాకారమవుతుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య కార్మికులకు ఇప్పటికే ఈ–ఆటో డ్రైవింగ్‌లో అధికారులు శిక్షణ కూడా ఇచ్చారు.


అందుబాటులోకి రానున్న ఈ-ఆటో ఇదే..

పోలీస్ కస్టడీకి వాణిజ్యపన్నుల అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ డివిజన్–1 కార్యాలయం ఇంటెలిజెన్స్ విభాగంలో జీఎస్టీ అధికారులు బి.మెహర్ కుమార్, కె.సంధ్య, సీనియర్ అసిస్టెంట్ కె.వి.చలపతి, ఆఫీస్ సబార్డినేట్ ఎం.సత్యనారాయణలను పోలీస్ కస్టడీకి తీసుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. నలుగురు ఉద్యోగులు విధులను దుర్వినియోగం చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి రూ.కోట్ల అవినీతికి పాల్పడుతున్నట్లు రాష్ట్ర పన్నులశాఖ కార్యాలయం డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 31వ తేదీన కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుల్ని విజయవాడ మూడో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా నిందితులు నలుగురికి రిమాండ్ విధించిందన్నారు. నలుగురు ఉద్యోగులు కార్యాలయంలోని పలు రికార్డులను తారుమారు చేశారని, ఈ అవినీతిలో మరి కొందరు అధికారుల పాత్రపై విచారించాల్సి ఉన్నందున నిందితులను తమకు అప్పగించాలని న్యాయస్థానాన్ని కోరినట్లు చెప్పారు. న్యాయాధికారి ఆదేశాలతో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నలుగురు ఉద్యోగులను పోలీస్ కస్టడీకి తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు.

గంజాయి, అక్రమ మద్యంపై సెబ్ దాడులు

- గంజాయి, మాదకద్రవ్యాలు, సారా, అక్రమ మద్యం, ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- పలువురి అరెస్టు, వాహనాల జప్తు

సాక్షి, అమరావతి: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయితోపాటు డ్రగ్స్ విక్రయాలు, అక్రమ మద్యం విక్రయాలు, సారా తయారీపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) విస్తృతంగా దాడులు నిర్వహిస్తోంది. మే నెలలోనే 169 గంజాయి కేసులు నమోదు చేసి 710 మందిని అరెస్టు చేసింది. 7,222.16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు 92 వాహనాలను జప్తుచేసింది. మూడు మాదకద్రవ్యాల కేసులు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేసింది. 3,100 పెంటజోయిన్ ఇంజక్షన్ సీసాలు, 4.23 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకుంది. 2,115 సారా కేసుల్లో 13,828 లీటర్ల సారా, 1,198.5 కిలోల ఊట బెల్లాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు 1,274 మందిని అరెస్టు చేసింది. 896 అక్రమ మద్యం కేసులు నమోదు చేసి 588 మందిని అరెస్టు చేయడంతోపాటు 1,664.94 లీటర్ల అక్రమ మద్యం, 144.6 లీటర్ల బీరును స్వాధీనం చేసుకుని, 21 వాహనాలను జప్తుచేసింది. 40 లీటర్ల అక్రమ కల్లును కూడా స్వాధీనం చేసుకుంది. 30 ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసుల్లో 161 మందిని అరెస్టు చేయడంతోపాటు 264 ఎర్రచందనం దుంగలను, 25 వాహనాలను జప్తుచేసింది. మే నెలలో గంజాయి కేసుల్లో 30 మందిపై, సారా కేసుల్లో ఎనిమిది మందిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్టు సెబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు పవిత్ర హజ్ యాత్రకు తొలి బృందం

- తొలిసారిగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి పయనం
- నంబూరు మదరసాలో తాత్కాలిక హజ్ హౌస్ నిర్వహణ
- భోజన, వసతి, రవాణా సౌకర్యాలు ఏర్పాటు
- నగదు మార్పిడికి కౌంటర్ • నిరంతర వైద్య సేవలకు మెడికల్ క్యాంప్

సాక్షి, అమరావతి/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ)/ఏఎన్‌యూ/గన్నవరం: రాష్ట్రం నుంచి పవిత్ర హజ్–2024 యాత్రకు బుధవారం ఉదయం తొలి విమానం బయలుదేరనుంది. ఈ నేపథ్యంలో 170 మందితో కూడిన హాజీల తొలి బృందం గుంటూరు జిల్లా నంబూరులోని మదరసా (తాత్కాలిక హజ్ హౌస్)కు మంగళవారం చేరుకుంది. ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మదరసాలో హాజీలకు స్వాగతం పలికి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హజ్ యాత్ర విజయవంతంగా సాగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతి, భోజన, రవాణా సౌకర్యాల పట్ల ఆనందం వ్యక్తం చేసిన హాజీలు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎండలు మండుతుండటంతో హాజీలు ఉక్కపోతతో ఇబ్బంది పడకుండా మదరసాలో ఏసీలు అమర్చారు. దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ఈ తరహా సౌకర్యాలు కల్పించడం విశేషం. హాజీలను సాగనంపేందుకు తరలివచ్చిన వారి బంధుమిత్రులకు సైతం 24 గంటలపాటు అన్నపానీయాలు అందుబాటులో ఉంచారు. యాత్రకు అవసరమైన నగదు మార్చుకునేలా ఎస్‌బీఐ కౌంటర్ ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి మందులు అందించారు. మదరసా చుట్టూ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. హాజీలు తీసుకొచ్చిన లగేజీని ప్యాక్ చేసి విమానాశ్రయానికి తరలించేలా ప్రత్యేకంగా వాహనాలు సమకూర్చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన హాజీలకు సేవలు అందించడానికి వలంటీర్లను అందుబాటులో ఉంచారు.

రాష్ట్రం నుంచి 2 వేల మంది..

రాష్ట్రం నుంచి సుమారు 2,000 మంది మక్కా యాత్రకు బయలుదేరనున్నారు. ఏపీ నుంచి వెళ్లే యాత్రికులందరూ గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరనున్నారు. ఇందుకు ఈ నెల ఏడు నుంచి 19 వరకు ప్రయాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 13 రోజుల పాటు రోజూ 170 మంది చొప్పున బయలుదేరనున్నారు.

హాజీలపై అదనపు భారం లేకుండా చర్యలు..

అంజాద్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ కృషితో విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ రావడం సంతోషంగా ఉందన్నారు. తొలిసారిగా విజయవాడ నుంచి హాజీలు పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరడం గొప్ప విషయమన్నారు. టికెట్ ధరలో తేడాలు ఇబ్బందిగా ఉండటంతో సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనికి ఆయన పెద్ద మనసుతో స్పందించారన్నారు. హాజీలపై అదనపు భారం పడకుండా రూ.14.51 కోట్లను వారి ఖాతాలకే జమ చేసేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకోవడం అద్భుతమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఈ తరహాలో ప్రోత్సాహం అందించలేదన్నారు. త్వరలోనే రాష్ట్ర హజ్ హౌస్ సమకూర్చడానికి సీఎం వైఎస్ జగన్ ఆమోదం తెలిపారని వెల్లడించారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఎంబార్కేషన్ పాయింట్, స్టేట్ హజ్ హౌస్ వంటి అనేక అంశాలను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. నంబూరు మదరసాలో హాజీలతో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్, ఏపీ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజమ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ అలీ, ఆంధ్రప్రదేశ్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, నవాజ్ బాషా, కిలారి రోశయ్య, ఎమ్మెల్సీలు ఇషాక్ బాషా, రుహుల్లా, ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు.. ఎస్ఎం జియాఉద్దీన్, బాగ్దాదీ, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన హాజీలు

సొంత రాష్ట్రం నుంచి వెళ్లడం ఆనందంగా ఉంది..



రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా సొంత రాష్ట్రం నుంచి మక్కా యాత్రకు వెళ్లటం ఆనందంగా ఉంది. యాత్రకు వెళ్లే వారికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండదండలందిస్తోంది. యాత్రకు వెళ్లే వారిపై అదనపు ఆర్థిక భారం పడకుండా సీఎం జగన్ చర్యలు తీసుకోవడం హర్షణీయం.

– షేక్ ఆసిఫ్, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్

ఈ ఏడాది ఏర్పాట్లు బాగున్నాయి..



మక్కా యాత్రకు వెళ్తున్న యాత్రికులకు ఈ ఏడాది ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు బాగున్నాయి. నంబూరులో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు.

– వాజిద్‌ఖాన్, ఏపీ హిస్టరీ అకాడమీ సభ్యుడు

క్లుప్తంగా...

కేజీబీవీ పోస్టుల దరఖాస్తుకు రేపటి వరకు గడువు

సాక్షి, అమరావతి: కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువును గురువారం (8వ తేదీ) వరకు పొడిగించారు. కాంట్రాక్టు పద్ధతిలో భర్తీచేయనున్న ఈ పోస్టులకు దరఖాస్తులు సాంకేతిక సమస్య కారణంగా ఆలస్యం అవుతున్నాయి. ఈ క్రమంలో అభ్యర్థుల అభ్యర్థన మేరకు దరఖాస్తు గడువును పెంచినట్టు సమగ్ర శిక్ష కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఏపీ పీజీసెట్‌కు 83 శాతం హాజరు



పాస్‌వర్డ్‌ను విడుదల చేస్తున్న రెక్టార్ సమత

ఏయూక్యాంపస్: ఏపీ పీజీసెట్-2023 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు సెషన్స్‌గా జరిగిన తొలిరోజు పరీక్షలకు 83.7 శాతం హాజరు నమోదైంది. తొలిరోజు పరీక్ష పాస్‌వర్డ్‌ను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు కన్వీనర్ ఆచార్య సి.హెచ్.వి.వి.ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు.

పాఠశాల నుంచే ప్రయోగాత్మక విద్య

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విద్యార్థుల సృజనాత్మకతను స్వీయానుభవ ప్రక్రియ ద్వారా వెలికితీయడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉపయోగపడతాయని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రోగ్రాం డైరెక్టర్ (ఎస్పీడీ) బి.శ్రీనివాసరావు చెప్పారు. 'రాష్ట్రస్థాయి అటల్ టింకరింగ్ ల్యాబ్ హబ్‌లో ఇంజినీరింగ్ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు బోధన' అంశంపై మూడురోజుల వర్క్‌షాప్‌ను మంగళవారం పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) అనే కార్యక్రమం ద్వారా యూనిసెఫ్, సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ, విజ్ఞాన్ ఆశ్రమం సంయుక్తంగా ఈ వినూత్న ప్రక్రియను చేపట్టాయి. రాష్ట్రంలో ఎంపిక చేసిన ఏడు అటల్ టింకరింగ్ ల్యాబ్ హబ్ స్కూల్లో బోధించడానికి విద్యార్థులు స్వచ్ఛందంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ప్రయోగాత్మకవిద్యను అందిపుచ్చుకోవాలని కోరారు. దీని కోసం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో జాతీయస్థాయి విద్యానిపుణులు గణేష్ నిగమ్, శేషగిరి మధుసూదన్, దక్షిణ భారతస్థాయి విద్యానిపుణుడు డాక్టర్ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను దూషిస్తూ ట్వీట్ చేసిన వ్యక్తికి నోటీసులు

వృద్ధురాలి పేరుతో ఫేక్ ఐడీతో ట్వీట్లు

పట్నంబజారు (గుంటూరు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై పరుష పదజాలంతో ట్వీట్ చేసిన వ్యక్తికి పులివెందుల పోలీసులు సెక్షన్ 41 కింద నోటీసులు జారీ చేశారు. పులివెందుల ఎస్‌ఐ ఎస్.కె.ఎం.హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరానికి చెందిన టీడీపీ కార్యకర్త కరణం ప్రభాకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం వైఎస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులను దూషిస్తూ ట్వీట్ చేశారు. ఓ వృద్ధురాలి పేరుతో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి ఈ ట్వీట్ చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పులివెందుల పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గుంటూరు లాల్‌పురం రోడ్డుకు చెందిన ప్రభాకర్ ఈ ట్వీట్ చేసినట్లు గుర్తించారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీ బి.ఉమామహేశ్వరరెడ్డి, నగరంపాలెం పీఎస్ ఎస్‌హెచ్‌ఓ హైమారావులకు సమాచారం అందజేసి మంగళవారం గుంటూరు వచ్చారు. ప్రభాకర్ ఇంటికి వెళ్లి ఆయన్ను అదుపులోకి తీసుకొని, స్థానిక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం సెక్షన్ 41 నోటీసులు ఇచ్చారు. ఆ ట్వీట్ తానే చేసినట్లు ప్రభాకర్ అంగీకరించారని పోలీసులు తెలిపారు. అతనితోపాటు మరో వ్యక్తిని గుర్తించామని, అతనిపైన కూడా చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

ఆర్బీకేల పనితీరు బాగుంది

స్వచ్ఛ భారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి, జలశక్తి శాఖ డైరెక్టర్ జితేంద్ర శ్రీవాత్సవ ప్రశంస

- జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులపై వాకబు
- సచివాలయాల వ్యవస్థ, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుపైనా ఆరా

భీమడోలు: రైతులకు అనేక రకాల సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాల పనితీరు బాగుందని స్వచ్ఛ భారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి, జలశక్తి శాఖ డైరెక్టర్ జితేంద్ర శ్రీవాత్సవ కొనియాడారు. స్వచ్ఛాంధ్ర మిషన్ కార్యక్రమంలో పారిశుధ్య పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ఏలూరు జిల్లా భీమడోలు, దుద్దేపూడి గ్రామ పంచాయతీలను మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ జె. వెంకట మురళీతో కలిసి జితేంద్ర శ్రీవాత్సవ సందర్శించారు. ఇక్కడ అమలవుతున్న కార్యక్రమాల తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులపై హౌసింగ్ అధికారులను అడిగారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలుచేస్తున్న సచివాలయ వ్యవస్థలోని ప్రతి విభాగం పనితీరు, అది ఏ విధంగా ఉపయోగపడుతున్నదీ వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. తొలుత సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్, మత్స్యశాఖ సహాయకులు, ఇంజనీరింగ్ శాఖల సహాయకులు జాబ్‌చార్ట్‌తో పాటు వారు చేసే సేవలపై ఆరా తీశారు. మంచి స్పర్శ.. చెడు స్పర్శ (గుడ్ టచ్.. బ్యాడ్ టచ్) కార్యక్రమంపై నువ్వేం చేస్తావు.. అంటూ మహిళా కానిస్టేబుల్‌ని ప్రశ్నించగా.. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేస్తోందని, తాను ఉన్నత పాఠశాలల బాలికలు, కళాశాలల్లో యువతులు, డ్వాక్రా మహిళలకు దీనిపై విస్తృత ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నానని ఆమె తెలిపింది.



మత్స్య సహాయకుల ద్వారా అందిస్తున్న సేవల గురించి తెలుసుకుంటున్న జితేంద్ర శ్రీవాత్సవ

కియోస్క్ పనితీరుపై ఆరా..

ఆ తర్వాత రైతుభరోసా కేంద్రంలోని కియోస్క్ యంత్రాన్ని చూసిన ఆయన వీఏఏ (విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్) రూప నుంచి ఈ యంత్రం ఏ విధంగా ఉపయోగపడుతుంది అని ఆరా తీశారు. కియోస్క్ యంత్రంలో రైతులు తమకు కావాల్సిన ఎరువులను బుక్ చేసుకుంటారని, వాటి నగదును చెల్లిస్తే రైతుల చెంతకే ఎరువులు చేరుకుంటాయని ఆమె వివరించారు. రైతులకు మద్దతు రేటుకే అందుబాటులో ఉంటున్నాయని, ఈ విధానంలేని తరుణంలో రైతులు దళారుల వద్ద ఎక్కువ రేటుకు కొనుగోలు చేసుకునేవారని ఎండీ జె. వెంకటమురళి ఆయనకు వివరించారు. అక్కడే ఉన్న సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్‌ను కియోస్క్ యంత్రం రైతులకు ఏ విధంగా ఉపయోగపడుతోందని ప్రశ్నించారు. ఆర్బీకే సేవలవల్ల రైతులు సంతృప్తికరంగా ఉన్నారని, ఈ విధానం లేనప్పుడు రైతులు సాగుకు తీవ్ర ఇబ్బందులు పడేవారని సర్పంచ్ వివరించారు. దీంతో రైతుభరోసా కేంద్రాల పనితీరు బాగుందని, రైతులకు సంతృప్తికరమైన సేవలు అందుతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో జితేంద్ర శ్రీవాత్సవ మొక్కలు నాటారు. నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఈడీ ఊర్మిళాదేవి, జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్, డీపీఓ ఏవీ విజయలక్ష్మి, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీరంగ, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు

ఎల్లో మీడియా కథనాన్ని ఖండించిన వైద్య శాఖ

- 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వైద్యులను కేటాయించాం
- వారు నెలకు రెండుసార్లు గ్రామాలకు వెళ్తున్నారు
- విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఓపీ సేవలందిస్తున్నారు
- మంచానికే పరిమితమైనవారికి ఇంటి వద్దే వైద్యం చేస్తున్నారు
- స్పష్టంచేసిన ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

సాక్షి, అమరావతి: ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ రామిరెడ్డి చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం మొక్కుబడిగా అమలవుతోందంటూ మంగళవారం ఎల్లో మీడియాలో ప్రచురించిన కథనాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విధానంలో రాష్ట్రంలోని 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వైద్యులను కేటాయించి వారికి నిర్ణీత షెడ్యూలు ప్రకారం నెలకు రెండుసార్లు వైద్య సేవలందించే బాధ్యతలను అప్పగించామన్నారు. గ్రామానికి వెళ్లిన వైద్యుడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఓపీ వైద్య సేవలందిస్తున్నారని, మధ్యాహ్న సమయంలో తీవ్ర అస్వస్థతతో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేస్తున్నారని వివరించారు. ప్రతి క్లినిక్‌లో 14 రకాల వైద్య నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎల్లో మీడియా కథనంలో ఈ పథకానికి వ్యతిరేకంగా ప్రకటన చేసిన అనంతపురం జిల్లా పుట్లూరు మండల వాసి సతీష్ యెల్లుట్ల కూడా వైద్యులు సేవలందిస్తున్న విషయాన్ని లిఖితపూర్వకంగా నిర్ధారించారని తెలిపారు.

'సీలేరు'పై సీఈఏ సంతృప్తి

ప్రాజెక్టు గురించి వివరించిన ఏపీ జెన్‌కో ఎండీ

సాక్షి, అమరావతి: ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ అనుమతులపై సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) సంతృప్తి వ్యక్తం చేసింది. డీపీఆర్ సమ్మతి సమావేశం సీఈఏ చైర్మన్ గుణయం ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం న్యూఢిల్లీలో జరిగింది. ఏపీలో విద్యుత్ స్థితి, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటు ఆవశ్యకత, ఇతర ప్రాజెక్టులను ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు వివరించారు. సీలేరు ప్రాజెక్టు కోసం టెక్నో ఎకనామిక్ కాంకరెన్స్‌ని త్వరలో సీఈఏ జారీచేయనుంది.

పీజీ వైద్య సీట్ల పంట

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేస్తూనే అప్పటికే ఉన్న 11 మెడికల్ కాలేజీల్లో వసతులను మెరుగు పరిచారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా కళాశాలల్లో వైద్యులు, సిబ్బందిని సమకూర్చడంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించారు. ఫలితంగా 1956 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో వైద్య సీట్లు పెరిగాయి.

పీజీ సీట్లు ఇంకా పెరిగే చాన్స్

రాష్ట్రంలో పది వైద్య కళాశాలల్లో నాలుగేళ్ల క్రితం వరకూ 966 పీజీ సీట్లు మాత్రమే ఉన్నాయి. నెల్లూరు జిల్లా ఏసీఎస్ఆర్ కళాశాలలో ఒక్క పీజీ సీటు కూడా లేదు. అలాంటిది నాలుగేళ్లలో వరుసగా 2020లో 24 సీట్లు, 2021లో 31 సీట్లు, 2022లో 137 సీట్లు చొప్పున రాష్ట్రానికి అదనంగా పీజీ సీట్లు సమకూరాయి. 2023లో 737 సీట్లు పెంచాలని ఎన్ఎంసీకి ప్రతిపాదించగా ఇప్పటి వరకు 510 సీట్లు మంజూరయ్యాయి. మిగిలిన సీట్ల పెంపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ విద్యా సంవత్సరంలో పీజీ సీట్ల ప్రవేశాలకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఈలోగా మరికొన్ని సీట్లు రాష్ట్రానికి దక్కే అవకాశం ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత నాలుగేళ్లలోనే ఏకంగా 702 సీట్లు పెరగడంతో ఇప్పటికే 1,668 పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 42.08 శాతం సీట్లు పెరిగాయి. ఏసీఎస్ఆర్ కళాశాల కూడా పీజీ సీట్లలో బోణీ కొట్టింది. ప్రస్తుతం ఆ కళాశాలలోనూ 24 పీజీ సీట్లు ఉన్నాయి. ఇక ఈ ఏడాది ఐదు కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు కొత్తగా సమకూరాయి.

పీజీ సీట్లు పెరుగుదల ఇలా..

కళాశాల	2019	2023
జీఎంసీ శ్రీకాకుళం	23	64
ఆంధ్ర వైద్యకళాశాల, వైజాగ్	235	340
ఆర్ఎంసీ, కాకినాడ	136	207
ఎస్ఎంసీ విజయవాడ	89	161
జీఎంసీ గుంటూరు	110	188
జీఎంసీ ఒంగోలు	12	79
ఏసీఎస్ఆర్ జీఎంసీ, నెల్లూరు	0	24
ఎస్‌వీఎంసీ, తిరుపతి	127	227
జీఎంసీ, కడప	34	108
కేఎంసీ, కర్నూలు	143	183
జీఎంసీ, అనంతపురం	57	87
మొత్తం	966	1,668

ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ



వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యుల అందుబాటు విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మెరుగైన స్థానంలో ఉంది. పీజీ సీట్లు పెరగడంతో స్పెషలిస్ట్, సూపర్ స్పెషాలిటీ వైద్యుల సంఖ్య మరింత పెరగనుంది. తద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ లభిస్తుంది. వైద్య రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు సత్వరమే, నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న సీఎం వైఎస్ జగన్ లక్ష్యానికి అనుగుణంగా ముందుకు వెళుతున్నాం.

– ఎం.టి.కృష్ణబాబు, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

సీట్ల పెంపుతో పలు లాభాలు



వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెరగడం వల్ల చాలా లాభాలుంటాయి. రీసెర్చ్ కార్యకలాపాలు, రోగులకు వైద్యుల అందుబాటు పెరుగుతుంది. మన ఆస్పత్రుల్లో నిత్యం వేల సంఖ్యలో ఓపీలు, ఐపీలు నమోదవుతుంటాయి. వీటిద్వారా రీసెర్చ్ కార్యకలాపాలు పెరుగుతాయి. ప్రభుత్వం రీసెర్చ్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవచ్చు. పీజీ సీట్లు పెరగడంతో చిన్న పట్టణాల్లోనూ స్పెషలిస్టులు అందుబాటులోకి వస్తారు.

– కంచర్ల సుధాకర్, ప్రిన్సిపల్, సిద్ధార్థ వైద్య కళాశాల విజయవాడ

సిద్ధార్థకు 10 'సూపర్' సీట్లు

- న్యూరాలజీ, న్యూరో సర్జరీలో ఐదు చొప్పున మంజూరు
- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ డీఎం, ఎంసీహెచ్ సీట్లు మంజూరు చేస్తూ జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) సోమవారం అనుమతులు జారీ చేసింది. ఒక్కో విభాగంలో ఐదు సీట్లకు అనుమతిస్తూ 2023-24 విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు నిర్వహించవచ్చని పేర్కొంది. ఒకేసారి రెండు విభాగాల్లో పది సూపర్ స్పెషాలిటీ సీట్లు రావడంపై వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓ కళాశాలకు ఒకేసారి ఐదేసి సూపర్ స్పెషాలిటీ సీట్లు మంజూరు చేయడం ఇదే తొలిసారి అని సీనియర్ ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు.

సౌకర్యాలపై సంతృప్తి..

ప్రభుత్వాస్పత్రిలో న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలపై నేషనల్ మెడికల్ కమిషన్ ఇటీవల తనిఖీలు నిర్వహించింది. ఒక్కో విభాగంలో రెండు దఫాలు తనిఖీలు చేపట్టి అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసింది. రెండు విభాగాలకు వస్తున్న అవుట్ పేషెంట్స్, ఇన్‌పేషెంట్స్‌తో పాటు, ప్రత్యేక ఐసీయూలు, ట్రామాకేర్, స్ట్రోక్ యూనిట్లు, అందుబాటులో ఉన్న అత్యాధునిక పరికరాలపై సంతృప్తి వ్యక్తం చేసింది. పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అవసరమైన లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్, పుస్తకాల లభ్యత తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం సీట్లు మంజూరు చేసింది.

ప్రభుత్వ కృషితో...

డీఎం-న్యూరాలజీ, ఎంసీహెచ్-న్యూరోసర్జరీ కోర్సులు చేయాలంటే గతంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అవి మన రాష్ట్రంలోనే అందుబాటులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ కృషి ఎంతో ఉందని వైద్యులు గుర్తు చేస్తున్నారు. నాలుగేళ్లుగా వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తుండటంతో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్లు మంజూరవుతున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ అందుబాటులోకి రావడం, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ లాంటి పరికరాలను సమకూర్చడంతోపాటు అత్యాధునిక ఐసీయూలు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నందున సీట్లు మంజూరైనట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది..

సూపర్ స్పెషాలిటీ సీట్లు మంజూరు చేయాలంటే సౌకర్యాలతో పాటు, బోధించే వైద్యులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం న్యూరాలజీ విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు. న్యూరోసర్జరీ విభాగంలో సైతం ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉన్నందున పూర్తిస్థాయిలో సీట్లు మంజూరయ్యాయి. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సుందరాచారి, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు సీట్లు మంజూరయ్యేలా తమవంతు కృషి చేశారు.

2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేద్దాం

- 2019 స్ఫూర్తితో సమష్టిగా పనిచేద్దాం
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ మహాసభలు
- ఈ సభలు విజయవంతమయ్యేలా అందరూ కృషి చెయ్యాలి
- వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి పిలుపు

సాక్షి, అమరావతి: 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ అనుబంధ విభాగాలు ఎలా పని చేశాయో.. 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించడానికి అదే స్ఫూర్తితో, సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ముందుగా ఇటీవల ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను సమన్వయం చేసుకొని త్వరితగతిన పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, మండల ఇన్‌చార్జిల ఖాళీలను భర్తీ చేయాలని చెప్పారు. జయహో బీసీ మహాసభ తరహాలోనే త్వరలో పార్టీ తలపెట్టిన ఎస్సీ, ఎస్టీ ,ముస్లిం మైనారిటీ, మహాసభలను విజయవంతం అయ్యేలా అనుబంధ విభాగాల అధ్యక్షులు కృషి చెయ్యాలని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



మాట్లాడుతున్న వి.విజయసాయిరెడ్డి

నాలుగు అంశాలపై ప్రధానంగా చర్చ

ఈ సమావేశంలో ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించారు. అనుబంధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పదవులను త్వరితగతిన భర్తీ చెయ్యడం, జయహో బీసీ మహాసభ మాదిరిగానే రాష్ట్ర స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ సమావేశాల నిర్వహణ, వివిధ సామాజిక వర్గాలకు, విభాగాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఇంటింటికీ ప్రచారం చేయడం, అనుబంధ విభాగాల అధ్యక్షులకు అదనంగా మరికొందరిని నియమించడంలో సాధ్యాసాధ్యాలపై చర్చించారు. అనుబంధ విభాగాల అధ్యక్షులు, సమావేశంలో పాల్గొన్నవారు ఈ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పార్టీ అనుబంధ విభాగాల కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌కి దీటుగా పెన్షన్ స్కీమ్

50 శాతం బెనిఫిట్ పొందేలా నూతన విధానం

సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అనేది లేదు

- ఉద్యోగ సంఘాలు కోరిన 454 అంశాల్లో 330 విషయాలను ప్రభుత్వం పరిష్కరించింది
- ఏ ప్రభుత్వంలోనూ ఇన్ని అంశాలు పరిష్కారం కాలేదు
- ఉద్యమం చేయడం వల్లే ఉద్యోగులకు మేలు జరిగిందనడంలో నిజం లేదు
- ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)తో సమానంగా నూతన పెన్షన్ విధానం రూపుదిద్దుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. మంగళవారం వెలగపూడిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అనేది ఉండదన్నారు. ఓపీఎస్‌తో సమానమైన పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఉద్యోగులు 50 శాతం బెనిఫిట్ పొందే విధంగా ఈ విధానం ఉంటుందన్నారు. కేబినెట్‌లో తీసుకునే నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు సంతృప్తి చెందుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉద్యోగుల సమస్యలపై ఈ ప్రభుత్వ హయాంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌తో పలు సమావేశాలు జరిగాయని గుర్తు చేశారు. అప్పటికప్పుడే నిర్ణయాలు తీసుకుని ఆదేశాలు ఇచ్చారన్నారు. 32 శాఖలకు సంబంధించి సుమారు 454 అంశాలను ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తేగా 330 అంశాలు ఇప్పటికే పరిష్కారమయ్యాయన్నారు. తక్కువ వ్యవధిలో ఇన్ని సమస్యలు పరిష్కరించడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఇప్పటికే జీపీఎఫ్ బకాయిలు, సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐ పెండింగ్ బిల్లులను చెల్లించారని తెలిపారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల విషయంలో సమస్యలను పరిష్కరించేందుకు ఆరోగ్యశ్రీ సీఈఐ ఖాతాలో హెల్త్ కార్డ్ డబ్బులను ఈ నెల నుంచే జమ చేస్తారని చెప్పారు.

గతంలో ఓ సీఎం మాట తప్పారు

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత తాము అలా ఎప్పుడు చెప్పామంటూ గతంలో ఒక ముఖ్యమంత్రి ప్రశ్నించిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఇప్పుడు సీఎం జగన్ హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నారని తెలిపారు. సుమారు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందన్నారు. యూనివర్సిటీలు, సహకార సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచనున్నారని తెలిపారు. స్పెషల్ పే చెల్లించేందుకు త్వరలో ఉత్తర్వులు వెలువడతాయన్నారు. డీఏ, పీఆర్సీ బకాయిలను పదవీ విరమణ తర్వాత ఇవ్వాలని తొలుత భావించినా ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు నాలుగేళ్లలో 16 విడతలుగా సుమారు రూ.7,382 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. కరోనా వల్ల రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.76 వేల కోట్ల ఆదాయాన్ని నష్టపోయిందన్నారు.

పద్ధతి ప్రకారం చెల్లింపులు

తాము చేసిన ఉద్యమం వల్లే ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేస్తున్నట్లు కొన్ని ఉద్యోగ సంఘాలు గొప్పలు చెప్పుకొనే ప్రయత్నం చేయడం సరికాదని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో ముఖ్యమైన పెద్ద అంశాలపై మాత్రమే ఉద్యమాలు నిర్వహించగా ఇప్పుడు కొన్ని సంఘాలు ఎందుకు ఉద్యమం చేస్తున్నాయో ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఉద్యమం చేయడం వల్లే ప్రభుత్వం ఇవన్నీ ఇవ్వడం లేదని, ఒక పద్ధతి ప్రకారం చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. గతంలో పీఆర్సీ కమిషన్ నియమించాలని ఉద్యమాలు జరగగా ఇప్పుడు ప్రభుత్వం ముందుగానే నియమిస్తోందని గుర్తు చేశారు.

ఎగుమతుల్లో ఏపీ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

విలువైన 4.45 కోట్ల టన్నుల ఉత్పత్తులను ఎగుమతి చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి రూ.24,826 కోట్ల విలువైన 80.86 లక్షల టన్నులు ఎగుమతయ్యాయి. వాటిలో ఒక్క మన రాష్ట్రం నుంచే రూ.22,762 కోట్ల విలువైన 79.25 లక్షల టన్నుల ఉత్పత్తులు ఉండటం విశేషం. తెలంగాణ నుంచి కేవలం రూ.2,064 కోట్ల విలువైన 1.61 లక్షల టన్నుల ఉత్పత్తులు మాత్రమే ఉన్నాయి. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ రికార్డులు తిరగరాస్తోందని వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎపెడా) చెబుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గరిష్టంగా ఒక ఏడాదిలో జరిగిన ఎగుమతులను 2022-23లో తొలి అర్ధ సంవత్సరంలోనే వైఎస్ జగన్ ప్రభుత్వం అధిగమించడం విశేషం. చరిత్రలో ఎప్పుడూ ఈ స్థాయిలో ఎగుమతులు జరగలేదని చెబుతున్నారు. పురుగు మందుల అవశేషాల్లేని వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తే లక్ష్యంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేయనున్నందున 2023-24లో కోటి లక్షల టన్నులకు పైగా ఎగుమతులు జరిగే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

తొలిసారి గోధుమలు, పౌల్ట్రీ ఉత్పత్తుల ఎగుమతి

రాష్ట్రం నుంచి ప్రధానంగా నాన్ బాస్మతి రైస్, మొక్కజొన్న, జీడిపప్పు, బెల్లం, అపరాలు, శుద్ధి చేసిన పండ్లు, పండ్ల రసాలు, కూరగాయలు పెద్ద ఎత్తున ఎగుమతవుతున్నాయి. మొత్తం ఎగుమతుల్లో సింహభాగం నాన్ బాస్మతి రకం బియ్యమే. 2018-19లో రూ.7,324 కోట్ల విలువైన 29.22 లక్షల టన్నులు నాన్ బాస్మతి రైస్ ఎగుమతి అయితే.. 2022-23కు వచ్చేసరికి రూ.18,693 కోట్ల విలువైన 67.32 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. నాన్ బాస్మతి రైస్ తర్వాత మొక్కజొన్న 2018-19లో రూ.130.77 కోట్ల విలువైన 91,626 టన్నులు ఎగుమతి కాగా, 2022-23లో ఏకంగా రూ.1,845.73 కోట్ల విలువైన 7.24 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. కాగా రాష్ట్రం నుంచి తొలిసారి గోధుమలు, ఆయిల్ కేక్స్, పౌల్ట్రీ, పశుదాణా ఉత్పత్తులు ఎగుమతి చేశారు. రూ.829.71 కోట్ల విలువైన 3.23 లక్షల టన్నుల గోధుమలు, రూ.317 కోట్ల విలువైన 1,906.89 టన్నుల పశుదాణా, రూ.17.6 కోట్ల విలువైన 8,371 టన్నుల పౌల్ట్రీ ఉత్పత్తులు, రూ.4.68 కోట్ల విలువైన 3,028 టన్నుల ఆయిల్ కేక్స్ ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. రాష్ట్రం నుంచి ఎక్కువగా మిడిల్ ఈస్ట్, దక్షిణాసియా దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుండగా.. గతేడాది అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూరోపియన్, అరబ్ దేశాలకు కూడా పంపారు

ఎగుమతులను ప్రోత్సహించేలా సంస్కరణలు

సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణలు, కల్పించిన మార్కెటింగ్ సౌకర్యాల ఫలితంగా ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఏటా సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో రికార్డు స్థాయి ఎగుమతులు నమోదవడం సంతోషదాయకం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

ఐదేళ్లలో పెరిగిన ఎగుమతులు ఇలా..

సంవత్సరం	ఆహార ఉత్పత్తులు (టన్నుల్లో)..	విలువ (రూ.కోట్లలో)
2018-19	31,47,779	8,929
2019-20	17,41,986	5,429
2020-21	52,88,526	13,782
2021-22	79,32,915	19,902
2022-23	79,25,376	22,762

ప్రభుత్వ ప్రోత్సాహంతో పోటీపడుతున్న వ్యాపారులు..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహం, గ్రామస్థాయిలో కల్పించిన సౌకర్యాలతో గత నాలుగు సీజన్లలో వ్యవసాయ విస్తీర్ణంతోపాటు నాణ్యమైన దిగుబడులు పెరిగాయి. నాలుగేళ్లలో ఏటా సగటున 14 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తుల దిగుబడులు అదనంగా వచ్చాయి. కేంద్రం మద్దతు ధర ప్రకటించని ఆహార ఉత్పత్తులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలు ప్రకటించడం, ధరలు తగ్గిన ప్రతిసారీ రైతులు నష్టపోకుండా మార్కెట్‌లో జోక్యం చేసుకోవడంతో వ్యాపారులు సైతం పోటీపడి కొనుగోలు చేశారు. దీంతో మార్కెట్‌లో రైతుల ఉత్పత్తులకు మంచి ధరలు లభిస్తున్నాయి. మిరప, పత్తి వంటి వాణిజ్య పంటలే కాదు.. అపరాలు, చిరు ధాన్యాలు, అరటి, బత్తాయి వంటి ఉద్యాన ఉత్పత్తులకు మంచి ధర లభిస్తోంది.



వివేకంతో బతికినవాళ్లకు ఆఖరికి చావు కూడా అంత భయపడవలసిందేమీ కాదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 7 జూన్ 2023

సమయం లేదు మిత్రమా!

ప్రపంచంలోని 175 దేశాలు... దాదాపు 1000 మంది ప్రతినిధులు... అయిదు రోజుల చర్చోప చర్చలు... ఎట్టకేలకు ప్రపంచ సమస్యకు పరిష్కారం దిశగా చిన్న ముందడుగు. మే 29 నుంచి జూన్ 2 వరకు ప్యారిస్‌లో ప్లాస్టిక్‌పై ఐరాస అంతర్ ప్రభుత్వ చర్చల సంఘం2 (ఐఎన్‌సీ–2) సమావేశంలో జరిగింది ఇదే. ప్లాస్టిక్ కాలుష్యభూతాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా విశ్వవ్యాప్త ఒప్పందానికి చిన్నగా అడుగులు పడ్డాయి. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని పారద్రోలండి' అన్నది ఈసారి ప్రధానాంశమైన ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి కొద్దిగా ముందు జరిగిన ఈ సమావేశం ఆ మేరకు ఆనందించదగ్గది, అయితే, నవంబర్‌లో నైరోబీలో జరిగే 'ఐఎన్‌సీ–3' నాటికి కేవలం ఆలోచనలు ఏకరవు పెట్టే చిత్తు ప్రతి తయారీనే ఈ సమావేశం లక్ష్యంగా పెట్టుకోవడం ఆశ్చర్యకరం. పారేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పసిఫిక్ మహాసముద్రంలో కదులుతున్న కృత్రిమ ద్వీపంలా తయారైన వేళ ఇది అతి జాప్యమే.

నిజానికి, వచ్చే 2024 చివర లోపల ప్లాస్టిక్ భూతంపై ఈ చర్చోపచర్చలు ముగించాల్సి ఉంది. అందులో భాగంగా తలపెట్టిన అయిదు సమావేశాల్లో తాజా ప్యారిస్ సమావేశం రెండోది. ఆరు నెలల క్రితం ఉరుగ్వేలో జరిగిన తొలి సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. కొన్ని దేశాలు విశ్వవ్యాప్త కార్యాచరణ కోరితే, మరికొన్ని దేశాలు జాతీయ పరిష్కారాలు కావాలన్నాయి. ఇంకొన్ని దేశాలు రెండూ కావాల్సిందే అన్నాయి. తీరా ఆరునెలల తర్వాత తాజా సమావేశంలోనూ తొలి రెండు రోజులూ ఉద్రిక్తత నడుమ వృథా అయ్యాయి. సహజంగానే ప్లాస్టిక్‌తో తమ ఆర్థిక అంశాలు ముడిపడ్డ చమురు, సహజవాయు, పాలిమర్ ఉత్పాదక దేశాలు ఏకాభిప్రాయం కుదరనివ్వక తమకు అనుకూల వాదనను ఎంచుకుంటూ, చర్చలను జాప్యం చేశాయి. ఎట్టకేలకు మూడో రోజున చర్చల రథం కొంత ముందుకు కదిలింది. ఆర్థిక ప్రయోజనాలు అర్థం చేసుకోదగినవే కానీ, వాటి కోసం ప్రపంచమే ప్రమాదంలో ఉన్నా పట్టదంటే ముమ్మాటికీ తప్పే.

మానవాళికి ప్లాస్టిక్ పెనుభూతమే. ప్రపంచంలో ఏటా 43 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తవుతోంది. అందులో సగానికి పైగా ఉత్పత్తులు పరిమిత కాలం ఆయువున్నవే. ఉత్పత్తి చేస్తున్న ప్లాస్టిక్‌లో మూడింట రెండు వంతులను వ్యర్థాలుగా పారేస్తున్నారు. పది శాతం ప్లాస్టిక్కే రీసైక్లింగ్‌కు నోచుకుంటోంది. అతి కొద్దిభాగం ప్లాస్టిక్ వ్యర్థాలనే దహనం చేస్తున్నారు. అత్యధిక భాగం భూమిలో, జలవనరుల్లో, సముద్రాల్లో చేరిపోతున్నాయి. ఇది సమస్త జీవరాశికీ ముప్పు. ఇలా పేరుకుంటున్న వ్యర్థాల పరిమాణం వచ్చే 2060కి మూడు రెట్లవుతుంది. అందులో అయిదోవంతే రీసైకిల్ చేయడానికి వీలుంటుంది. ఇక, 2019లో ప్రపంచవ్యాప్త ఉద్గారాల్లో 3 శాతం పైగా ప్లాస్టిక్ వ్యర్థాల పాపమే. ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) ఈ ప్రమాదాలపై తాజాగా అప్రమత్తం చేసింది.

కొత్తగా మైక్రో ప్లాస్టిక్స్ మరో పెను ఆందోళన. చేపలు, బ్లూ వేల్ లాంటి సముద్రచరాలు రోజూ కోటి ముక్కల మైక్రో ప్లాస్టిక్‌ను పొట్టలో వేసుకుంటున్నాయి. వాటిని భుజిస్తున్న మన రక్తంలో, చనుబాలలో, చివరకు గర్భస్థ మావిలో సైతం చేరి, ఆరోగ్య సమస్యగా మారాయి. కానీ, ప్లాస్టిక్ ఉత్పత్తిని పరిమితం చేయాలంటున్న దేశాలకూ, వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తే సరి అంటున్న దేశాలకూ మధ్య భేదాభిప్రాయాలు మరోసారి ప్యారిస్ సాక్షిగా బయటపడ్డాయి. మన దేశంతో సహా సౌదీ అరేబియా, చైనా తదితర దేశాలూ నియంత్రణ చర్యలపై మెజారిటీ ఓటింగ్ కాక, ఏకాభిప్రాయం కావాలని పట్టుబట్టడం చిత్రం. లెక్కల్లో మన దేశ తలసరి ప్లాస్టిక్ వినియోగం అనేక ఇతర దేశాలతో పోలిస్తే తక్కువే. కానీ మన మొత్తం జనాభా, అన్ని కోట్లమంది అవసరాలకై ప్లాస్టిక్ ఉత్పత్తి, తత్ఫలితంగా వ్యర్థాలు మాత్రం ఎక్కువే. పైపెచ్చు, ఎప్పటికప్పుడు అది అధికమవుతోంది.

ప్లాస్టిక్ ఉత్పత్తిని నియంత్రిస్తూ, కాలుష్యాన్ని మొగ్గలోనే తుంచేసే అంతర్జాతీయ ప్లాస్టిక్ ఒడంబడిక ప్రపంచానికి ఇప్పుడు అవసరమంటున్నది అందుకే. ప్యారిస్ పరిణామాలు, అధిగమించాల్సిన అడ్డంకుల్ని చూస్తుంటే ఆ ఒడంబడిక అంత త్వరగా వచ్చేలా లేదు. ఇవాళ్టికీ సామాన్య ప్రజలు తమ జీవితంపై ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావాన్ని గుర్తించడం లేదు. ఆ వైఖరిని మార్చడం విశ్వ ఒడంబడికను మించిన సవాలు. అలాగే వచ్చే ఏడాది చివరకి అంతర్జాతీయ సమాజం కట్టుబడి ఉండే చట్టబద్ధమైన విశ్వవ్యాప్త ఒడంబడిక తెద్దామని యోచన బాగున్నా, అందుకు కట్టుబడి ఉండడం కీలకం. ఒప్పందంలోనూ శషభిషలు లేకుండా ప్లాస్టిక్‌పై కఠిన కార్యాచరణ మరీ కీలకం. అలాకాక, మునుపటి పర్యావరణ ఒప్పందాల్లా ఈ కొత్త ఒడంబడికనూ కాలయాపన వ్యవహారంగా, ధనిక దేశాలకు అనుకూలంగా మారిస్తే ఫలితం శూన్యం. వర్ధమాన దేశాలకు న్యాయం జరిగేలా చూడాలి.

ప్యారిస్ సమావేశం ప్రారంభ చర్చల వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అన్నట్టు, ప్లాస్టిక్ కాలుష్యం ఇప్పుడు ఓ టైమ్ బాంబ్. తక్షణ చర్యలకు దిగకపోతే, పర్యావరణానికీ, జీవవైవిధ్యానికీ, యావత్ ప్రపంచ మానవాళి ఆరోగ్యానికే ప్రమాదం. దీన్ని కేవలం వ్యర్థాల నిర్వహణ అంశంగానే చూస్తే ఇబ్బందే. కేవలం రీసైక్లింగ్‌కో, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధానికో పరిమితం కాకుండా పాలు, నీళ్ళ నుంచి తిండి దాకా అన్నీ ప్యాకెట్లూ ప్లాస్టిక్‌మయమైన ఈ రోజుల్లో ప్రజల జీవన విధానాన్ని మార్పించడంపై దృష్టి పెట్టాలి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై త్వరపడాలి. ప్లాస్టిక్ ఉత్పత్తిదారుల పైనే బాధ్యత మోపే ఆలోచన చేయాలి. ముప్పు ముంచుకొచ్చిన వేళ ఆలసిస్తే అనక ఏ ఒడంబడికైనా నిరుపయోగమే. మెక్రాన్ మాటల్లోనే చెప్పాలంటే... అట్టే సమయం లేదు మిత్రమా!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** తిథి బ.చవితి రా.1.16 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.12.37 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.9.41 నుండి 11.11 వరకు, తిరిగి తె.4.22 నుండి 5.52 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.33 నుండి 12.23 వరకు, **అమృతఘడియలు:** సా.6.34 నుండి 8.02 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

మన ఐఐటీలు ఆత్మహత్యా కేంద్రాలా?

టెక్నాలజీలో భారత్‌ను పటిష్ఠంగా మార్చాలన్న లక్ష్యంతో దేశంలో ఐఐటీలను నెలకొల్పారు. కానీ విదేశాల్లో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలకు డిమాండ్ పెరిగిన తర్వాతే నిజంగా వీటి వైపు చూడటం మొదలైంది. దాంతో వీటిలో సీటు సంపాదించడమే లక్ష్యంగా కార్పొరేట్ రెసిడెన్షియల్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇక్కడి చదువుల ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఒకటైతే; ఐఐటీల్లో చేరాక అక్కడి పోటీని తట్టుకోలేక తీవ్ర చర్యకు విద్యార్థులు దిగడం మరొకటి. ప్రొఫెసర్ల నిరంకుశ విధానాలు విద్యార్థుల మీద విపరీత ఒత్తిడిని పెంచుతున్నాయి. విద్యార్థులను దేశం ఆధారపడగల సమర్థ ఇంజనీర్లుగా, సాంకేతిక నిపుణులుగా మలచడానికి బదులుగా... విద్యా కర్మాగారాలుగా ఐఐటీలను మార్చడమే ప్రొఫెసర్ల ప్రాథమిక లక్ష్యంగా ఉంటున్నట్లు కనిపిస్తుంది.

జవహర్‌లాల్ నెహ్రూ 1950లలో దేశంలో మొట్టమొదటి ఐఐటీని ఖరగ్‌పూర్‌లో నెలకొల్పారు. బోస్టన్‌లోని ఎమ్ఐటీ ప్రమాణాలకు అనుగుణంగా మన ఇంజినీరింగ్, టెక్నాలజీలను ప్రభావితం చేయడమే దీని లక్ష్యం. అయితే అమెరికా, యూరప్‌లలో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలకు ఉన్నట్లుండి డిమాండ్ పెరిగిన నేపథ్యంలోనే 1995 ప్రాంతంలో ఐఐటీలకు నిజమైన డిమాండ్ పెరిగింది. తదనుగుణంగా అనేక ఐఐటీలను ప్రారంభించారు. ఇప్పుడు దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐటీ, ఒక ఎన్ఐటీ ఉంటున్నాయి. రానురానూ డిమాండ్ పెరుగుతుండటంతో, మూడు ప్రవేశ పరీక్షలతో కూడిన సంక్లిష్ట ప్రక్రియను ఐఐటీలు ప్రవేశపెట్టాయి. జేఈఈ–1(నవంబర్/డిసెంబర్), జేఈఈ–2 (ఫిబ్రవరి), జేఈఈ–అడ్వాన్సుడ్ (జూన్). ఇంటర్ సిలబస్ పూర్తి కావడానికి ముందే తొలి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారన్నది స్పష్టం. సిలబస్ బీఎస్సీ సెకండ్ ఇయర్ స్థాయిలో ఉంటుంది. అంటే ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో చేరాలని విద్యార్థులకు ఇది స్పష్టమైన సంకేతం.

అందుకనే, ఇంటర్మీడియట్ గొలుసుకట్టు/కార్పొరేట్ రెసిడెన్షియల్ కళాశాలలు దేశమంతటా, ప్రత్యేకించి రెండు తెలుగు రాష్ట్రాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇక్కడ చదువుకు అనుగుణమైన వాతావరణం ఉండదు. చిన్న నిద్రించే గదులుంటాయి, క్రీడలకు చోటుండదు, బయటి ప్రపంచంతో సంబంధాలుండవు. ఐఐటీలో సీటు కొడతారని, కోట్లాది రూపాయల వేతనాన్ని ఆర్జిస్తారని తల్లిదండ్రులు తమ పిల్లలను వీటిలో చేర్పిస్తారు. మరోవైపున క్రూరమైన టీచర్లు అవకాశం దొరికినప్పుడల్లా విద్యార్థులను బాదిపడేస్తుంటారు. నిలబెట్టి మరీ అవమానిస్తుంటారు. ఆత్మహత్యకు పాల్పడటం కంటే ఎలాంటి అవకాశాలు విద్యార్థులకు ఉండటం లేదు. మానసిక కౌన్సెలింగ్ గురించి వారికి ఏమీ తెలీదు. టీచర్లు, వార్డెన్ల భౌతిక క్రూరత్వం, ఒక టీచర్ నిర్దాక్షిణ్యంగా బాదినప్పుడు తీవ్రంగా బాధపడిన డేవిడ్ కాపర్‌ఫీల్డ్‌ను గుర్తుకు తెస్తుంది. (1850లలో చార్లెస్ డికెన్స్ ఇదే పేరుతో రాసిన నవల ఇది). 2020లలో కూడా ఇలాంటి ఉదంతాలకు మనం సాక్షీభూతంగా ఉండటం దురదృష్టకరం.

2022 జనవరి 1 నుండి 2023 మార్చి వరకు 12 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యల పాలబడటం ఆందోళనకరమైన వాస్తవం. తాజాగా 2023 మార్చి 1న హైదరాబాద్ నగరంలోని రెసిడెన్షియల్ కాలేజీలో చదువుతున్న ఇంటర్మీడియట్ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులకు ఒక బలమైన సలహా ఏమిటంటే, పిల్లలు గణితంలో మెరుగ్గా ఉంటేనే జేఈఈ రెసిడెన్షియల్ కాలేజీలను ఎంచుకోవాలి.

2022 నాటికి, ఐఐటీ–జేఈఈ కోసం 11 నుండి 12 లక్షల మంది నమోదు చేసుకున్నారు. వీరిలో 2.7 శాతం మాత్రమే దేశంలోని100 కేంద్ర విద్యా సంస్థల్లో చేరగలరు. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రఖ్యాత ఇంజినీరింగ్ కళాశాలల వంటి విద్యాసంస్థలను, విద్యార్థుల ఆత్మహత్యలనే తరంగం వేధిస్తోంది. పరీక్షా వైఫల్యాలు, విద్యాపరమైన ఒత్తిడి, కులం, పట్టణ–గ్రామీణ, ధనిక–పేద, ఆంగ్ల నైపుణ్యం వంటి వివిధ కారణాలు ప్రకాశవంతమైన యువ మనస్సులను తీవ్రమైన చర్యలను ఆశ్రయించడానికి కారణమవుతున్నాయి. 2018 నుంచి 2022 మధ్యకాలంలో కేంద్రీయ విద్యాసంస్థలైన ఐఐటీల్లో 33 మంది, ఎన్ఐటీల్లో 24 మంది ఆత్మహత్య చేసుకున్నారని రాజ్యసభలో విద్యా మంత్రి పేర్కొన్నారు.



అనేక ఐఐటీలలో, ఒక సాపేక్ష గ్రేడింగ్ విధానం అమలులో ఉంది. ఇందులో ఒక వ్యక్తి పనితీరును ఇతర ప్రకాశవంతమైన సహ విద్యార్థులతో పోల్చి కొలుస్తారు. దురదృష్టవశాత్తూ, ఈ వ్యవస్థ ఆచార్యులకు అపారమైన అధికారాన్ని కల్పిస్తుంది. వారు నిర్మాణాత్మక బోధన, పరిశోధనల కంటే తరచుగా వారి వ్యక్తిగత ప్రాధాన్యతలకు చోటిస్తారు. విద్యార్థులు ఈ సాపేక్ష గ్రేడింగ్ విధానం ఆధారంగా ఉన్నత ర్యాంకుల కోసం పోటీపడుతున్నందున, విద్యాపరంగా, వ్యక్తిగతంగా ప్రత్యర్థులుగా మారతారు. తమ సొంత గ్రేడ్లకు హాని కలిగిస్తారనే భయంతో విద్యార్థులు ఎలా కట్–థ్రోట్ కాంపిటీషన్లో పాల్గొంటున్నారు, నోట్సును ఎవరికీ చూపకుండా ఎలా దాచిపెట్టుకుంటున్నారు, ఒకరికొకరు సహకరించుకోవడానికి ఎలా నిరాకరిస్తున్నారు అనే అంశాలు దిగ్భ్రాంతికరమైన వివరాలు చెబుతున్నాయి.

ఐఐటీల్లోని ప్రొఫెసర్లు తరచుగా తమను తాము క్రమశిక్షణకు సంరక్షకులుగానూ, సైన్స్ అండ్ టెక్నాలజీకి స్వయంప్రకటిత కర్తలుగానూ భావిస్తారు. వాస్తవానికి ఐఐటీలలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన లేదా పరిశోధన, అత్యాధునిక పురోగతి విషయంలో గణనీయమైన కృషి చేసిన ప్రొఫెసర్లు చాలామంది లేరని తెలుసుకోవడం నిరుత్సాహం కలిగిస్తుంది. విద్యార్థులను దేశం ఆధారపడగల సమర్థ ఇంజనీర్లుగా, సాంకేతిక నిపుణులుగా మల్చడానికి బదులుగా... విద్యా కర్మాగారాలుగా ఐఐటీలను మార్చడమే ప్రొఫెసర్ల ప్రాథమిక లక్ష్యంగా ఉంటున్నట్లు కనిపిస్తుంది. అకడమిక్ లిటరేచర్ని, ర్యాంకింగులను నిశితంగా పరిశీలిస్తే, ఐఐటీలలోని పరిశోధనా ఫలితాలు పాశ్చాత్య దేశాలతో సమానంగా లేవని తెలుస్తుంది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సర్వేలోని టాప్ 200 ర్యాంకులలో ఏ ఒక్క ప్రధాన ఐఐటీ కనిపించలేదు.

సాహా, పీసీ రే, ఎస్.ఎన్.బోస్, విశ్వేశ్వరయ్య, కెఎల్. రావు, రామన్, కృష్ణన్, హోమీ భాభా వంటి గొప్ప శాస్త్రవేత్తలతో పోల్చదగినవారిని ఎంతమందిని స్వతంత్ర భారతదేశంలో మనం తయారు చేశాం? హైడల్ పవర్ ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్‌తో సహా మన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం ఇప్పటికీ గ్లోబల్ టెండర్లపైనే ఆధారపడతాము. నౌకలను మరమ్మతు చేయడానికి కూడా మనవద్ద సాంకేతికత లేనందున రష్యాపై ఆధారపడుతున్నాము. ఆంధ్ర ప్రదేశ్‌లోని కోనసీమ సహజ వాయువు పైప్‌లైన్ 20 రోజులు నిరంతరం మంటలతో ప్రజ్వలించినప్పుడు, వాటిని ఆర్పడానికి కూడా మనం నీల్ ఆడమ్స్‌ను విదేశాల నుండి రప్పించాల్సి వచ్చింది.

ఐఐటీల్లో ఆత్మహత్యలు, ఒత్తిడి లేకుండా సమగ్ర మూల్యాంకనాన్ని నిర్ధారించడానికీ, ఐఐటీలలోని విద్యా, సామాజిక వాతావరణాన్ని పరిశోధించడానికీ 'అంబుడ్స్‌మన్ రకం' వ్యవస్థను నియమించాలి. నియమాలు, అకడమిక్ గ్రేడింగ్ విధానాలను అన్ని ఐఐటీలలో ప్రామాణీకరించాలి. ఐఐటీ చార్టర్లలో నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరుతున్నాయో లేదో తెలుసుకోవడానికి పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలి. మనం తరచుగా వార్తాపత్రికలలో ఐఐటీల పరిశోధనా నివేదికలను చూస్తాము. ఇవి తరచుగా 'తదుపరి అధ్యయనాలు అవసరం' అని ముగుస్తుంటాయి.

ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యల ప్రాబల్యం ఒక బాధాకరమైన సమస్య. ఈ ఆత్మహత్యల వల్ల అంతర్జాతీయ విద్యా సంస్థలు, యాజమాన్యాల ముందు మన భారతీయ ప్రతిష్ఠ పలుచబారుతుంది. చివరగా, ఐఐటీలలో చేరే ప్రవేశ ప్రక్రియను వికేంద్రీకరించాలని సూచిస్తున్నాం. ప్రతి రాష్ట్రం ఒక ప్రవేశ బోర్డును కలిగి ఉండాలి. ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు, ప్రైవేట్ లేదా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆత్మహత్యలు లేవని గుర్తుంచుకోవాలి. ఈ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల నుండి లక్షలాది మంది విద్యార్థులు భారతదేశంలోనూ, విదేశాల్లోనూ కంప్యూటర్ ఆధారిత కంపెనీలలో ఉద్యోగాలు పొందుతున్నారు. ఐఐటీ డిగ్రీ లేకపోయినా జీవితం ఉంది. టెక్నాలజీలో భారత్‌ను పటిష్ఠంగా మార్చాలన్న నెహ్రూ ఆశయం సమీప భవిష్యత్తులో నెరవేరుతుందా? నూతన విద్యా విధానం(ఎన్ఈపీ–2020) ఈ అంశాలను పరిశీలించాలి.

డాక్టర్ కె. నాగయ్య, చీఫ్ సైంటిస్ట్, సీఎస్ఐఆర్–ఐఐసీటీ, హైదరాబాద్; ప్రొ॥ జి. శ్రీమన్నారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ విభాగం, ఉస్మానియా; ఫణిరాజ్ జి., ఐటీ ప్రొఫెషనల్, అమెరికా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మీ నుంచే మొదలవ్వాలి



'నేను వార్తాపత్రికలు చదవను; నేను పుస్తకాలు చదవను' అని చెప్పే జనాలే తమ పిల్లలు కచ్చితంగా చదవాలని కోరుకుంటారు. కానీ నియమం స్పష్టంగా ఉంది: మీ పిల్లలు మంచి పాఠకులు కావాలని అనుకుంటే, ముందు మీరు చదవాలి.

– వైశాలీ మాథుర్, ప్రచురణకర్త

విధానపరమైనది...



నేను రోజుకోసారైనా జగన్నాథుడిని ప్రార్థిస్తాను. స్వీడన్‌లో 32 ఏళ్లుగా ఉంటున్నప్పటికీ బీఫ్ తినలేదు. అయినా నన్ను కొందరు పిచ్చివాళ్లు హిందూ వ్యతిరేకిని అంటున్నారు.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

సరైన మాట



ప్రతిదానికీ సరైన ప్రదేశం, సరైన సమయం అనేవి ఉంటాయి, ఆఖరికి సరైన పనికి కూడా! ఇది అర్థం కానివాళ్లు రాజకీయ నాయకులు కాలేరు. ఇది అర్థం కానివాళ్లను ఎదిగిన మనిషి అనలేం.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

చెత్త శిఖరం



ఎవరెస్ట్ శిఖరం వేగంగా చెత్తకుప్పలా మారుతోంది. రెండు వారాల వ్యవధిలో 900కి పైగా జనం శిఖరాన్ని చేరడానికి ప్రయత్నించి రద్దీ పెంచడంతో 2023 చరిత్రలో ఒక భయానకమైన సీజన్‌గా మిగిలిపోయింది. అలాగే ఇది భారీ వ్యాపారంగానూ మారిపోయింది.

– జో పాంప్లియానో, క్రీడా విశ్లేషకుడు

ప్రకృతి నియమం



మగవాడు జన్మనివ్వలేడనీ, స్త్రీకి పురుషాంగం ఉండదనీ అనడంలో ద్వేషం ఎంత మాత్రమూ లేదు. మన అభిప్రాయం పొలిటికల్లీ కరెక్ట్ అయినా, కాకపోయినా ఇదే సత్యం. మనం జనాన్ని దయతో, గౌరవంతో చూడాలి; అంతమాత్రాన దానికోసం శాస్త్రీయ వాస్తవాన్ని బలిపెట్ట కూడదు.

– కరోల్ సైకోరా, ఆంకాలజిస్ట్

మౌన నాయకుడు



ఒడిషా రైలు ప్రమాదానికి సంబంధించి ఒక మనిషిని అభినందించాలి. ఆయన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్. 'పీఆర్', 'ఫొటో ఆప్'లను పట్టించుకోకుండా మౌనంగా తన పనిచేసుకుంటూ పోయారు; గాయపడిన ప్రయాణికులకు, సహాయక బృందాలకు ఇవ్వాల్సిన మద్దతు ఇచ్చారు. అది మంచి నాయకుడికి సంకేతం.

– జాయ్‌దాస్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

పసిగట్టే పాత్ర



బ్రిటిష్ మిస్టరీ రచనల్లో ఎప్పుడూ కుక్కను నడిపించుకుంటూ వెళ్తున్న వ్యక్తి అక్కడొక శవం ఉందని గుర్తిస్తుంటాడు.

– స్టీఫెన్ కింగ్, రచయిత

ఇన్‌బాక్స్

ఆ దేశం మీద జాలిపడు!

ఏ దేశ ప్రజలు గొర్రెల్లా ఉంటారో/ ఆ జాతిని చూసి జాలిపడు
ఏ గొర్రెల కాపరులు వారిని తప్పుదారి పట్టిస్తారో
ఆ దేశపు బూటకపు నాయకత్వాన్ని చూసి జాలిపడు
ఏ దేశ మేధావులు నోరు విప్పరో/ఏ సద్గుణ సంపన్నులు గాలి కబుర్లతో
గాలితో యుద్ధాలు చేస్తుంటారో/ వారినందరినీ చూసి జాలిపడు
అవసరమైనప్పుడైనా గొంతెత్తలేని/జాతి జనుల చూసి జాలిపడు
దాడులు చేసే వారిని పొగడుతూ ఉండడం
హింసిస్తూ, ప్రపంచాన్ని బలవంతంగా
పాలించాలనుకునే ఆంబోతుల్ని – హీరోలనుకుని,
భజనలు చేస్తున్న భక్తుల్ని చూసి జాలిపడు –
తమ భాష తమదే తప్ప, మరో భాష అర్థం చేసుకోలేని
అవివేకులను చూసి జాలిపడు
తమ సంస్కృతీ సంప్రదాయాలు తమవే తప్ప,
ఇంకా వేరేవి కూడా ఉంటాయని
తెలుసుకోలేని మూర్ఖుల్ని చూసి జాలిపడు
డబ్బే ఊపిరిగా బతికే వారిని చూసి జాలిపడు
బాగా మెక్కి నిద్రిస్తున్న వారిని ఇంకా నిద్ర బుచ్చుతున్న
కాపలాదారుల కపటత్వాన్ని చూసి జాలిపడు
హక్కుల్ని, బాధ్యతల్ని గాలికి వదిలేసే దేశ ప్రజల్నీ...
వారి దేశాన్నీ... చూసి జాలిపడు!
తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కొట్టుకుపోతున్నా
మిన్నకుండే వానపాము మనస్తత్వాన్ని చూసి జాలిపడు
స్వేచ్ఛాలోచనతో తలెత్తుకుని సగర్వంగా బతికిన
ఓ నా ప్రియమైన దేశమా? నువ్విప్పుడు నిరంతరం
కన్నీళ్ళెందుకు కారుస్తున్నావ్?

– డాక్టర్ దేవరాజు మహారాజు
(ఖలీల్ జీబ్రాన్ భావానికి కవితా రూపం ఇచ్చింది అమెరికన్ కవి లారెన్స్ ఫెర్లిగెట్టి)

బాలల భవితకు సర్కారీ దీవెన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యలో విద్యార్థుల చేరికను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా 'వైఎస్ఆర్ జగనన్న విద్యా కానుక' పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకం కింద ప్రభుత్వం బోధన – నేర్చు కోవడానికి సంబంధించిన సామగ్రిని విద్యార్థులకు కిట్‌ల రూపంలో అందిస్తోంది. ప్రతి కిట్‌లో ఒక బ్యాగ్, కుట్టుకూలితోపాటు మూడుజతల యూనిఫాం, ఒక బెల్ట్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సు, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ తెలుగు నిఘంటువు ఒకటి ఉంటాయి. ఈ పథకం కింద ఇప్పటి వరకు 2,323.99 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. మొత్తం మీద గత మూడేళ్లుగా సగటున ఏడాదికి 47 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం వల్ల లాభం పొందారు. 2023–24 విద్యాసంవత్సరానికిగాను 1,042.53 కోట్ల రూపాయలు ఖర్చుచేయబోతోంది ప్రభుత్వం.

'మన బడి', 'నాడు–నేడు', 'అమ్మ ఒడి', 'జగనన్న గోరుముద్ద' వంటి పథకాల అమలు ద్వారా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యతోనే పేదరికాన్ని తొలగించి రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించగలమని 'విద్యా కానుక' పథకం ప్రారంభ సభలో ముఖ్యమంత్రి అన్న మాటలు గమనార్హం.

'నాడు నేడు' పథకం ద్వారా మొదటి దశలో 15,715 పాఠశాలల పునరుద్ధరణ పనులు పూర్తి అయ్యాయి. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, తాగునీరు, ఫర్నీచర్, ప్రహరీ గోడలు, ఇంగ్లీష్ ల్యాబ్‌లతో సహా తొమ్మిది ప్రాథమిక విభాగాలను ఏపీ ప్రభుత్వం గుర్తించింది. ఇందుకోసం రూ. 3,669 కోట్లు ఖర్చు చేసింది. 'మన బడి', 'నాడు– నేడు' పథకం కింద వేలాది పాఠశాలలు, హాస్టళ్లకు భద్రత కల్పించారు. 1 నుంచి 6 తరగతులకు ఆంగ్ల మాధ్యమ పాఠ్య ప్రణాళికను రూపొందించి అమల్లోకి తెచ్చారు. ఇప్పుడు తొమ్మిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమ విద్య కొనసాగుతోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పదో తరగతి వరకు పాఠశాల విద్యలో పూర్తి స్థాయి ఆంగ్ల మాధ్యమం అమల్లోకి వచ్చేస్తుంది.



ప్రతి పేద తల్లీ తమ పిల్లల్ని సంతోషంగా పాఠశాలకు పంపించాలని ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహనరెడ్డి గడిచిన నాలుగేళ్ళ పాలనలో ప్రాథమిక విద్యారంగంలో పెనుమార్పులు తీసుకొచ్చారు. అవి సత్ఫలితాలను ఇవ్వడం చూసి దేశంలోని మిగతా రాష్ట్రాలూ ఏపీ వైపు చూస్తున్నాయి. ఇంతవరకు ఏపీలో పేదల విద్య కోసం ఇంతటి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రులు ఎవరూ లేరు. 'జగనన్న విద్యా కానుక' పథకాన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత లక్షలాదిమంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారారు. 'అమ్మ ఒడి' పథకం ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపే తల్లులకూ వర్తింప చేయడంతో మొత్తం మీద జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో చేరే పిల్లల సంఖ్య పెరిగింది.

'బైజూస్'తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం నేపథ్యంలో 5 లక్షల 30 వేల మంది 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఎడ్–టెక్ మేజర్ కంటెంట్‌తో కూడిన టాబ్లెట్‌లను అందజేసింది. 2025లో పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలో ఆంగ్ల మాధ్యమం పరీక్షలు విజయవంతంగా రాసేలా ప్రాథమిక విద్యా శాఖ అన్ని చర్యలూ తీసుకుంటోంది. ట్యాబ్లెట్‌లను కొనుగోలు చేసేందుకు రూ. 600 కోట్లు ఖర్చయింది.

'అందరికీ పాఠశాల అందుబాటులో ఉండాల'నే నినాదం నుంచి 'అందరికీ నేర్చుకునే అవకాశం కల్పించాల'నే లక్ష్యంతో ప్రభుత్వం ట్యాబ్‌లను విద్యార్థులకు అందించింది. ఇందువల్ల విద్యార్జనలో కార్పొరేట్ పాఠశాలల పిల్లలకూ, ప్రభుత్వ పాఠశాలల పిల్లలకూ మధ్య ఉన్న అంతరం (గ్యాప్) తొలగిపోతుందనేది ప్రభుత్వ భావన. ఇలా ధనిక – పేద అనే తేడా లేకుండా రాష్ట్రంలోని అందరు విద్యార్థులకూ ఉత్తమమైన విద్యను నేర్చుకోవడానికి సమాన అవకాశం కల్పించి సమ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న ఏపీ ప్రభుత్వ సారథి అభినందనీయులు.

– జి. యోగేశ్వరరావు
సీనియర్ జర్నలిస్ట్ । 95028 12920

వినయపిటకం

త్రిపిటకాల్లో మొదటిది వినయపిటకం. బౌద్ధ భిక్షువుల, భిక్షుణుల ప్రవర్తనా నియమావళిని ఈ గ్రంథం నిర్దేశిస్తుంది. సంఘం ఏర్పడిన కొత్తలో ఎలాంటి నియమావళి అవసరం లేకపోయింది. అప్పటి వారంతా నీతి నియమాలతో వుంటూ, బుద్ధుడంటే శ్రద్ధాభక్తులు కలిగి అతడి ఆదేశాలను తు.చ. తప్పకుండ ఆచరించేవారు. తరువాత్తరువాత సంఘంలో అసాంఘిక శక్తులు చొరబడటం మొదలైంది. అలాంటి వారిని అదుపు జేయటానికి సమగ్రమైన నియమావళిని రూపొందించటం జరిగింది. హత్య, దొంగతనం వంటి పెద్ద తప్పిదాలకు సంఘ బహిష్కరణ శిక్షగా వుండేది. అబద్ధం చెప్పటం లాంటి చిన్న తప్పులకు, ఆ తప్పు ఒప్పుకుంటే సరిపోయేది.



భిక్షుణుల సంఘప్రవేశం గురించి, వారికి సంబంధించిన ప్రవర్తనా నియమావళి ఏర్పరచటం గురించి ఆసక్తికరమైన సంఘటన ఒకటి వున్నది. బుద్ధుడికి జ్ఞానోదయం అయి నాలుగేళ్ళు అయింది. తండ్రి శుద్ధోదనుడు రోగంతో మంచం మీద వుండి కొడుకుని చూడాలి రమ్మని కబురు చేశాడు. తండ్రి కోరిక ప్రకారం బుద్ధుడు కపిలవస్తుకు వచ్చాడు. తల్లిలేని బుద్ధుణ్ణి చిన్నప్పుడు కన్నతల్లిలా సాకిన మహాప్రజాపతి బుద్ధుణ్ణి అడుగుతుంది తనను భిక్షుణిగా సంఘంలో జేర్చుకొమ్మని. బుద్ధుడు అంగీకారం తెలపడు. తండ్రి చనిపోయాక బుద్ధుడు తిరిగి వైశాలి వచ్చాడు. పట్టువీడని మహాప్రజాపతి జుట్టు కత్తిరించుకొని, కాషాయబట్టలు కట్టుకొని 500 మంది శాక్య స్త్రీలను వెంట బెట్టుకొని కాలినడకన, కపిలవస్తు నుండి వైశాలికి బుద్ధుడు విడిది చేసిన చోటుకు వచ్చి చేరింది. ఆనందుడు వీళ్ళను చూశాడు. దయతో అతడి గుండె కరిగిపోయింది. అప్పుడు ఆనందుడు అడుగుతాడు, స్త్రీలకు నిర్వాణస్థితిని పొందే సామర్థ్యం లేదా? అని. స్త్రీలకు ఆ సామర్థ్యం ఉన్నదంటాడు బుద్ధుడు. అలాగయితే, మహాప్రజాపతి కోరికను మన్నించి భిక్షుణులుగా సంఘంలో వారికి స్థానం ఇవ్వమంటాడు. ఆ విధంగా భిక్షుణీ సంఘం ఏర్పడటం, వినయ పిటకంలో వారికి సంబంధించిన ప్రవర్తనా నియమావళి చేర్చటం జరిగింది.

– దీవి సుబ్బారావు

శ్రీవారి సేవలో సినీ హీరో ప్రభాస్



తిరుమల: ప్రముఖ సినీ హీరో ప్రభాస్ మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామి వారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఆలయాధికారులు ప్రభాస్‌కు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

అధికారుల విధులను అడ్డుకున్న టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల

- అరెస్ట్ చేసిన పోలీసులు

యలమంచిలి: గృహనిర్మాణ శాఖ అధికారులు తమ విధులను నిర్వర్తించకుండా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అడ్డుకున్నారు. అదేవిధంగా జగనన్న కాలనీలో మెరక కోసం అన్ని అనుమతులు పొంది కాంట్రాక్టర్ తువ్వ ఇసుకను తరలిస్తుండగా అడ్డుకుని హడావుడి చేశారు. దీంతో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. యలమంచిలి మండలం ఏనుగువానిలంకలో గోదావరి తీరం వెంబడి పెరుగులంక భూమి ఉంది. ఈ భూమిలో ఉన్న తువ్వ ఇసుకను తీసి జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను మెరక చేసేందుకు ఒక కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మైనింగ్ శాఖకు సెస్ చెల్లించి సదరు కాంట్రాక్టర్ అనుమతి పొందారు. గృహనిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్ తువ్వ ఇసుక తీసి జగనన్న కాలనీకి తోలుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అక్కడికి వచ్చారు. పెరుగులంక భూమిలో తువ్వ ఇసుక తీయడానికి ప్రభుత్వ అనుమతి ఉందని, దళితులు, బడుగు, బలహీన వర్గాలకు ఇచ్చిన డీ ఫాం పట్టా భూములకు, పెరుగులంక భూమికి సంబంధం లేదని అధికారులు వివరించినా, పట్టించుకోకుండా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే రామానాయుడును మధ్యాహ్నం 12 గంటల సమయంలో గణపవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఐదు గంటలకు ఆయన్ను విడిచిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి

- కర్ణాటకలో ఘటన.. మృతులందరూ ఏపీ వాసులు

రాయచూరు రూరల్: కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఏపీ వాసులు మృతి చెందారు. యాదగిరి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు నిలిచి ఉన్న లారీని ట్రాక్స్ క్రూయిజర్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఐదుగురు మరణించగా 13 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. కలబుర్గిలో జరుగుతోన్న ఖాజా బందెనవాజ్ ఉరుసు ఉత్సవాలకు ఏపీలోని నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన దగ్గరి బంధువులైన ముస్లిం కుటుంబాలవారు 18 మందికిపైగా సోమవారం రాత్రి వెలుగోడు నుంచి క్రూయిజర్‌లో బయల్దేరారు. మార్గమధ్యంలో యాదగిరి జిల్లా సైదాపుర సమీపంలోని బళిచక్కర్ వద్ద క్రూయిజర్ వేగంగా వస్తూ రోడ్డుపక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో క్రూయిజర్ ముందు భాగం నుజ్జునుజ్జైంది. యాదగిరి జిల్లా ఎస్పీ వేదమూర్తి, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను యాదగిరి మెడికల్ కాలేజీకి, క్షతగాత్రులను కర్నూలుకు తరలించారు. మృతుల్లో ఒక పురుషుడు, ఇద్దరు బాలికలు, ఇద్దరు మహిళలు ఉన్నారు.


నూజివీడులో మామిడి పౌడర్ యూనిట్

మామిడి రైతుకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండ

నూజివీడులో రూ.5 కోట్లతో ప్రాసెసింగ్ యూనిట్

- మార్కెట్ యార్డు స్థలంలో ఏర్పాటు
- వెయ్యి మంది డ్వాక్రా మహిళలే యజమానులు
- రూ.50 లక్షలు మహిళల పెట్టుబడి.. రూ.4.50 కోట్లు సబ్సిడీ
- ఇప్పటికే మహిళా రైతులతో సమాఖ్య ఏర్పాటు
- మూడు నెలల్లో యూనిట్ సిద్ధం
- రాలిపోయిన, దెబ్బ తిన్న కాయలు మార్కెట్ ధరకే కొనుగోలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అకాల వర్షం, ఈదురు గాలులకు నష్టపోతున్న మామిడి రైతులను ఆదుకునేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ముందుకొచ్చింది. అకాల వర్షాలు, ఈదురు గాలులకు రాలిపోయిన, దెబ్బతిన్న మామిడి కాయలను కొని, వాటి నుంచి పౌడర్ తయారు చేసే సరికొత్త మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌కు శ్రీకారం చుట్టింది. అది కూడా స్థానికంగా ఉండే మహిళా రైతులను యజమానులుగా మార్చి వారి భాగస్వామ్యంతోనే మామిడి పౌడర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయిస్తోంది. రూ. 5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే ఈ యూనిట్‌లో వెయ్యి మంది మహిళలు రూ. 50 లక్షల భాగస్వామ్యం కలిగి ఉంటారు. మిగిలిన రూ.4.50 కోట్లు సబ్సిడీగా లభిస్తుంది. ఏలూరు జిల్లా నూజివీడులోని మార్కెట్ యార్డులో ఈ పరిశ్రమ ఏర్పాటు కానుంది. నూజివీడు మామిడికి ప్రసిద్ధి. ఏలూరు, కృష్ణా జిల్లాల్లో 1.40 లక్షల ఎకరాల్లో ఈ రకం మామిడి సాగవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది మామిడికి మంచి ధర ఉన్నప్పటికీ అకాల వర్షాలకు కాయకు మంగు రావడం, మచ్చలు ఉండటం, ఇతర కారణాలతో మార్కెట్ పూర్తిగా పతనమైంది. ప్రధానంగా నూజివీడులో పెద్ద రసాలు, చిన రసాలు, జలాలు, సువర్ణరేఖ, హిమామ్‌పసంగ్, బంగినపల్లి, తొతాపూరి తదితర వెరైటీలు సాగవుతుంటాయి. అయితే ఎక్కువగా తొతాపూరి, చిన్న రసాలు, పెద్ద రసాలు 90 శాతం మార్కెట్‌లో ఉంటాయి.



నూజివీడులోని మార్కెట్ యార్డు

రాష్ట్రంలో మొదటి ప్రాసెసింగ్ యూనిట్



రాష్ట్రంలోనే మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మొట్టమొదటి మ్యాంగో పౌడర్ యూనిట్ ఇది. నూజివీడులోని మార్కెట్ యార్డులో ఎకరం స్థలంలో రూ. 5 కోట్లతో ఏర్పాటు చేస్తున్నాం. నూజివీడులో 12 వేల ఎకరాలు, ఆగిరిపల్లిలో 20 వేల ఎకరాల్లో మొత్తంగా 32 ఎకరాల్లో రైతులకు ప్రాసెసింగ్ యూనిట్ ఉపయుక్తంగా ఉంటుంది. మహిళలే యజమానులుగా దీన్ని డీఆర్‌డీఏ పర్యవేక్షణలో నిర్వహిస్తారు.

– ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్, ఏలూరు

మార్కెట్ యార్డ్‌లో ప్రాసెసింగ్ యూనిట్

ఈ ఏడాది అకాల వర్షాలు, ఈదురు గాలలకు కాయ రాలిపోవడంతో మామిడి రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. వీటికి పరిష్కారం చూపే విధంగా పంటకు మంచి ధర ఉండేలా స్థానికంగా మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నూజివీడు మార్కెట్ యార్డ్‌లో ఎకరం విస్తీర్ణంలో మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గుజ్జు (పల్ప్) సేకరించే యూనిట్ కాకుండా పచ్చడి మామిడికాయ నుంచి పౌడర్ తీసే యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. స్థానికంగా వెయ్యి మంది మహిళా రైతులను గుర్తించి ఇప్పటికే వారితో ఒక సమాఖ్య రిజిస్ట్రేషన్ చేయించారు. ఒక్కొక్కరు రూ. 5 వేల మూలనిధితో రూ. 50 లక్షలు సమకూర్చుకోగా మిగిలిన రూ. 4.50 కోట్లు కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ యార్డులో స్థలం కేటాయించింది. పథకం అమలు కోసం జిల్లా కలెక్టర్ ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. మరో నెల రోజుల్లో ప్రభుత్వ ఆమోదముద్రతో పనులు ప్రారంభమై మూడు నెలల్లో ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం కానుంది. డీఆర్‌డీఏ నేతృత్వంలో మహిళా సమాఖ్య దీన్ని నిర్వహించనుంది. ప్రత్యేకంగా చెట్టు నుంచి కోసిన కాయలతో పాటు, రాలిపోయిన కాయలు, వర్షానికి దెబ్బతిన్న కాయలను కూడా సమాఖ్య మార్కెట్ ధరకు కొంటుంది. రైతుకు వెంటనే డబ్బు చెల్లిస్తుంది. కాయల నుంచి మామిడి పౌడర్‌ను తయారు చేసి క్యాండీ, జెల్లీలు తయారు చేసే పరిశ్రమలకు విక్రయించేలా ఏర్పాటు చేశారు.

కులవాదుల ఆధిపత్యం చెల్లదిక..



982వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో పెత్తనం, ఆధిపత్యం చలాయించాలని కులవాదులు చూస్తున్నారని, వారి ఆశలు ఫలించవని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 982 రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని అందజేస్తుంటే.. బాబు అండ్ కో సహించలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో మూడు రాజధానులు కావాలని అందరూ బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాష్ట్రంలో 3.50 కోట్ల ఓటు బ్యాంకు ఉందని, వీరందరికీ ప్రయోజనాలు కలిగిస్తుంటే.. కులవాదులకు వచ్చిన నష్టం ఏమిటో తెలియజేయాలన్నారు. చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తుండడంతో తప్పుడు హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నాడని తెలిపారు. చంద్రబాబు నిర్వాకం కారణంగా రాజధాని అభివృద్ధి కుంటుపడిందని మండిపడ్డారు. నాయకులు నూతక్కి జోషి, పెరికె వరప్రసాద్, యాదవ్, పి.దాసు, బేతపూడి సాంబయ్య, పుష్పరాజ్, బొలిమేర శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు సేవలు భేష్!

కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్

ఎ.కొండూరు: గిరిజన తండాల్లో కిడ్నీ వ్యాధి బారినపడిన రోగులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు బాగున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని గిరిజన గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. చైతన్యనగర్‌లో ఏర్పాటు చేసిన కిడ్నీ రోగుల సమావేశంలో పాల్గొన్నారు. కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు, వైద్య సేవలకు ప్రతి నెలా అందుతున్న ఆర్థిక సాయం గురించి అడిగి తెలుసుకున్నారు. తమకు గ్రామ సచివాలయాల ద్వారా ప్రతి నెలా రూ.10 వేల ఆర్థికసాయం అందుతోందని, ఎ.కొండూరు, తిరువూరులలో డయాలసిస్ యూనిట్లు ఉన్నాయని, సత్వర వైద్యసేవలు అందుతున్నాయని రోగులు తెలిపారు. తండాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు గురించి కేంద్ర సహాయ మంత్రికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు.



డయాలసిస్ కేంద్రంలో రోగితో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భారతీ

అనంతరం ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డయాలసిస్ యూనిట్‌ను మంత్రి పరిశీలించారు. రోగులకు డయాలసిస్ యూనిట్ల నిర్వహణ, మందుల సరఫరా, అంబులెన్స్ సదుపాయాలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాధి నిరోధక టీకాల నోడల్ అధికారి డాక్టర్ దేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఎన్‌సీడీ సీడీ ప్రోగ్రాం అధికారి మాధవి, జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, తిరువూరు ఆర్డీవో ప్రసన్నలక్ష్మి, స్థానిక అధికారులు పాల్గొన్నారు. మంత్రి వెంట పలువురు బీజేపీ నాయకులు కూడా ఉన్నారు.

జమ్మూలో ఆగమోక్తంగా క్షీరాధివాసం

8న మహాసంప్రోక్షణ, శ్రీవారి కల్యాణోత్సవం

తిరుమల: జమ్మూలోని మజీన్ గ్రామంలో తావి(సూర్యపుత్రి) నది ఒడ్డున టీటీడీ నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఆగమోక్తంగా క్షీరాధివాసం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు, గోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాలకు గోవు పాలతో అభిషేకం చేశారు. ఆలయ విమానగోపురం, ధ్వజస్తంభాలను అద్దంలో చూపి పాలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన వేణుగోపాలదీక్షితులు, కంకణభట్టార్ రామకృష్ణ దీక్షితులు, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు. కాగా, బుధవారం జలాధివాసం, రత్నన్యాసం, ధాతున్యాసం, విమాన కలశ స్థాపన బింబస్థాపన (విగ్రహప్రతిష్ట), మహాశాంతి తిరుమంజనం, శయనాధివాసం నిర్వహిస్తారు. 8న మహాసంప్రోక్షణ, అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏర్పాట్లను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం మంగళవారం పరిశీలించారు.

తెల్లారితే చెల్లి పెళ్లి ..

- పేరుపాలెం బీచ్‌లో స్నానానికి దిగి పెళ్లి కుమార్తె అన్న, అతని స్నేహితుడు మృతి
- పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో పెళ్లింట తీవ్ర విషాదం



రాజేష్, వినయ్ మృతదేహాలు

మొగల్తూరు: తెల్లారితే చెల్లి పెళ్లి. అందరూ పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. స్నేహితులతో సరదాగా బీచ్‌కు వచ్చిన యువకుడు, అతని స్నేహితుడు నీటిలో మునిగి మృత్యువాత పడిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం బీచ్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వజ్జిపోతు సత్యనారాయణ కుటుంబం హైదరాబాద్‌లోని దిండిగల్‌లో స్థిరపడింది. వారి కుమార్తె వజ్జిపోతు ఆశాజ్యోతికి ఇటీవల వివాహం నిశ్చయించగా, తమ సొంత ఊరైన పాలకొల్లులోనే పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులంతా కలిసి పాలకొల్లు వచ్చారు. బుధవారం పెళ్లి జరగాల్సి ఉంది. అయితే పెళ్లి కుమార్తె అన్న వజ్జిపోతు రాజేష్ (22), నిజాంపేటకు చెందిన అతని స్నేహితుడు బండారు వినయ్ (16) మరో తొమ్మిది మంది స్నేహితులతో కలిసి మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పేరుపాలెం బీచ్‌కి వచ్చారు. స్నానానికి దిగిన రాజేష్, వినయ్ నీటిలో గల్లంతవడంతో అతని స్నేహితులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సహాయంతో వారి కోసం గాలింపు చేపట్టగా, రాజేష్ మృతదేహం లభించింది. కొన ఊపిరితో ఉన్న వినయ్‌ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కుమార్తె పెళ్లి వేళ కుమారుడు శాశ్వతంగా దూరమవడంతో అతని తల్లిదండ్రులు సత్యనారాయణ, నాగవేణి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పల్నాడులో చిరుత పులి సంచారం!



చిరుత పాదముద్రలు

గురజాల: పల్నాడు ప్రాంతంలోని గురజాల నగర పంచాయతీలో మంగళవారం చిరుత పులి సంచారం కలకలం రేపింది. మాడుగుల రోడ్డు సమీపంలో సోమవారం రాత్రి చిరుత పులి సంచరిస్తున్నట్టు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. జియో సెల్ టవర్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు, ఫారెస్టు అధికారులు మంగళవారం ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. చిరుత సంచరించినట్లు చెబుతున్న ప్రాంతంలో చిరుత పులి పాదముద్రలను ఫారెస్టు అధికారులు గుర్తించారు. దానికి సుమారు నాలుగు సంవత్సరాల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. పందుల మృతకళేబరాలు ఆ సమీపంలోనే లభ్యమయ్యాయి. వాటిని చిరుత చంపిందా లేదా అన్నది నిర్ధారణ కావాల్సి ఉంది. ఆ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా రాత్రివేళ బయటకు రావద్దని సూచించారు. చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఫారెస్టు బీట్ ఆఫీసర్ బీవీఆర్ నాయుడు తెలిపారు.

బాలికను కాపాడిన 'దిశ'

- అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై యాప్ ద్వారా ఫిర్యాదు
- పోలీసుల అదుపులో నిందితుడు
- పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు

యద్దనపూడి: తన పట్ల ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో తప్పించుకున్న బాలిక దిశ యాప్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన బాపట్ల జిల్లాలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో నివాసముండే యువకుడు (20) సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్తోన్న పక్కింటి బాలిక(16)ను బలవంతంగా తన గదిలోనికి లాక్కెళ్లే ప్రయత్నం చేశాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. తండ్రి ఫోన్ నుంచి దిశ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయగా 10 నిమిషాల్లోనే బాధితురాలి ఇంటికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. విచారణలో యువకుడు బాలికపై అసభ్యంగా ప్రవర్తించినట్లు తేలడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, దిశ యాప్‌ను కొన్ని నెలల కిందటే సచివాలయ సిబ్బంది తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించారని బాలిక తెలిపింది. ఆపదలో ఉన్న తనకు దిశ యాప్ ఎంతగానో ఉపయోగపడిందని తనలాగే ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ దిశ యాప్ ఒక రక్షణ కవచంలా ఉంటుందని చెప్పింది.

సమాజంలో మంచితనం పెంపొందాలి

- ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



వివిధ అవార్డులు అందుకున్న వారితో గవర్నర్ అబ్దుల్ నజీర్

శివాజీనగర: సమాజంలో నిస్వార్థసేవలు అవసరమని, సేవాభావం కలిగిన సాధకులను గుర్తించి ప్రోత్సాహించటం ప్రస్తుతం అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చెప్పారు. బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రలో మంగళవారం నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఇండియా ఆధ్వర్యంలో నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్స్ అవార్డు, సామాజిక న్యాయరంగంలో మదర్ థెరిసా స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. అవార్డులను ప్రదానం చేసి ప్రసంగించిన గవర్నర్ మాట్లాడుతూ సమాజంలో సేవా మనోభావం మరింత పెంపొందాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా పెరుగుతోందని, దీంతోపాటు మానవత్వ గుణగణాలు కూడా పెరగాలని చెప్పారు. క్లిష్ట పరిస్థితిలో ఉన్నవారికి, అవసరంలో ఉన్నవారికి సమాజం అండగా నిలవాలన్నారు. మానవతా సేవలకు ఫ్లోరెన్స్ నైటింగేల్, మదర్ థెరిసా ఆదర్శనీయమైన వ్యక్తులని పేర్కొన్నారు. సాధకులు వీరి జీవిత విలువలను అలవరచుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి సమాజంలో మంచితనాన్ని విత్తి, మంచితనాన్ని పెంచాలని కోరారు. సహకార రంగంలో సేవచేసినవారిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టర్టిల్ ఫ్రెండ్లీగా ఆర్కే బీచ్

విశాఖ కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట (విశాఖ): విశాఖ ఆర్కే బీచ్‌ను టర్టిల్ ఫ్రెండ్లీ బీచ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్కే బీచ్‌లో అదనపు లైట్లు, ఆర్టిఫిషియల్ లైట్లు ఏర్పాటు చేయడం వల్ల సముద్ర తాబేళ్ల గుడ్ల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయిందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బీచ్‌లో నో లైట్ జోన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సముద్ర తాబేళ్ల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ భూముల రక్షణ, సంపద అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. హరిత వనాల పెంపకంలో భాగంగా 15,000 మొక్కలకు జియో ట్యాగింగ్ చేసి జూలైలో నాటడానికి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జిల్లాలో గంజాయి పెంపకం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అటవీ సంరక్షణ చట్టం కింద 181 కేసులు నమోదు చేశామని డీఎఫ్‌వో అనంత్ శంకర్ కలెక్టర్‌కు వివరించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జూ క్యురేటర్ నందిని సలారియా, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

రూ.కోటి ఎర్రచందనం స్వాధీనం

ఐదుగురు స్మగ్లర్లు అరెస్ట్ • లారీ, రెండు కార్లు సీజ్

తిరుపతి రూరల్: శేషాచలంలో రూ.కోటి విలువైన ఎర్రచందనంను చంద్రగిరి పోలీసులు స్వాధీనం చేసుకుని ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. రెండు కార్లు, ఓ లారీని సీజ్ చేశారు. మంగళవారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ యశ్వంత్ వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లి సాయికాడగుట్ట వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నదని విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తమిళనాడుకు చెందిన మహమ్మద్ రసూల్, భాస్కరన్ జేసురాజ్, అన్నమయ్య జిల్లాకు చెందిన నాగరాజ, అమరేంద్ర రాజును అరెస్టు చేశారు. అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన రూ.కోటి విలువజేసే 400 కిలోల బరువున్న 72 ఎర్రచందనం దుంగలు, 350 కిలోల ఎర్రచందనం చెక్కలు, వాటి పొడి, కట్‌చేసేందుకు వాడిన మిషన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీ చెయిన్ బయటపడింది..

శేషాచలం నుంచి ఎర్రచందనం అక్రమంగా ఢిల్లీకి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు చంద్రగిరి పోలీసులు గుర్తించారు. అడవుల్లో నుంచి తెచ్చిన ఎర్రచందనం భారీ దుంగలను అటవీ సమీప ప్రాంతాల్లో చిన్న చిన్న చెక్కలు చేసి.. గృహోపకరణాలకు వాడే చెక్కల మధ్య ఉంచి బండిబాట మార్గాల నుంచి అడవులను దాటిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తమిళనాడుకు చెందిన బడా స్మగ్లర్ మహమ్మద్ రసూల్ ఈ అక్రమ రవాణాలో కీలక వ్యక్తిగా నిర్ధారించారు. అతనిపై ఇప్పటికే 25 కేసులున్నాయి. ఈ అక్రమ రవాణాలో ఢిల్లీకి చెందిన ఇద్దరు స్మగ్లర్లు కూడా ఉన్నట్లు గుర్తించామని, వారిపై ఇప్పటికే నిఘా ఉంచామని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

నరసన్నపేట: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, కండక్టర్లతో సహా బస్సులో ఉన్న మరో 11 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. మహాసింగికి చెందిన జె.సరోజినికి తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటన విషయం తెలిసిన వెంటనే అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు బాధితులకు మెరుగైన వైద్యం అందించారు. ఎండ తీవ్రత కారణంగా డ్రైవర్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో..బస్సు అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఎస్ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• తెలంగాణ

'అన్న'లకు అనారోగ్యం...!

దీర్ఘకాలిక రుగ్మతులతో సీనియర్ మావోయిస్టులు

- అడవుల్లో వైద్యం అందక.. బయటికి రాలేక అవస్థలు
- తీవ్ర అనారోగ్యంతో 30 మంది వరకు నాయకులు?
- అడవులు దాటితే పోలీస్ ముప్పు పొంచి ఉందన్న భయంతో..

సాక్షి, హైదరాబాద్: ఉద్యమం కోసం అడవుల బాట పట్టిన 'అన్న'లకు అనారోగ్యం తీవ్రంగా బాధిస్తోంది. దశాబ్దాలుగా అడవుల్లో ఎన్నో విపత్కర పరిస్థితులు లెక్క చేయక గడిపిన ఎందరో నాయకులు ఇప్పుడు అనేక జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. ఓవైపు మారిన వాతావరణ పరిస్థితులు, మరోవైపు అడవుల్లో సరైన వైద్య సాయం అందక, కొన్నిసార్లు మందులకు తీవ్ర కొరతతో కొట్టుమిట్టాడుతున్నట్టు సమాచారం. వైద్యం కోసం అడవులు వదిలితే ఎక్కడ పోలీస్ బలగాలకు చిక్కుతామన్న భయంతో తప్పని పరిస్థితుల్లో అడవుల్లోనే మిగిలి చివరకు ప్రాణాలు కోల్పోతున్నారు. కరోనా సమయంలో ఎలాగోలా బతికి బయటపడినా..పోస్ట్ కోవిడ్ సమస్యలు ఇప్పుడు వారిని మరింత కుంగదీస్తున్నట్టు తెలుస్తోంది.

అగ్రనేత ఆర్కే సైతం అనారోగ్యంతోనే..

అనారోగ్య కారణాలతోనే మావోయిస్టు అగ్రనాయకులైన ఆర్కే, హరిభూషణ్‌లు సైతం మృతిచెందారు. ఇక అనారోగ్యంతో ఇటీవలే మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో తీవ్ర అనారోగ్య సమస్యలో మావోయిస్టు కేంద్ర కమిటీతోపాటు తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన వారిలోనూ దాదాపు 30కి పైగా మావోయిస్టు కీలక నేతలు ఉన్నట్టు గతంలో అరెస్టయిన మావోయిస్టు నేతలు చెబుతున్నారు.

మంచానికే పరిమితమైన గణపతి?

మావోయిస్టు ఉద్యమం పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చే పేర్లలో ఒకటైన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి ఆరోగ్యం ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. మావోయిస్టు మాజీ జనరల్ సెక్రెటరీ, ప్రస్తుతం సెంట్రల్ కమిటీ సభ్యుడిగా అత్యంత కీలక నేతగా ఉన్న గణపతి వయస్సు 73కు చేరింది. బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, అల్జీమర్స్‌తో బాధపడుతున్న గణపతి ప్రస్తుతానికి మంచానికే పరిమితమైనట్టు విశ్వసనీయ సమాచారం. సెంట్రల్ కమిటీలో కీలక సభ్యుడు అయిన గాజర్ల రవి సైతం కీళ్ల నొప్పులు, కిడ్నీ సంబంధ జబ్బులతో బాధపడుతున్నట్టు తెలిసింది. సెంట్రల్ కమిటీలోని రామచంద్రారెడ్డి, మొడెం బాలకృష్ణ, పోతుల కల్పన, దండాకరణ్యం స్పెషల్ జోన్ కమిటీలోని నూనె నర్సింహారెడ్డి అలియాస్ జంపన్న వెన్ను నొప్పితో, తెలంగాణ డివిజనల్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్ అధిక రక్తపోటు, గుండె జబ్బుతో బాధపడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇతర కీలక నాయకులు సైతం చాలా మంది షుగర్ , బీపీ, కీళ్ల నొప్పులు ఇతర సమస్యలతో సతమతవుతున్నట్టు తెలుస్తోంది.

స్థానికుల నుంచి సహకారం తగ్గుతోందా?

మరోవైపు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గతంలో మాదిరిగా స్థానికుల నుంచి మద్దతు తగ్గుతోందనీ, అందుకే సకాలంలో మందుల రవాణా, ఇతర సహాయ సహకారాల్లో జాప్యమవుతోందన్న చర్చ నడుస్తోంది. అయితే వైద్య కోసం వచ్చే మావోయిస్టులకు మందులు, వైద్య చికిత్స అందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఫాసిస్టు దాడి ఫలితంగానే మావోయిస్టుల మరణాలు జరుగుతున్నాయని మావోయిస్టు పార్టీ ఆరోపిస్తోంది. కటకం సుదర్శన్ మృతిపై ప్రకటన జారీ సందర్భంగా మావోయిస్టు కేంద్ర కమిటీ మీడియా ప్రతినిధి అభయ్ ఇవే ఆరోపణలు చేశారు.

జనజీవన స్రవంతిలోకి వస్తే మేం చూసుకుంటామంటున్న ఖాకీలు

కానీ పోలీసు అధికారుల వాదన మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది.. అనారోగ్యం పాలైన మావోయిస్టుల జనజీవన స్రవంతిలోకి వస్తే మెరుగైన వైద్య సేవలందిస్తామని తాము బహిరంగంగా, మీడియా ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొంటున్నారు. మావోయిస్టు నాయకులు, కేడర్ లొంగిపోతున్న సందర్భాల్లో, అరెస్టుల సందర్భంగా నిర్వహించే పత్రికా సమావేశాల్లోనూ లొంగిపోతే సరైన వైద్యం అందిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా...

అమెరికాతో బంధం గర్వకారణం: మోదీ



న్యూఢిల్లీ: అమెరికాతో భారత్ అనుబంధం బలోపేతం అవుతుండడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రపంచ శాంతి, సౌభాగ్యం పట్ల అంకితభావం అనే పునాదిపై భారత్–అమెరికా సంబంధాలు నిర్మితమై ఉన్నాయని వివరించారు. రెండు దేశాల ప్రజల మధ్యనున్న అనుబంధం ఈ భాగస్వామ్యాన్ని మరింత దృఢతరం చేస్తోందన్నారు. ఈ మేరకు మోదీ మంగళవారం ట్వీట్ చేశారు. ఆయన త్వరలో అమెరికాలో పర్యటించనున్నారు. ఈ అధికారిక పర్యటన సందర్భంగా అమెరికా పార్లమెంట్(కాంగ్రెస్) ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించాలని కోరుతూ హౌస్ స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీ, సెనేట్ మెజారిటీ లీడర్ చుక్ షూమర్, సెనేట్ రిపబ్లికన్ లీడర్ మిచ్ మెక్‌కానెల్ తదితరులు ప్రధాని మోదీకి ఆహ్వానం పంపించారు. వారికి మోదీ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం రావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మోదీ ఈ నెల 22న అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

భారత నేవీ టార్పెడో పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన భారీ టార్పెడోను నావికా దళం మంగళవారం పరీక్షించింది. నీటి అడుగున లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. భారత నేవీ, భారత రక్షణ, పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో) చరిత్రలో ఇదో మైలురాయిగా నేవీ అభివర్ణించింది. ఇటీవలి కాలంలో హిందూ మహాసముద్ర జలాల్లో పెరిగిపోతున్న చైనా నావికా దళం కదలికలను దృష్టిలో ఉంచుకుని భారత నేవీ పోరాట సంసిద్ధతను మెరుగుపరుచుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

డ్యామ్‌పై రష్యా దాడి!



దాడి జరగ్గానే గండిపడిన దృశ్యం

బాంబుల ధాటికి బద్దలైన రిజర్వాయర్

- ఉక్రెయిన్‌లోని కఖోవ్కా డ్యామ్‌పై రష్యా దుశ్చర్య
- దిగువ ప్రాంతాలను ముంచెత్తుతున్న వరద
- ఎగువ ప్రాంతాలకు తరలిపోతున్న వేలాది మంది స్థానికులు
- రష్యా పర్యావరణ విధ్వంసానికి తెగబడిందన్న జెలెన్‌స్కీ
- ఉక్రెయిన్‌కు మరింత పెరగనున్న కరెంట్ కష్టాలు



ప్రవాహ ఉధృతికి డ్యామ్ కొట్టుకుపోతున్న దృశ్యం

కీవ్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో ఇన్నాళ్లూ భూతలంపై కొనసాగిన బాంబు దాడులు తాజాగా రిజర్వాయర్ లక్ష్యంగా సాగాయి. దీంతో మంగళవారం తెల్లవారుజామున మూడుగంటల ప్రాంతంలో ఖేర్సన్ పరిధిలోని నీపర్ నదిపై నిర్మించిన కఖోవ్కా డ్యామ్ ధ్వంసమై పెద్ద ఎత్తున నీరు దిగువ ప్రాంతాల వైపు ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోండంటూ ముంపుప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు. ప్రస్తుతం మాస్కో అధీనంలో ప్రాంతంలో ఈ డ్యామ్ ఉంది. జలవిద్యుత్ కేంద్రానికి నిలయమైన ఈ డ్యామ్‌ను పేల్చేయడంతో ఉక్రెయిన్‌ను కరెంట్ కష్టాలు మరింతగా చుట్టుముట్టనున్నాయి. డ్యామ్ పేల్చి రష్యా ఈ ప్రాంతంలో పర్యావరణ విధ్వంసానికి దిగిందని ఉక్రెయిన్ ఆరోపించింది. ప్రస్తుతం రష్యా ఆక్రమణలో ఉన్న జపోరిజియా అణు విద్యుత్ కేంద్రానికి నీటి అవసరాలతోపాటు క్రిమియా దక్షిణ ప్రాంత తాగు నీటి అవసరాలను ఈ డ్యామ్ తీరుస్తోంది. డ్యామ్ బద్దలై భారీఎత్తున నీరు దిగువప్రాంతాలకు వెళ్తుండటంతో ముంపు గ్రామాల ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. దాదాపు 100 గ్రామాలు, పట్టణాలను వరద ముంచెత్తనుందని ఒక ప్రభుత్వేతర సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. ఉక్రెయిన్‌పైకి రష్యా దురాక్రమణకు దిగి 15 నెలలు గడిచిన ఈ తరుణంలో యుద్ధం ఇలా డ్యామ్‌పై దాడితో కొత్త మలుపు తీసుకుంది.

ఇటు 22 వేలు.. అటు 16 వేలు

అయితే ఈ డ్యామ్ పేల్చివేతతో ఎవరు లబ్ధిపొందుతారనేది తెలియట్లేదు. ఎందుకంటే రష్యా ఆక్రమిత ప్రాంతాలతోపాటు ఉక్రెయిన్ అధీనంలోని భూభాగాలనూ ఈ వరదనీరు ముంచెత్తనుంది. రష్యా అధీనంలోని వరదముప్పు ప్రాంతాల్లో 22,000 మంది నివసిస్తుండగా, ఉక్రెయిన్ అధీనంలోని ప్రాంతాల్లో 16వేల మంది నివాసమున్నారు. వరద భయంతో అక్కడి వారిని రైళ్లు, బస్సుల్లో రెండు ప్రభుత్వాల అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. దాడి నేపథ్యంలో జాతీయ భద్రతా మండలితో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అత్యవసర సమావేశం నిర్వహించారు. 'దాడిలో రష్యా 80 జనావాసాల్లోని ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టింది' అని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. రష్యా సేనలను తరిమికొట్టే పనిలో ఉన్న ఉక్రెయిన్ ప్రభుత్వానికి ఈ డ్యామ్ సమస్య యుద్ధంలో అవరోధంగా తయారైంది. 'డ్యామ్ బద్దలవడంతో అణువిద్యుత్‌ప్లాంట్‌కు నీటి సరఫరా ఆగిపోతుంది. అయితే, డ్యామ్ నుంచి నీటి సరఫరా ఆగిపోయినా అణువిద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు ఇప్పటికిప్పుడు వచ్చే నష్టమేమీ లేదు' అని ఐరాస అంతర్జాతీయ అణుఇంధన సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. రష్యాకు గతంలోనూ డ్యామ్‌లను పేల్చేసే చెడ్డ అలవాటు ఉందని అమెరికా మాజీ శాస్త్రవేత్త డేవిడ్ హెల్మ్స్ వ్యాఖ్యానించారు.



ప్రమాదంలో జీవ వైవిధ్యం

తక్షణం మేలుకోకుంటే పెను ముప్పే

- క్షీణిస్తున్న జీవవైవిధ్య హాట్‌స్పాట్లు
- కాపాడుకునే కార్యాచరణ తక్షణావసరం
- లేదంటే పూడ్చుకోలేని నష్టమే: శాస్త్రవేత్తలు



ఆకాశాన్నంటే హిమాలయాల నుంచి, మూడు వైపులా ఆవరించిన అనంత సాగర జలరాశి దాకా; సహారా ఇసుక ఎడారి మొదలుకుని, అపార జీవరాశికి ఆలవాలమైన సుందర్బన్ వంటి అడవుల దాకా... అంతులేని జీవ వైవిధ్యానికి పుట్టిల్లు మన దేశం. అలాంటి జీవవైవిధ్యం ఇప్పుడు మనిషి నిర్వాకం వల్ల అక్షరాలా అతలాకుతలమవుతోంది. అస్తిత్వం కోసం పెనుగులాడుతోంది. అతి త్వరలో పూర్తిగా అంతరించిపోయే పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

కారణమేమిటి?

- విచ్చలవిడిగా అడవుల నరికివేత, అడ్డూ అదుపూ లేని పట్టణీకరణ, ఫలితంగా విపరీతమైన కాలుష్యం, వాతావరణ మార్పులు తదితరాలు.
- భారత్‌లో 1990–2020 మధ్య 30 ఏళ్లలోనే ఏకంగా ఏడు లక్షల హెక్టార్ల మేరకు అడవి నరికివేతకు గురైనట్లు యుటిలిటీ బిడ్డర్ నివేదిక చెబుతోంది. ఇదిఇలాగే కొనసాగితే వన్యప్రాణులకు కనీసం నిలువ నీడ కరువవుతుంది.
- విచ్చలవిడిగా విస్తరిస్తున్న నగరాలు క్రమంగా చిత్తడి, గడ్డి నేలల వంటి సహజ జీవ వ్యవస్థలను కబళిస్తున్నాయి.
- ప్రణాళికలేని విస్తరణతో పలు నగరాలు వరదల వంటి సమస్యలతో సతమతమవుతున్నాయి.
- దీని తాలూకు విపరిణామాలకు బెంగళూరే అతి పెద్ద ఉదాహరణ. కేవలం గత 50 ఏళ్లలోనే నగరంలో పచ్చదనం 88 శాతం, నీటి వనరులు 79 శాతం మటుమాయమయ్యాయి!
- పెరిగిపోతున్న ధ్వని, కాంతి కాలుష్యం వణ్యప్రాణుల జీవితాలను, ప్రవర్తనను, పునరుత్పత్తి సామర్థ్యాన్ని... మొత్తంగా వాటి మనుగడనే దెబ్బ తీస్తోంది.

ముప్పేట ముప్పు!

- జీవవైవిధ్యం అంతరిస్తే తలెత్తే విపరిణామాలను ఊహించడం కూడా కష్టమే.
- వాతావరణ ధోరణులు పూర్తిగా మారిపోతాయి. వాటితో పాటే రుతువులూ క్రమం తప్పిపోతాయి. అంతా అల్లకల్లోలమవుతుంది.
- సముద్ర మట్టాలు మరింత పెరిగి తీర ప్రాంతాలను క్రమంగా కనుమరుగవుతాయి.
- సముద్ర జలాల్లో ఆమ్లత్వం పెరిగి వాటిలోని జీవజాలానికి ముప్పు ఏర్పడుతుంది.
- హిమానీ నదాలు శరవేగంగా కరిగిపోతాయి.
- ప్రజలు భారీగా నిర్వాసితులవుతారు. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది.
- పలు అరుదైన జీవ జాతులు శాశ్వతంగా అంతరించిపోతాయి. రాయల్ బెంగాల్ టైగర్, గోల్డెన్ లంగూర్, సిరోయ్ లిలీ వంటివి ఇప్పటికే ఈ జాబితాలోకి చేరాయి.

ఏం చేయాలి?

- జీవవైవిధ్యపరంగా ప్రస్తుత తిరోగమన ధోరణికి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలు తక్షణం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రంగంలోకి దిగాలి.
- శాస్త్రీయ, సమాజ, విధానపరంగా కలసికట్టుగా కృషి జరగాలి.
- పర్యావరణ, సహజ వనరుల పరిరక్షణకు నగదు ప్రోత్సాహకాల వంటివి ఇవ్వాలి. ఉత్తరాఖండ్ ఇప్పటికే ఈ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది.
- తీవ్ర వాతావరణ పరిస్థితులను నిరోధించి పర్యావరణ సమతుల్యతను కాపాడే మడఅడవుల వంటి సహజ వనరులను పూర్తిస్థాయిలో పరిరక్షించుకోవాలి.
- పర్యావరణ విద్యను బోధన ప్రణాళికలో తప్పనిసరి చేయాలి.
- జీవ వైవిధ్య పరిరక్షణ ప్రాధాన్యత ప్రజలందరికీ అర్థమయ్యేలా ముమ్మర ప్రచారం చేపట్టాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

హాట్‌స్పాట్స్.. విశేషాల పుట్టిళ్లు!

- అంతర్జాతీయ గుర్తింపున్న 36 జీవవైవిధ్య హాట్‌స్పాట్లలో నాలుగింటికి భారత్ నెలవు. అవి హిమాలయ ప్రాంతం, పశ్చిమ కనుమలు, ఇండో–బర్మా జోన్, సుందర్బన్ అడవులు.
- ఇవి మనుషులతో పాటు పలు జీవజాలాలకు నిలయాలు.
- తాగునీటి, ఆహార అవసరాలను సమర్థంగా తీరుస్తున్నాయి.
- వాతావరణాన్ని నియంత్రిస్తూ జీవజాలానికి ఎంతో మేలు చేస్తున్నాయి.
- ప్రాణికోటి మనుగడకు అత్యవసరమైన ఆక్సిజన్ ఉత్పత్తికి ఇవి ప్రధాన వనరులు.
- ఈ హాట్‌స్పాట్లు అతి పెద్ద పర్యాటక ఆకర్షణలు. తద్వారా స్థానికులకు ఆర్థికంగా పెద్ద ఆలంబనగా నిలుస్తున్నాయి.
- ఇక ఈ హాట్ స్పాట్స్‌కు మూలమైన అడవుల మీద దేశ జనాభాలో 22 శాతం మంది తమ జీవికకు, సామాజిక, సాంస్కృతిక అవసరాలకు పూర్తిగా ఆధారపడ్డారు.

కరెంట్ షాక్‌తో 40 మంది మృతి?

ఒడిశా దుర్ఘటనలో 40 మృతదేహాలపై కానరాని గాయాలు

భువనేశ్వర్/న్యూఢిల్లీ: ఒడిశాలో ఘోర రైలు ప్రమాద ఘటనలో ఘటనాస్థలి నుంచి స్వాధీనం చేసుకున్న దాదాపు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేవని తెలుస్తోంది. దుర్ఘటన తాలూకు కొత్త విషయం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత వివరాలను గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) మంగళవారం వెల్లడించింది. 'ప్రమాదం జరిగినపుడు చెల్లాచెదురుగా పడిన బోగీలు పై నుంచి వెళ్తున్న ఓవర్‌హెడ్ లోటెన్షన్(ఎల్‌టీ) విద్యుత్ తీగలకు తగిలాయి. దీంతో విద్యుత్ తీగలు తెగి కొన్ని బోగీలపై పడ్డాయి. అప్పటికే ధ్వంసమైన బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులు ఈ విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయి ఉంటారు. అందుకే దాదాపు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేవు' అని ఎఫ్‌ఐఆర్‌లో నమోదుచేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ పి.కుమార్ నాయక్ చెప్పారు.

మార్చురీలో వందకుపైగా మృతదేహాలు

రైలు ప్రమాదంలో 278 మంది మరణించగా 177 మంది ప్రయాణికుల మృతదేహాలను వారి బంధువులు గుర్తుపట్టారు. దాంతో ఈ మృతదేహాల అప్పగింత ప్రక్రియ పూర్తయింది. తలలు తెగి, ప్రమాదంలో నుజ్జునుజ్జయి అసలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాలను.. తమ వారి ఆచూకీ కోసం మార్చురీకి వచ్చిన వారూ గుర్తించలేకపోతున్నారు. ఘటన జరిగిన తర్వాత మృతదేహాలు రెండు మూడు చోట్లకు సరిగా ప్యాక్‌చేయకుండానే తరలించిన కారణంగా కొంతమేర కుళ్లి దుర్వాసన వస్తున్నాయి.

సీబీఐ దర్యాప్తు షురూ

ప్రమాదంపై సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. ఈ దుర్ఘటన వెనుక కుట్ర కోణం ఉందంటూ అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రైల్వే శాఖ, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు మంగళవారం బాలాసోర్ జిల్లాకు చేరుకున్నారు. బాలాసోర్ రైల్వే పోలీసులు రైల్వే చట్టంలోని ఈ నెల 3న వివిధ సెక్షన్ల కింద నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను సీబీఐ అధికారులు స్వీకరించారు. స్థానిక పోలీసులు నమోదు చేసి కేసును దర్యాప్తు ప్రక్రియలో భాగంగా మళ్లీ రిజిస్టర్ చేసి, దాన్ని సొంత ఎఫ్‌ఐఆర్‌గా నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలో మార్పులు చేయడం వల్లే రైలు ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని రైల్వేశాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. సమగ్ర దర్యాప్తు కోసం ఈ కేసును సీబీఐకి అప్పగించాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. రైల్వే శాఖ కార్యకలాపాలపై తమకు కొంత పరిజ్ఞానం ఉందని సీబీఐ అధికారి ఒకరు చెప్పారు. కేసు దర్యాప్తులో భాగంగా రైలు సెక్యూరిటీ సిబ్బంది, ఫోరెన్సిక్ నిపుణుల సాయం కూడా తీసుకుంటామని తెలిపారు. జాయింట్ డైరెక్టర్ (స్పెషల్ క్రైమ్) విప్లవ్‌కుమార్ చౌదరి నేతృత్వంలో ఆరుగురు సభ్యుల సీబీఐ బృందం మంగళవారం మధ్యాహ్నం బహనాగ బజార్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఘటనా స్థలానికి చేరుకుంది. ఘటనాస్థలి, సిగ్నల్ గదిని క్షుణ్నంగా పరిశీలించింది. అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, సిబ్బందిని ప్రశ్నించనుంది.



ఘటనా స్థలిలో సీబీఐ బృందం

'ఖలిస్తాన్' స్థావరాల్లో ఎన్‌ఐఏ సోదాలు

చండీగఢ్: ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్) ఉగ్రవాద సంస్థ స్థావరాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. పంజాబ్‌లో తొమ్మిది ప్రాంతాల్లో, హరియాణాలో ఒక చోట సోదాలు జరిగినట్లు తెలిసింది. భారత్‌లో అశాంతిని సృష్టించడమే లక్ష్యంగా అక్రమ మార్గాల్లో నిధులు సేకరిస్తుండడంతోపాటు పాకిస్తాన్ నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు రహస్యంగా దిగుమతి చేసుకుంటున్నట్లు కేటీఎఫ్‌పై ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలకు సంబంధించి ఎన్ఐఏ అధికారులు గత ఏడాది ఆగస్టులో పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పంజాబ్, హరియాణాలో కేటీఎఫ్ స్థావరాల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. కేటీఎఫ్ సభ్యులు ప్రముఖ వ్యాపారవేత్తల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు.

రాజ్‌నాథ్‌తో జర్మనీ రక్షణ మంత్రి చర్చలు

న్యూఢిల్లీ: రూ.43 వేల కోట్లతో ఆరు స్టెల్త్ కన్వెన్షనల్ జలాంతర్గాములను కొనుగోలు చేయాలన్న భారత్ ప్రణాళికలపై జర్మనీ ఆసక్తి కనబరిచింది. భారత్‌లో నాలుగు రోజుల పర్యటనకు గాను సోమవారం ఢిల్లీ చేరుకున్న జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చలు జరిపారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడులలోని రక్షణ కారిడార్లలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఈ సందర్భంగా పిస్టోరియస్‌ను రాజ్‌నాథ్ ఆహ్వానించారు. భారత్, జర్మనీలు ఉమ్మడి లక్ష్యాల ఆధారంగా రక్షణ సంబంధాలను మరింత పెంచుకునేందుకు అవకాశాలున్నాయని ఇద్దరు నేతలు అభిప్రాయపడ్డారు. కీలక సైనిక వ్యవస్థలను ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు గల అవకాశాలను వారు గుర్తించారు. చైనా దూకుడుతోపాటు ఇండో–పసిఫిక్ తదితర ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులపై ఇరువురు మంత్రులు సమీక్ష జరిపారని అధికారులు చెప్పారు.

బీజేపీతో బంధంలేని పార్టీని చూపించండి

మాజీ ప్రధాని దేవెగౌడ వ్యాఖ్య

బెంగళూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయేయేతర పార్టీలను ఏకతాటి మీదకు తెచ్చేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్న వేళ మాజీ ప్రధాని, జేడీఎస్ చీఫ్ దేవెగౌడ భిన్నస్వరం వినిపించారు. మంగళవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 'దేశంలో ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ బీజేపీతో సంబంధం నెరపని ఏదైనా ఒక పార్టీ ఉంటే అదేంటో తెలుసుకోవాలనుకుంటున్నా. బీజేపీని మేం విభేదిస్తామని కాంగ్రెస్ నేతలు అనొచ్చు. అయితే, ఇక్కడో విషయం చెప్పాలి. మరి అప్పట్లో ఆరేళ్లపాటు బీజేపీకి మద్దతు ప్రకటించిన కరుణానిధి(డీఎంకే)తో కాంగ్రెస్ మంతనాలు జరిపిందిగా.. అందుకే దేశ రాజకీయ ముఖచిత్రం గురించి నేను చర్చించదల్చుకోలేదు. అయినా అది అనవసరం. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా, ఎంపీగా ఇలాంటివి ఎన్నో చూశా. మహారాష్ట్రలో ఏమైందో తెలిసిందేగా. ఇలాంటి ఘటనలను కోకొల్లలుగా ఉదహరిస్తా' అని అన్నారు.

కోర్టుకు హాజరైన ప్రిన్స్ హ్యారీ



లండన్: ఫోన్ హ్యాకింగ్ కేసులో సాక్ష్యం చెప్పేందుకు బ్రిటన్ రాజకుమారుడు, రాజు చార్లెస్–3 రెండో కుమారుడు హ్యారీ(38) మంగళవారం లండన్ హైకోర్టుకు హాజరయ్యారు. విట్‌నెస్ బాక్స్‌లో నిలబడి సాక్ష్యం చెప్పారు. బ్రిటన్ రాజ కుటుంబ సభ్యుడు ఇలా కోర్టుకు హాజరుకావడం దాదాపు 130 సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం. మిర్రర్ గ్రూప్ న్యూస్ పేపర్స్(ఎంజీఎన్) మీడియా సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఫోన్ హ్యాకింగ్‌తోపాటు చట్టవ్యతిరేక పద్ధతుల్లో ప్రముఖుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. మిర్రర్ గ్రూప్ నిర్వాకంపై ప్రిన్స్ హ్యారీతోపాటు వంద మందికిపైగా ప్రముఖులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే హ్యారీ కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పారు. మిర్రర్ గ్రూప్ వల్ల తన జీవితం తీవ్రంగా ప్రభావితమైందని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. తనను ఒక మోసగాడిగా, తాగుబోతుగా, డ్రగ్స్ తీసుకొనే చిల్లర వ్యక్తిగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రతిష్టకు భంగం కలిగించారని పేర్కొన్నారు.



వ్యర్థాల కుప్పల వద్ద పశువులతోపాటు ఆహారం కోసం వెతుకుతున్న గజరాజు. శ్రీలంకలోని అంపారా జిల్లాలో తీసిందీ ఫొటో. అటవీ ప్రాంతం తగ్గడంతో జనావాసాల్లో చొరబడి ఇలా ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఇటీవల ఏనుగు, జింక చనిపోయిన ఉదంతాలు అక్కడ వెలుగుచూశాయి. దీంతో ఒకసారి వాడిపారేసే(సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మార్చురీలో కొడుకును బతికించుకున్నాడు

కోల్‌కతా: బాలాసోర్ మూడు రైళ్ల ప్రమాద ఘటనలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితిలో ఉన్న ఓ యువకుడిని అధికారులు చనిపోయినట్లుగా భావించి, మార్చురీలో పడేశారు. తండ్రి అతడిని గుర్తించి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యుల చికిత్సతో స్పృహలోకి వచ్చాడు. అనంతరం ఆ తండ్రి అతడిని కోల్‌కతాకు తీసుకెళ్లి, మెరుగైన వైద్యం అందించాడు. ఈ నెల 2న బాలాసోర్‌లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అందులోనే హౌరాకు చెందిన బిశ్వజిత్ (24) ప్రయాణిస్తున్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరిన అతడినిచనిపోయాడని భావించి, బహనాగ స్కూల్‌లోని తాత్కాలిక మార్చురీలో పడేశారు. రైలు ప్రమాద వార్త విని, హేలారామ్ మల్లిక్ తన కొడుకు బిశ్వజిత్‌కు ఫోన్ చేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం లేదు. ఒకసారి బిశ్వజిత్ నుంచి కాల్ వచ్చినా అతడి స్వరం పీలగా వినిపించింది. బిశ్వజిత్ సజీవంగానే ఉన్నాడని హేలారామ్ గట్టినమ్మకం. ఆ నమ్మకంతోనే బంధువుతో కలిసి అంబులెన్సులో హుటాహుటిన హౌరా నుంచి 235 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలాసోర్‌కు చేరుకున్నాడు. అక్కడున్న అన్ని ఆస్పత్రుల్లోనూ వాకబు చేశాడు. ఫలితం లేకపోయింది. చివరికి బహనాగ హైస్కూల్‌లోని తాత్కాలిక మార్చురీ వద్దకు వచ్చాడు. అధికారులు అనుమతించలేదు. సరిగ్గా అప్పుడే అక్కడ తోపులాట, ఘర్షణ మొదలైంది. ఆ సమయంలో మార్చురీ బయటకు ఒక చేయి వేలాడుతూ కనిపించింది. అది తన కొడుకుదేనని హేలారామ్ గుర్తించాడు. లోపలికి చొచ్చుకెళ్లి, అచేతన స్థితిలో ఉన్న తన కొడుకు బయటకు తీసుకువచ్చి, వెంటనే అంబులెన్సులో బాలాసోర్ ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు వెంటనే చికిత్స జరిపి కటక్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. పలు చోట్ల ఎముకలు ఫ్రాక్చర్ కావడంతో ఏమాత్రం మాట్లాడే పరిస్థితి లేని బిశ్వజిత్‌ను కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ అతడికి వైద్యులు ట్రామా కేర్ యూనిట్‌లో ఉంచి రెండు శస్త్రచికిత్సలు జరిపారు. బాలాసోర్‌లో బిశ్వజిత్‌ను చనిపోయినట్లుగా అధికారులు ఎందుకు భావించారన్న ప్రశ్నకు వైద్యులు ఏం చెప్పారంటే.. సస్పెండెడ్ యానిమేషన్ అనే పరిస్థితికి బిశ్వజిత్ వెళ్లి ఉంటాడు. ఆ సమయంలో మనిషి అవయవాలు పని చేయడం నెమ్మదిగా మందగిస్తుంది. అలాంటప్పుడు ఆ వ్యక్తి చనిపోయినట్లే భావిస్తుంటారు'అని వివరించారు. 'కొడుకును తిరిగిచ్చిన దేవుడికి కృతజ్ఞతలు' అని హేలారామ్ వ్యాఖ్యానించారు.

మణిపూర్‌లో కాల్పుల కలకలం

ఇంఫాల్: జాతుల వైరంతో నిప్పుల కుంపటిలా తయారైన మణిపూర్‌లో శాంతి నెలకొందని భావిస్తున్న తరుణంలో మళ్లీ కాల్పుల మోత మోగింది. గతంలో కుకీ, మెయిటీ వర్గాల పోరులు ప్రాణాలు కోల్పోగా ఈసారి భద్రతా బలగాల సభ్యుడు ఉగ్రతూటాలకు బలయ్యాడు. సంబంధిత వివరాలను భారత ఆర్మీ వెల్లడించింది. మంగళవారం తెల్లవారుజామున సెరోయూ ప్రాంతంలో బీఎస్ఎఫ్ జవాన్లు, అస్సాం రైఫిల్స్ బలగాల శిబిరంపై అనుమానిత కుకీ ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ రంజిత్ యాదవ్ బుల్లెట్ గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. కక్‌చింగ్ జిల్లాలోని సెరోయూ పాఠశాలలో ఈ ఘటన జరిగింది. ఇద్దరు అస్సాం రైఫిల్స్ బలగం సభ్యులకూ తూటా గాయాలయ్యాయి. కాగా, ప్రభుత్వంతో శాంతి ఒప్పందంపై సంతకాలు చేశాక సుగ్నూలో యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్(యూకేఎల్ఎఫ్) ఖాళీచేసిన శిబిరాన్ని అక్కడి గ్రామస్థులు తగలబెట్టారు. తమ 100కుపైగా ఇళ్లను భస్మీపటలం చేసినందుకు ప్రతీకారంగా ఉగ్రవాదుల శిబిరాన్ని నేలమట్టంచేశామని గ్రామస్తులు చెప్పారు. పుకార్లు, భయం వ్యాప్తిని నిరోధించే ఉద్దేశంతో ఇంటర్నెట్ సేవలను పదవ తేదీ దాకా నిలిపేస్తున్నట్లు మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. తొలిసారిగా మే మూడోతేదీన బ్రాడ్‌బ్యాండ్‌సహా మొబైల్ డాటా సేవలపై ప్రభుత్వం నిషేధం విధించింది. నెల క్రితం కుకీ, మెయిటీ జాతుల మధ్య రాజుకున్న వైరం దాదాపు 98 మంది ప్రాణాలను బలిగొంది.

భారీ మొత్తంలో ఎల్ఎస్‌డీ స్వాధీనం.. ఆరుగురు అరెస్ట్

న్యూఢిల్లీ: డార్క్‌నెట్ ద్వారా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్జాతీయ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)అధికారులు పట్టుకున్నారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.10 కోట్ల విలువైన 15వేల ఎల్ఎస్‌డీ(లైసెర్జిక్ యాసిడ్ డైఇథైల్‌అమైడ్) బ్లాట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంత స్థాయిలో ఎల్ఎస్‌డీ పట్టుబడటం ఇదే మొదటిసారని ఎన్‌సీబీ అధికారులు తెలిపారు. ఆపరేషన్‌లో దొరికిన వారంతా 25–28 ఏళ్ల విద్యావంతులు, యువతేనని, సులువుగా డబ్బు సంపాదించే లక్ష్యంతోనే అడ్డదారి తొక్కారని చెప్పారు. తెరవెనుక ఉంటూ ఇంటర్నెట్ ఆధారిత రహస్య యాప్‌లు, డబ్ల్యూఐసీకేఆర్ వంటి మెస్సెంజెర్ సర్వీసుల ద్వారా దందాను నడుపుతున్నారన్నారు.

ప్రపంచంలో 230 కోట్ల మందికి వంటగ్యాస్ లేదు

ఐక్యరాజ్యసమితి: నేటి ఆధునిక యుగంలోనూ విద్యుత్ వెలుగులు చూడనివారు, వంటగ్యాస్ అందుబాటులో లేనివారు ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ఉన్నారు. ఈ మేరకు ఐదు అంతర్జాతీయ సంస్థలు.. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ, ఇంటర్నేషనల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఏజెన్సీ, ఐక్యరాజ్య సమితి గణాంక విభాగం, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) తాజాగా ఒక నివేదిక విడుదల చేశాయి. ప్రపంచంలో దాదాపు 230 కోట్ల మంది వంటచెరుకుగా కట్టెలు, పిడకల వంటివి ఉపయోగిస్తున్నారని వెల్లడించాయి. 67.50 కోట్ల మందికి ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదని తెలియజేశాయి.

- 2030 నాటికి కరెంటు లేని వారి సంఖ్య 66 కోట్లకు, వంట గ్యాస్ లేని వారి సంఖ్య 190 కోట్లకు తగ్గిపోతుంది.
- 2010లో ప్రపంచంలో 84 శాతం మందికి విద్యుత్ సౌకర్యం ఉంది. 2021 నాటికి ఇది 91 శాతానికి చేరింది. కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తి వల్ల 2019–21లో ఈ వృద్ధి కొంత మందగించింది.
- కరెంటు సౌకర్యం లేనివారిలో 80 శాతం మంది (56.7 కోట్లు) సబ్ సహారన్ ఆఫ్రికాలో నివసిస్తున్నారు.
- ఇంధన వనరుల విషయంలో ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.
- వంట గ్యాస్ లేకపోవడంతో కట్టెలు, పిడకలు వంటి కాలుష్యకారక ఇంధనాల వాడకం, దానివల్ల వాయు కాలుష్యం కారణంగా ప్రపంచంలో ప్రతిఏటా దాదాపు 32 లక్షల మంది చనిపోతున్నారని అంచనా.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
బుధవారం ౹ 7 ౹ జూన్ ౹ 2023

అటవీశాఖ అధికారికి యునెస్కో అవార్డు

– సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు

కొరుక్కుపేట: రామనాథపురం జిల్లా అటవీశాఖ అధికారి జగదీష్ భగస్ యునెస్కో అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ఆయన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా జూన్ 14న ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే కార్యక్రమంలో జగదీష్ భగస్ ఈ అవార్డును అందుకోనున్నారు. కాగా ఈ అవార్డుకు రావడం రామనాథపురం జిల్లాతో పాటు రాష్ట్రానికే గర్వకారణమని పలువురు కొనియాడారు. జగదీష్ భవన్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

రైతు బజార్ల పునరుద్ధరణకు రూ.8.18 కోట్లు నిధులు

కొరుక్కుపేట: రాష్ట్రంలోని 25 రైతు బజార్ల పునరుద్ధరణకు రూ. 8.18 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఓ ఆర్డినెన్స్ జారీ చేసింది. వివరాలు.. 2023–24 ఆర్థిక నివేదికలో వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి దిండుగల్, కళ్లకురిచ్చి, నామక్కల్, పుదుకోట్టై, తిరుపూర్, తిరువన్నామలై తదితర 25 రైతు బజార్లలో రైతులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం దాదాపు రూ. 9 కోట్లు అంచనా వ్యయంతో రైతు బజార్లు పునరుద్ధరణకు అంచనాలు రూపొందించారు. ఈ క్రమంలో తమిళనాడులోని 25 రైతు బజార్లలోని కార్యాలయాలు పునరుద్ధరణ, మరుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థ, రీటైనింగ్ వాల్, ఎలక్ట్రానిక్ పరికరాలు ఏర్పాటు, పైకప్పు మరమత్తులు, రంగులు వంటి వాటిని చేపట్టేందుకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. దీనికోసం రూ. 8.18 కోట్లు నిధులను కేటాయిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసినట్లు అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ అగ్రిబిజినెస్ డైరెక్టర్ తెలిపారు

ఐదు కిలోల బంగారు కడ్డీలు స్వాధీనం

- రూ.2.5 కోట్ల విలువ ఉంటాయని అంచనా
- ముగ్గురి నిందితుల కోసం గాలింపు

అన్నానగర్: మండపానికి మంగళవారం వేకువజామున శ్రీలంక నుంచి పడవలో అక్రమంగా తరలించిన ఐదు కిలోల బంగారు కడ్డీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు వ్యక్తుల కోసం వెతుకుతున్నారు. వివరాలు.. రామనాథపురం కస్టమ్స్ జాయింట్ కమిషనర్ రామచంద్రన్ నేతృత్వంలో అధికారులు హైస్పీడ్ పెట్రోలింగ్ బోటులో మంగళవారం వేకువజామున గల్ఫ్ ఆఫ్ మన్నార్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో నల్లసిన్నత్రి ద్వీపం ప్రాంతంలోని మండపం సమీపంలో అనుమానాస్పదంగా వచ్చిన రిజిస్ట్రేషన్ నంబర్ లేని బోటును ఆపేందుకు యత్నించారు. వెంటనే బోటులో ఉన్న ముగ్గురు వ్యక్తులు నోచరియూరాణి దగ్గర పడవను ఆపి పారిపోయారు. అనంతరం ఆ బోటులోని పార్శిల్‌ను తెరిచి చూడగా.. అందులో దాదాపు 5 కిలోల బంగారు కడ్డీలు ఉన్నాయి. పట్టుబడిన బంగారు కడ్డీల విలువ దాదాపు రూ.2.50 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. తర్వాత బోటును కూడా స్వాధీనం చేసుకున్నారు. పరారైన ముగ్గురు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పలువురు సీనియర్ ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, చెన్నై: పలువురు సీనియర్ ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ, మరి కొందరి శాఖల్లో మార్పులు చేస్తూ సీఎస్ ఇరై అన్బు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవాణా శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కె.పణీంధర్ రెడ్డికి అదనపు బాధ్యతలుగా సహజ వనరుల విభాగం కేటాయించారు. కో–ఆపరేటివ్ సొసైటి రిజిస్ట్రార్ ఎ.షణ్ముగ సుందరాన్ని రవాణశాఖ కమిషనర్‌గా నియమించారు. రవాణ శాఖ కమిషనర్‌గా ఉన్న నిర్మల్ రాజ్‌ను ఖనిజ సంపదల విభాగం డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ బాధ్యతల్లో ఉన్న జయకాంత్‌ను సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్‌గా నియమించారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఉన్న డి.రత్నను ఎక్సైజ్ శాఖకు బదిలీ చేశారు. అలాగే రామనాథపురం అదనపు కలెక్టర్‌గా ఉన్న కె.జె.ప్రవీణ్ కుమార్‌ను మదురై కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడున్న కమిషనర్ సిమ్రాన్ జీత్ సింగ్ సహ్లోన్‌ను చెన్నై మెట్రో వాటర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సేలం అదనపు కలెక్టర్ ఎస్.బాలచందర్‌ను సేలం కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు.

11న చెన్నైకు అమిత్ షా

– వేలూరులో బహిరంగ సభ



సాక్షి, చెన్నై: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈనెల 11న చెన్నైకు రానున్నారు. దక్షిణ చెన్నై లోక్ సభ నియోజకవర్గం బీజేపీ నేతలతో సమావేశం నిర్వహించడంతో పాటు వేలూరులో జరిగే బహిరంగ సభకు ఆయన హాజరు కానున్నారు. వివరాలు.. ఒక రోజు పర్యటన నిమిత్తం ఈనెల 8వ తేదీన వేలూరులో అమిత్ షా పర్యటించాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల ఆ పర్యటన రద్దయ్యింది. తాజాగా ఈనెల 11వ తేదీన అమిత్‌షా రాష్ట్రానికి రానున్నారు. ఆ రోజున ఉదయం ఢిల్లీ నుంచి చెన్నైకు వచ్చే అమిత్ షా పళ్లికరణైలో జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు. మొదటగా ఇక్కడ దక్షిణ చెన్నై లోకసభ నియోజకవర్గ బీజేపీ నేతలతో సమావేశం అవుతారు. తర్వాత విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక హెలికాప్టర్‌లో వేలూరుకు వెళ్లి పళ్లి కొండలో జరిగే బీజేపీ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం చెన్నైకు చేరుకుని రాత్రి ఢిల్లీకి బయలు దేరి వెళ్లనున్నారు. దీంతో అమిత్ షా పర్యటించే ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పోలీసు యంత్రాంగం దృష్టి పెట్టింది. అలాగే అమిత్ షా పర్యటన విజయవంతానికి బీజేపీ వర్గాలు కార్యాచరణ ప్రారంభించాయి.

గవర్నర్‌పై గరంగరం

గవర్నర్ ఆర్‌ఎన్ రవి మరోసారి తమ ప్రభుత్వంపై పరోక్షంగా రాజకీయ విమర్శలు గుప్పించడాన్ని డీఎంకే వర్గాలు తీవ్రంగా పరిగణించాయి. సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనను విమర్శిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలను మంత్రులు, డీఎంకే కూటమి పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే మూల్యం తప్పదని హెచ్చరించాయి.

- రాజకీయ విమర్శలు చేయడంపై అధికార పార్టీ నాయకుల ఆగ్రహం
- తీరుమార్చు కోవాలని హితవు
- రాష్ట్రంలో మళ్లీ రాజ్‌భవన్ వర్సెస్ అన్నా అరివాలం

అన్నా అరివాలం



రాజ్‌భవన్





మాట్లాడుతున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి గత కొంత కాలంగా తరచూ డీఎంకే పాలకులను టార్గెట్ చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. దీంతో గవర్నర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే సందర్భాల్లో వాటిని ఖండిస్తూ డీఎంకే పాలకులు కుడా అసెంబ్లీ వేదికగా తీర్మానాలు చేయడం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో గత నెల సీఎం స్టాలిన్ సింగపూర్, జపాన్ దేశాల పర్యటనకు వెళ్లారు. జనవరిలో జరిగే పెట్టుబడిదారుల మహానాడుకు హాజరు కావాలని అక్కడి పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు. రూ. 13 వేల కోట్ల మేరకు పెట్టుబడులకు సంబంధించిన అవగాహన ఒప్పందాలు చేసుకొచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ఊటీ వేదికగా జరిగిన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌ల మహానాడులో గవర్నర్ రాష్ట్ర విద్యా విధానానికి వ్యతిరేకంగా పలు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సీఎం స్టాలిన్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శించడం మంగళవారం వెలుగులోకి వచ్చింది. విదేశీ పర్యటనలకు వెళ్లినంత మాత్రాన పెట్టుబడులు రావని, ఆహ్వానించినంత మాత్రాన పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వచ్చేయరంటూ విమర్శలు చేశారు. ఇది డీఎంకే మిత్ర పక్షాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపింది. దీంతో రాష్ట్రంలో మరోసారి రాజ్‌భవన్ వర్సెస్ అన్నా అరివాలం (డీఎంకే కార్యాలయం) అన్నట్లు పరిస్థితులు నెలకొన్నాయి.

మండిపడిన మంత్రులు

గవర్నర్ ఆర్‌ఎస్ వ్యాఖ్యలు వెలుగులోకి రావడంతో మంత్రులు తీవ్రంగా ఖండించారు. ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. తమిళనాడు ప్రజలు, అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని వ్యక్తి ఈ గవర్నర్ అని ధ్వజమెత్తారు. తమిళనాడు గురించి, తమిళ ప్రజల గురించి ఆలోచించక పోగా, పెట్టుబడులను అడ్డుకునే విధంగా గవర్నర్ వ్యాఖ్యలు ఉండడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు స్పందిస్తూ, గవర్నర్ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతాపార్టీ నాయకులు కూడా ప్రశ్నలు గుప్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ విదేశీ పర్యటనలకు వెళ్లడం ద్వారానే ఆయా దేశాల మధ్య సత్సంబంధాలు, పెట్టుబడులు తదితర ప్రక్రియలు సజావుగా సాగుతున్నానే విషయాన్ని ఒక్కసారి గుర్తెరగాలని సూచించారు. గుజరాత్ సీఎంగా ఉన్న కాలంలోనూ నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు వెళ్లారని, ఇవన్నీ ఈ గవర్నర్ మరిచినట్లున్నారని మండి పడ్డారు. ఇకనైనా గవర్నర్ తన ధోరణి మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. ఉన్నత విద్యామంత్రి పొన్ముడి స్పందిస్తూ, ఆయన గవర్నర్‌గా కాకుండా రాజకీయ నాయకుడిగా విమర్శలు, ఆరోపణలు చేయడం అలవాటుగా పెట్టుకోవడం శోచనీయమని విమర్శించారు. ఎండీఎంకే నేత వైగో పేర్కొంటూ, తమిళనాడు ప్రజల బద్ధ శత్రువుగా గవర్నర్ మారారని మండి పడ్డారు.

చెన్నై – బెంగళూరు మధ్య వేగవంతమైన రైలు

– గంటకు 220 కిలోమీటర్ల వేగంతో నడిచేలా ట్రాక్



సాక్షి, చెన్నై : చెన్నై – బెంగళూరు నగరాల మధ్య అత్యంత వేగవంతమైన రైలు సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే యంత్రాంగం నిర్ణయించింది. ఇందుకు తగ్గ ప్రక్రియపై దృష్టి పెడుతూ నివేదిక బాధ్యతలను ఓ ప్రైవేటు సంస్థకు తాజాగా అప్పగించింది. వివరాలు.. చెన్నై – బెంగళూరు మధ్య రైలు ప్రయాణ దూరం 350 కిలోమీటర్లు. వీటిమధ్య ప్రస్తుతం నాలుగున్నర నుంచి ఆరున్నర గంటల మేరకు ప్రయాణ సమయం తీసుకుంటోంది. వందే భారత్, డబుల్ డెక్కర్ రైలు సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వందే భారత్ రైలు ద్వారా ప్రయాణ సమయం 4.30 గంటలుగా ఉంది. ఈ పరిస్థితుల్లో చెన్నై – బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌పై కేంద్రం దృష్టి పెట్టి ఈ మార్గంలో అతి వేగంతమైన రైలు ఏర్పాటు చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రెండు గంటల్లోనే..

గంటకు 220 కి.మీ వేగంతో రైలు నడిచేందుకు వీలుగా ఈ మార్గంలో ప్రత్యేక రైల్వే ట్రాక్ రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఈ ట్రాక్‌పై గంటకు 200 కి.మీ వేగంతో రైలు నడిచినా చెన్నై – బెంగళూరు మధ్య ప్రయాణ సమయం 2 గంటలే అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మార్గంలో పనులు చేపట్టేందుకు సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పణ బాధ్యతలను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఇందుకోసం రూ. 8.30 కోట్లు వెచ్చించారు. చెన్నై నుంచి బెంగళూరు వరకు ప్రత్యేక రైల్వే మార్గానికి అవసరమయ్యే ట్రాక్ కోసం స్థల సేకరణ, భూ సామర్థ్యం, ఈ మార్గంలో వచ్చే పట్టణాలు, నగరాలు, గ్రామాలు, క్రాసింగ్స్ తదితర సమగ్ర పరిశీలన మేరకు మూడు నెలల్లో ఈ ప్రైవేటు సంస్థ కేంద్ర రైల్వే యంత్రాంగానికి నివేదికను సమర్పించనుంది. దాని తర్వాత ఈ మార్గంలో 16 బోగీలతో 200 కి.మీ వేగంతో వేగవంతమైన రైలు నడిపేందుకు చర్యలుంటాయని ఓ రైల్వే అధికారి మంగళవారం పేర్కొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

అన్నానగర్: కడలూరులో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి 500 ఎకరాల్లో అరటి చెట్లు విరిగి దెబ్బతిన్నాయి. వివరాలు.. కడలూరు జిల్లా గత కొన్ని రోజులుగా అగ్ని గుండాన్ని తలపిస్తోంది. అగ్ని నక్షత్రం పూర్తయిన తర్వాత కూడా ఇక్కడ సూర్యుని ప్రభావం తగ్గలేదు. కడలూరులో సోమవారం 103.64 ఫారెన్ హీట్ డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. ఇదిలా ఉండగా సాయంత్రం 4.30 గంటలకు కడలూరు, రామాపురం, కీరపాళయం, ఒధియాడికుప్పం, వెల్లకరై, అరసాదికుప్పం, లజ్‌సోతనైప్పాళయం, అన్నవల్లి, వగుల్తంపట్టు, పులియూరు వెస్ట్, పులియూరు తూర్పు, కోరనపట్టు, మదనగోపాలపురం, కట్టియాన్‌కుప్పం సహా పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి అరటి చెట్లు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న అరటి పంట దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు.



నేలకొరిగిన అరటిచెట్లు

టార్గెట్ ఐఏఎస్ మలర్ వెళి

- రంగంలోకి డీవీఏసీ
- 10 చోట్ల సోదాలు



సాక్షి, చెన్నై: ధర్మపురి కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఐఏఎస్ అధికారి మలర్ వెళి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి స్వతంత్రంగా వ్యవహరించి రూ. 1.36 కోట్ల నిధులను పక్కదారి పట్టించినట్టు డెరెక్టర్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరెప్షన్ (డీవీఏసీ) విచారణలో తేలింది. దీంతో ఆమెతో పాటు సన్నిహితంగా కాంట్రాక్టర్లు ఇరువురిపై కేసు నమోదు చేశారు. మంగళవారం చెన్నై, ధర్మపురి, విల్లుపురం, పుదుకోట్టైలో ఆ ముగ్గురికి చెందిన 10 చోట్ల విజిలెన్స్ అధికారులు సోదాలు చేపట్టారు. వివరాలు.. 2018–20 మధ్య ధర్మపురి జిల్లా కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి మలర్ వెళి పనిచేశారు. ఈ కాలంలో ఆ జిల్లాల్లోని 251 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆస్తి, నీరు, వర్తకం తదితర పన్నుల వసూళ్లకు గాను ప్రభుత్వం తరఫున లక్షా 25 వేల పుస్తకాలను ముద్రించారు. అయితే దీన్ని టెండర్ల ద్వారా కాకుండా స్వతంత్రంగా వ్యవహరించి.. తనకు కావాల్సిన వ్యక్తులైన క్రెసెంట్ తాహీర్ హుస్సేన్, నాగా ట్రేడర్స్ వీరయ్య పళణి వేల్‌కు పనులను ఏకపక్షంగా అప్పగించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అధిక మొత్తాలను వారికి ముట్ట చెప్పినట్లు గణాంకాల్లో తేలాయి. ఫలితంగా ప్రభుత్వ సొమ్ము రూ.1.36 కోట్లు ఈ పనుల కారణంగా దుర్వినియోగమైనట్లు తెలిసింది. దీంతో ధర్మపురి, సేలం విజిలెన్స్ డీఎస్పీ కృష్ణరాజన్ నేతృత్వంలోని బృందం విచారణ చేపట్టింది.

కేసు నమోదు

ప్రస్తుతం ఐఏఎస్ అధికారి మలర్ వెళి సైన్స్ సిటీ ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఆమెతో పాటు తాహీర్ హుస్సేన్, వీరయ్య పళణి వేల్‌పై సోమవారం సాయంత్రం డీవీఏసీ వర్గాలు కేసు నమోదు చేశాయి. మంగళవారం ఉదయం మలర్ వెళితోపాటు తాహీర్ హుస్సేన్, వీరయ్య పళణి వేల్‌లకు సంబంధించిన నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు డీవీఏసీ అధికారులు రంగంలోకి దిగారు. చెన్నై విరుగంబాక్కంలోని మలర్ వెళి నివాసంలో డీఎస్పీ కృష్ణరాజన్ బృందం సోదాల్లో నిమగ్నమైంది. చెన్నైలోని క్రెసెంట్, నాగా ట్రేడర్స్ కార్యాలయాల్లోను, విల్లుపురం, ధర్మపురి, పుదుకోట్టైలోనూ తనిఖీలు చేపట్టారు. మొత్తంగా 10 చోట్ల డీవీఏసీ సోదాలు జరుగుతున్నాయి. ఇందులో పలు ఆస్తులకు సంబంధించిన దస్తావేజులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

గోవింద నామస్మరణతో పులకించిన కంచి



విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు



రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

సాక్షి, చెన్నై: గోవిందా.. గోవిందా అన్న నామస్మరణతో మంగళవారం కాంచీపురం పులకించింది. లక్షాదిగా తరలివచ్చిన భక్తులు రథోత్సవంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక నగరం కాంచీపురంలో వెలసిన వరదరాజ స్వామి ఆలయంలో గత నెల 31వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో వరదరాజ స్వామి వారు రోజూ ఉదయం సాయంత్రం వేళలో వివిధ వాహనాల్లో భక్తులకు దర్శనం ఇస్తూ వచ్చారు. ఈ ఉత్సవాల్లో అత్యంత ముఖ్య ఘట్టమైన రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవి భూదేవి సమేతంగా వరదరాజ స్వామి వారు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాల్ని ధరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. 73 అడుగులతో కూడిన రథంలో స్వామి వారు ఆశీనులై భక్తుల్ని కటాక్షించారు. లక్షలాదిగా భక్తులు తరలి వచ్చి రథాన్ని లాగారు. గోవిందా..గోవింద అన్న నామస్మరణతో కాంచీపురం వీధులు మారుమోగాయి. రథోత్సవం సందర్భంగా భక్తుల సేవలో పలు సంస్థలు తరించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. అలాగే కాంచీపురంలో పలు మార్గాల్లో ట్రాఫిక్ మార్పులు చేశారు.

సముద్రంలో మరోసారి బంగారం గాలింపు

సాక్షి, చెన్నై: రామేశ్వరం సముద్ర తీరంలో స్మగ్లర్లు మళ్లీ బంగారం పడేశారు. దీని కోసం గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. ఇటీవల కాలంగా శ్రీలంక మీదుగా తమిళనాడులోకి రామేశ్వరం సముద్ర తీరం గుండా బంగారం స్మగ్లింగ్ పెరిగింది. దీనిపై డీఆర్ఐ అధికారులు, కోస్టు గార్డు, సముద్ర తీర భద్రతా విభాగం నిఘా ఉంచింది. గత నెల 30 కేజీల మేరకు బంగారం సీజ్ చేశారు. స్మగర్లు బంగారాన్ని సముద్రంలో పడేసినా తీవ్ర గాలింపులతో అధికారులు వెలికి తీస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సోమవారం రాత్రి తమకు అందిన సమాచారంతో అధికారులు ఆ తీరం వెంబడి గ్రామాలలోనిఘా ఉంచారు. ఉచ్చిపులి తీరంలోకి ఓ అనుమానిత పడవ రావడాన్ని గుర్తించారు. దానిని చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన ఆ పడవలో వచ్చిన స్మగ్లర్లు తమ వెంట తెచ్చుకున్న ట్రావెల్ బ్యాగ్‌లను సముద్రంలో పడేసి ఉడాయించారు. ఒక బ్యాగ్‌లో మాత్రం 5 కేజీల బంగారం బయట పడింది. మరికొన్ని బ్యాగ్‌లు సముద్రంలో పడేసి ఉండడంతో వాటి కోసం మంగళవారం ఉదయం నుంచి గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు.

9 నుంచి స్టాలిన్ డెల్టా బాట

- 12న మెట్టూరు నుంచి నీటి విడుదల
- 500 అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభించిన ముఖ్యమంత్రి



సీఎం స్టాలిన్‌కు ఐపీఎల్ ట్రోఫీ అందజేస్తున్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు యాజమాన్యం

సాక్షి, చెన్నై: డెల్టా జిల్లాల పర్యటనకు సీఎం స్టాలిన్ ఈనెల 9న బయలు దేరనున్నారు. ఈ క్రంలో 12వ తేదీన మేట్టూరు జలాశయం నుంచి సాగు నిమిత్తం రైతులకు నీటిని విడుదల చేయనున్నారు. వివరాలు.. డెల్టా రైతుల వర ప్రదాయినిగా ఉన్న మేట్టూరు జలాశయం కావేరి జలాలపైనే ఆధారపడ్డ విషయం తెలిసిందే. గత మూడు నాలుగేళ్లుగా కర్ణాటకలో నైరుతి రుతు పవనాల ప్రభావంతో వర్షాలు సంవృద్ధిగా కురిశాయి. దీంతో పలుమార్లు మేట్టూరు జలాశయం నిండింది. దీంతో అన్నదాతకు పూర్తిస్థాయిలో సాగుకు నీరు లభిస్తూ వచ్చింది. గత ఏడాది నిర్ణీత జూన్ 12వ తేదీకి ముందుగానే ఈ జలాశయం నుంచి నీటిని సాగు నిమిత్తం విడుదల చేశారు. ఈ ఏడాది నైరుతీ రుతు పవనాల రాక ఆలస్యమవుతున్నా, జలాశయంలో నీళ్లు పుష్కలంగానే ఉండడం విశేషం. ప్రస్తుతం ఈ జలాశయంలో 103 అడుగుల మేరకు నీటిమట్టం ఉంది. 2 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా జలాశయంలోకి వస్తోంది. అలాగే 68 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో నిర్ణీత జూన్ 12వ తేదీన జలాశయం నుంచి సాగుకు నీటిని విడుదల చేయానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పనుల్లో భాగంగా కావేరి తీరం , డెల్టా జిల్లాలో నీరు ఎలాంటి ఆటంకం లేకుండా పంట పొలాలలోకి వెళ్లేందుకు వీలుగా పూడిక తీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈపనులను పరిశీలించడమే కాకుండా, రైతులను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలకు సీఎం నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన ఆయన డెల్టా జిల్లాల పర్యటనకు ఏర్పాట్లు చేసుకున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఉరకలు పరుగులు తీస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్నిరకాల ఏర్పాట్లు సకాలంలో సిద్ధం చేసి ఉంచే విధంగా చర్యలు చేపట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఈనెల 12వ తేదీన మేట్టూరు జలాశయం నుంచి రైతులకు సాగుకు నీటిని విడుదల చేయనున్నారు. నీటి విడుదలకు సమయం ఆసన్నం కావడంతో రైతులు పొలం బాట పట్టారు. దుక్కిదున్ని, సాగుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా, కోయంబత్తూరు జిల్లా ఆనమలై పరిధిలోని ఆలియారు నీటి ఆధారిత రిజర్వాయర్ నీటిని సాగు నిమిత్తం రైతులకు విడుదల చేయానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 7వ తేదీ నుంచి సాగు నిమిత్తం నాలుగు నెలలు నీటిని విడుదల చేయనున్నారు.

రూ. 125 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లు

ఆరోగ్య శాఖ నేతృత్వంలో రాష్ట్రంలో రూ. 125 కోట్లతో 500 చోట్ల అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిని సీఎం స్టాలిన్ మంగళవారం రాత్రి ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వీలుగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విస్తృతం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తరహాలో పట్టణాలు, నగరాలలోనూ అర్బన్ హెల్త్ సెంటర్లకు చర్యలు తీసుకున్నారు. 21 కార్పొరేషన్లు, 63 మునిసిపాలిటీల్లో 708 ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో రూ. 125 కోట్లతో 500 హెల్త్ సెంటర్ల పనులు ముగించారు. ఒక్కో హెల్త్ సెంటర్ రూ. 25 లక్షలతో ఏర్పాటు చేశారు.

సీఎంకు ఐపీఎల్ ట్రోఫీ అందజేత

గుజరాత్ – చెన్నై మధ్య జరిగిన ఐపీఎల్ తుది పోరు గురించి తెలిసిందే. ఇందులో గెలిచిన చెన్నై జట్టు ఐదో సారి ట్రోఫీని కైవశం చేసుకుంది. ధోని సారథ్యంలోని చెన్నై సూపర్‌కింగ్స్ సాధించిన ఈ ట్రోఫీని మంగళవారం సీఎం క్యాంప్ ఆఫీసుకు ఆ జట్టు యాజమాన్యం తీసుకొచ్చింది. ఈ ట్రోఫీని సీఎం స్టాలిన్‌కు ఇండియా సిమెంట్స్ ఎండీ, ఆ జట్టు యజమాని శ్రీనివాసన్, డైరెక్టర్ రూప గురునాథ్ అందజేశారు. ఈ సందర్భంగా వారికి సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టును అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖమంత్రి ఉదయ నిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.20.37 లక్షల బంగారం స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో సోమవారం రాత్రి రూ.20.37 లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తిరుచ్చి విమానాశ్రయానికి సోమవారం రాత్రి సింగపూర్ నుంచి ఇండిగో విమానం చేరుకుంది. కస్టమ్స్ అధికారులు ఇందిలోని ప్రయాణికులను తనిఖీ చేశారు. అప్పుడు ఓ ప్రయాణికుడు తన ఎలక్ట్రానిక్ వస్తువుల్లో దాచిన 338 గ్రాముల బంగారాన్ని గుర్తించి సీజ్ చేశారు. దీని విలువ రూ.20.37 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నైలో గృహాలకు పెరిగిన డిమాండ్

సాక్షి, చెన్నై: చెన్నైలో విశాలమైన గృహాలకు డిమాండ్ పెరిగినట్లు మ్యాజిక్ బ్రిక్స్ సర్వేలో తేలింది. ఈ వివరాలను మంగళవారం స్థానికంగా ప్రకటించారు. 2023 మొదటి త్రైమాసికంలో చెన్నైలో 3 బెడ్ రూమ్‌లతో కూడిన విశాలమైన నివాసాలకు డిమాండ్ పెరిగినట్టు డీఎల్ఎఫ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆకాశ్ ఓహ్రి వివరించారు. అయితే అపార్ట్‌మెంట్‌లకు డిమాండ్ స్వల్పంగా తగ్గినట్టు పేర్కొన్నారు. విలాసంగా మాత్రమే కాకుండా పెద్దపెద్ద ఖాళీ స్థలాలకు కూడా డిమాండ్ పెరిగిందన్నారు. కరోనా మహమ్మారి అనంతరం ఉల్లాసమైన జీవనం కోసం, స్థిరమైన పెట్టుబడిగా గృహాలకు ప్రాముఖ్యతను ఇస్తున్న వారు అధికంగా ఉన్నట్లు తెలిపారు. చెన్నై అంబత్తూరు, పోరూర్, వేళచ్చేరి పరిసరాలు ఉద్యోగ, ఉపాధి కేంద్రాలుగా ఉండడంతో ఈ పరిసరాలలో డిమాండ్ ఎక్కువగా ఉన్నట్టు చెప్పారు. ఓఎంఆర్(పాత మహాబలిపురం రోడ్డు) అద్భుతమైన కనెక్టివిటీ, ప్రజా రవాణా, కీలక ఉపాధి కేంద్రాలతో రోజు వారి ప్రయాణాలకు ఉత్తమ ఎంపికగా నిలిచినట్టు చెప్పారు. రియాల్టీ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశాంక్ వశిష్ట మాట్లాడుతూ, 2022–23 మధ్య చెన్నైలో కనెక్టివిటీని మెరుగు పరచడం, ప్రజా సౌకర్యాలను మెరుగు పరచడం, పెట్టుబడులు, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యంగా ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని వివరించారు. డీఎల్ఎఫ్ చెన్నై ఒక రకంగా ప్రకృతి వనరులతో, థీమ్ ఆధారిత ప్లాట్ డెవలప్‌మెంట్ పార్క్ ఎస్టేట్‌ను మహాబలిపురం రోడ్డులో ప్రారంభించినట్లు గుర్తు చేశారు.

చెన్నై - శ్రీలంక మధ్య లగ్జరీ నౌక


జెండా ఊపి నౌకను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి, అధికారులు

సాక్షి, చెన్నై: చెన్నై – శ్రీలంకలోని కొన్ని హార్బర్‌లను కలుపుతూ పర్యాటక లగ్జరీ నౌక సేవలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ వివరాలను చెన్నై హార్బర్ వర్గాలు ఓ ప్రకటన ద్వారా వెల్లడించాయి. చెన్నై నుంచి ఎంవీఎం ప్రెస్ పేరిట అంతర్జాతీయ పర్యాటక లగ్జరీ నౌక సేవలను కేంద్ర నౌకాయన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అనుమతిచ్చినట్లు వివరించారు. చెన్నై హార్బర్, ఎన్నూరు హార్బర్‌లలో ఉత్తమ సేవలను అందించిన వారికి మంత్రి చేతుల మీద సత్కారం జరిగినట్లు పేర్కొన్నారు. అలాగే తండయార్ పేటలోని హార్బర్ పాఠశాలలో పది, ప్లస్–2లో ఉత్తమ మార్కులు సాధించినవారికి ప్రోత్సహకాలను అందజేశామని వివరించారు.

నౌక పయనం..

హార్బర్ చైర్మన్ సునీల్ పాలీవాల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెన్నై – శ్రీలకంలోని కాంగేశం, త్రికోణమలై, అంబన్ తోటా హార్బర్‌ను కలుపుతూ ఈ పర్యటక నౌక సేవలకు మంత్రి జెండా ఊపి ప్రారంభించినట్లు తెలిపారు. ప్రప్రథమంగా చెన్నై నుంచి శ్రీలంకకు పర్యాటక నౌక సేవలకు శ్రీకారం చుట్టామని, ప్రయాణికులు, పర్యాటకుల స్పందన మేరకు సేవలు విస్తృతం అవుతాయని వివరించారు. అలాగే చెన్నై హార్బర్‌ను పచ్చదనంతో నింపే విధంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో నిఘా కంట్రోల్ రూమ్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఐజీ ముత్తుస్వామి

వేలూరు: వేలూరు ఎస్పీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ అండ్ రెస్పాన్స్ సెంటర్‌ను రాష్ట్ర డీజీపీ శైలేంద్రబాబు మంగళవారం ఉదయం చెన్నై నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వేలూరులో డీఐజీ ముత్తుస్వామి, ఎస్పీ మణివన్నన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ వేలూరు జిల్లా వ్యాప్తంగా టోల్ బూత్‌లు, జాతీయ రహదారుల్లోని వాహనాలను పర్య వేక్షించేందుకు అవసరమైన ప్రత్యేక నిఘా కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా వేలూరు కార్పొరేషన్ పూర్తిగా మొత్తం 1,200 చోట్ల నిఘా కెమెరాలు ఉన్నాయని, వాటిని పూర్తిగా వేలూరు ఎస్పీ కార్యాలయం నుంచే సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కెమెరాల ద్వారా నేరస్తులను త్వరగా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలతో పాటు పట్టణంలోని ముఖ్యమైన చోట్ల అధునాతన కెమెరాలు అమర్చినట్లు వెల్లడించారు. అనంతరం పోలీసులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్నేహితుడు మరణించాడనే వేదనతో వృద్ధుడి మృతి

అన్నానగర్: మన్నార్‌కుడి సమీపంలో మంగళవారం స్నేహితుడు మృతి చెందాడనే దిగ్భ్రాంతితో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు..తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడిలోని 4వ వీధికి చెందిన శివరామకృష్ణన్ (80), అశేషం ప్రాంతానికి చెందిన రామలింగం (80) చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. స్కూల్, టెక్నికల్ కాలేజీల్లో కలిసి చదువుకున్నారు. బమనిలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో కూడా కలిసి పని చేశారు. ఇద్దరూ ఒకే రోజు పదవీ విరమణ చేశారు. వీరిద్దరే కాకుండా వారి కుటుంబాలు కూడా సన్నిహితంగా ఉంటూ వచ్చాయి. ఈ స్థితిలో సోమవారం శివరామకృష్ణన్ వయోభారంతో మృతి చెందాడు. శివరామకృష్ణన్ మృతిపై కుటుంబ సభ్యులు ఆయన స్నేహితుడు రామలింగానికి సమాచారం అందించారు. చిన్నప్పటి నుంచి తనతో పాటు ఉన్న ప్రాణస్నేహితుడి మరణ వార్తను విని రామలింగం మంగళవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. చిన్నప్పటి నుంచి కలిసి మెలిసి ఉన్న స్నేహితులు 24 గంటల వ్యవధిలో మృతి చెందడం ఆ ప్రాంత ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

మూడు బైకులు ఢీ- ఇద్దరి మృతి

అన్నానగర్: సిరుముగై సమీపంలో సోమవారం రాత్రి మూడు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం సమీపంలోని అన్నూర్ తాలూకాలోని కరనూర్ ప్రాంతానికి చెందిన శేఖర్ (30). తిరుపూర్ బనియన్ కంపెనీలో టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య శాలిని. వీరికి ప్రతీక్ష(5) అనే కూతురు ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి శేఖర్ సిరుముగై పక్కనే ఉన్న తిమ్మరాయంపాలెంలోని తన బావ ఇంటి నుంచి బైకులో తిరిగి వస్తున్నాడు. అదేవిధంగా లింగాపురం ప్రాంతానికి చెందిన ఫ్యాన్సీ స్టోర్ యజమాని నవీన్ కుమార్ (30), సిరుముగై థియేటర్ మేడు ప్రాంతానికి చెందిన హరిహరన్ (25) కలిసి మరో బైకుపై అటువైపు వచ్చారు. సిరుముగై సమీపంలోని వెల్లికుప్పంపాళయం ప్రాంతానికి రాగానే అకస్మాత్తుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. అప్పుడు అటుగా వస్తున్న మరో బైకు, వీటిని ఢీకొని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో శేఖర్, నవీన్ కుమార్ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. హరిహరన్, మరో ద్విచక్రవాహనదారుడు కరుప్పుసామికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న సిరుముగై పోలీసులు గాయపడిన హరిహరన్‌ను కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి, కరుప్పుసామిని సిరుముగైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మేట్టుపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన నవీన్‌కుమార్‌కు భార్య నిషా, కుమార్తె సాయిదా (4) ఉన్నారు. సిరుముగై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అప్పులు కాటేశాయ్!

కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య

సాక్షి, చెన్నై: అప్పుల బాధ తాళ లేక ఓ కుటుంబంలోని ముగ్గురు మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. నామక్కల్ జిల్లా మల్ల సముద్రం నడుపాళయానికి చెందిన నటేషన్(65), చింతామణి(52) దంపతులు నేత పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నవీన్‌కుమార్(35), గోపి (38) అనే కుమారులు ఉన్నారు. వీరి పెద్ద కుమారుడు జయప్రకాష్, చిన్న కుమార్తె శశి రేఖ గతంలో బలన్మరణానికి పాల్పడి మరణించారు. ప్రస్తుతం గోపి దిండుగల్‌లోని ఓ మిల్లులో పనిచేస్తున్నాడు. నటేషన్ అనారోగ్యంతో మంచానికి పరిమితమయ్యాడు. నవీన్ కుమార్, చింతామణి ఓ ప్రైవేటు మిల్లులో పనిచేస్తున్నారు. వీరి సంపాదన అంతా నటేషన్ వైద్య ఖర్చులకే సరిపోతోంది. దీంతో ఇరుగు పొరుగు వారు, తెలిసిన వారి వద్ద కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశారు. ఈ అప్పులు ఆ కుటుంబానికి భారంగా మారాయి. ఈ పరిస్థితులలో మంగళవారం ఉదయం వీరి ఇంటి నుంచి ఎవ్వరూ బయటకు రాక పోవడంతో ఇరుగురు పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా, ఇంట్లో నటేషన్, చింతామణి, నవీన్ కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం వెలుగు చూసింది. మరో కుమారుడు గోపి దిండుగల్‌లో ఉన్నట్లు గుర్తించి ఈ సమాచారం చేరవేశారు. విచారణలో వీరి కుటుంబం పరిస్థితులు, అప్పుల వ్యవహారం పోలీసుల దృష్టికి చేరింది. దీంతో మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఎళిలన్, డాక్టర్ ఉర్జితా రాజగోపాలన్


మొక్కలు నాటుతున్న తహసీల్దారు షణ్ముగసుందరం

కొరుక్కుపేట: ప్రతీఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని థౌజండ్‌లైట్స్ ఎమ్మెల్యే ఎళిలన్ నాగనాథన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్త జీవితం కోసం కొత్త చెట్టు అనే పేరుతో పర్యావరణ పరిరక్షణ క్యాంపెయిన్ ఎంజీఎం హెల్త్‌కేర్, సీరక్కు స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా కలసి ప్రారంభించారు. చెన్నైలో గ్రీమ్స్ రోడ్డులోని బీఎస్ఎన్ ఎల్ కార్యాలయంలో ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. ఎంజీఎంలో జన్మించిన శిశువులతో కలసి వారి తల్లిదండ్రులు వారికి కేటాయించిన గుంతల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఎంజీఎం హెల్త్ కేర్ డైరెక్టర్ డాక్టర్ ఉర్జితా రాజగోపాలన్ , గ్రేటర్ చెన్నై కార్పోరేషన్ కౌన్సిలర్ ఎంఏ నందిని, బీఎస్ఎన్ఎల్ -తమిళనాడు సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సీవీ వినోద్, ఎమ్మెల్యే ఎళిలన్ తదితరులు పాల్గొని దాదాపు 300 ఔషధ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎళిలన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు.

అరక్కోణంలో..

అరక్కోణం: పర్యావరణం దినోత్సవం సందర్భంగా అరక్కోణం ప్రభుత్వాసుపత్రిలో సోమవారం తహసీల్దార్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రెవెన్యూశాఖ, ఆరోగ్యశాఖ, టేక్వాండో ఫెడరేషన్, పచ్చదనం ట్రస్ట్ సంయుక్తంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నివేదిత, తహసీల్దారు షణ్ముగసుందరం ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇద్దరు కూమార్తెలు మృతి చెందడంతో తల్లి ఆత్మహత్య

అన్నానగర్ : తిరుచ్చి సమీపంలో ఇద్దరు పిల్లల మృతితో ఆవేదనకు గురైన వారి తల్లి మంగళవారం విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. తిరుచ్చి కారుమండపం సమత్తువనగర్‌కు చెందిన వడివేల్ భార్య తమిళరసి (39). వీరికి ముగ్గురు కుమార్తెలు. ఇందులో ఇద్దరు కుమార్తెలు ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన తమిళరసి జీవితంపై విసుగు చెంది విషం తాగింది. స్పృహ తప్పి పడిపోయిన ఆమెను ఇరుగు పొరుగు వారు రక్షించి చికిత్స నిమిత్తం తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంటోన్మెంట్ పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ అశోకన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిషోర్ లేకపోతే ముగై చిత్రం లేదు


ముగై చిత్ర ట్రైలర్ విడుదల వేదికపై సినీ ప్రముఖులు

తమిళసినిమా: నటుడు కిషోర్, నటి ఆర్ష, చాందిని బైజూ ప్రధాన పాత్రలు పోసించిన చిత్రం ముగై. లైట్ హౌస్ మీడియా, శ్రీ ధర్మా ప్రొడక్షన్స్, జాస్పర్ స్టూడియోస్, విస్తారా సంస్థలు సంయుక్తంగా నిర్మించిన చిత్రం ఇది. దీనికి కథ, దర్శకత్వం బాధ్యతలను అజిత్ కుమార్ నిర్వహించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. తమిళ నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళి రామనారాయణన్, కె.రాజన్, ఢిల్లీబాబు, ఎస్వీ శేఖర్ తదితర సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొని చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన సంతోష్ మాట్లాడుతూ లాక్‌డౌన్ సమయంలో కథను తయారు చేసుకుని ఏడాది పాటు ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. నటుడు కిషోర్ లేకపోతే ఈ చిత్రం లేదన్నారు. ఆయన అంతగా సహకరించారని తెలిపారు. కథానాయకి కూడా అంతేనన్నారు. కథ చెప్పగానే నటించడానికి సమ్మతించారని, చిత్రాన్ని ఒకే షెడ్యూల్‌లో 23 రోజుల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. అందరూ ఎలాంటి కాల్‌షీట్స్ సమస్య లేకుండా సహకరించారని తెలిపారు. ఒక ఇంటిలో జరిగే కథాంశంతో రూపొందిన చిత్రం ముగై అని చెప్పారు. దీంతో లొకేషన్ కోసం చాలా ప్రాంతాలు తిరిగి చివరికి ఇంటి సెట్ వేసినట్లు చెప్పారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలే తమకు టాస్క్‌గా మారాయన్నారు. వీటికి ఛాయాగ్రాహకుడు, ఎడిటర్ ఎంతగానో సహకరించారని తెలిపారు. ఈ చిత్రం సంతృప్తికరంగా వచ్చిందనే సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కోలీవుడ్ టాక్స్

ఆ రోజు ఎప్పుడొస్తుందో తెలియదు..

తమిళసినిమా: తెలుగులో అత్యధిక చిత్రాలలో నటించిన మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. మలయాళం చిత్రం ప్రేమమ్ చిత్రం ద్వారా కథానాయికలుగా పరియం అయిన ముగ్గురు భామల్లో ఈమె ఒకరు. ఆ ఒక్క చిత్రం అనుపమ పరమేశ్వరన్‌ను దక్షిణాది వ్యాప్తంగా సినిమాలు చేసింది. ఆ తరువాత కొడి చిత్రంతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అలా ఇక్కడా కొన్ని చిత్రాల్లోనే నటించింది. ప్రస్తుతం జయం రవితో కలిసి సైరన్ చిత్రంలో నటిస్తోంది. ఈమె ఓ భేటీలో పేర్కొంటూ తాను మనసుకు కష్టమైన విషయాలను, బాధించే సంఘటనలను సాధ్యమైనంత త్వరగా మరిచిపోవడానికి ప్రయత్నిస్తానని చెప్పింది. తాను చాలా పాజిటివ్ పర్సన్ అని పేర్కొంది. తనకు ఏదైనా నచ్చకపోతే నిర్మొహమాటంగా చెప్పేస్తానని, ఆ తరువాత దాని గురించి మరిచిపోతానని చెప్పింది. జీవితం చాలా చిన్నదని, ఈ లోకంలో ఎంతకాలం ఉంటామో తెలియదని, వెళ్లే సమయం ఎప్పుడు వస్తుందో కూడా తెలియదని పేర్కొంది. కాబట్టి జీవితంలో ఎదురైన ఆటంకాలను, సమస్యలను మనసులోనే ఉంచుకుని మనలోని శక్తిని వృథా చేసుకోరాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. నిఘా కెమెరాల్లోని దృశ్యాలు నెల రోజుల తరువాత ఎలాగైతే డిలైట్ అయిపోతాయో మన మనసును అలా ఉంచుకోవాలనే తత్వాన్ని అనుమప పరమేశ్వరన్ వ్యక్తం చేసింది.


అనుపమ పరమేశ్వరన్

బుల్లెట్ బండెక్కి..!


నటి వరలక్ష్మి శరత్‌కుమార్

తమిళసినిమా: దక్షిణాది హీరోయిన్లలో నటి వరలక్ష్మి శరత్ కుమార్ ది మాత్రం డేరింగ్ అండ్ డైనమిక్ రూట్ అనే చెప్పాలి. అర్ధరాత్రి పోలీసునే చెంపలు వాయించిన రఫ్ బ్యూటీ ఈమె. ఈ విషయాన్ని ఆమె తండ్రి, నటుడు శరత్‌కుమార్‌నే స్వయంగా ఇటీవల ఒక వేదికపై చెప్పారు. ఇక నటిగా వరలక్ష్మి శరత్‌కుమార్ గురించి చెప్పాల్సిన అవసరం ఉండదు. దక్షిణాది సినీ ప్రేక్షకులకు బాగా తెలుసు. పాత్ర ఏదైనా ఈమెకు మోల్డ్ అయిపోతారు. పోడా పోడీ చిత్రంతో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన వరలక్ష్మి శరత్‌కుమార్ ఆ తరువాత తనకు నచ్చినట్లు కాకుండా ప్రేక్షకులు మెచ్చేటట్లు నటిస్తూ తన స్థాయిని పెంచుకుంటూ పోతున్నారు. ఇప్పుడు దక్షిణాదిలో కథానాయకి పాత్రలను అటుంచితే ఛాలెంజింగ్‌తో కూడిన విలనిజం పాత్ర అయితే ఈ విలక్షణ నటిని వెతుక్కుంటూ రావాల్సిందే. ఆ మధ్య సర్కార్ చిత్రంలో అలాంటి పాత్రలోనే విజయ్‌ను ఢీకొన్న వరలక్ష్మి శరత్‌కుమార్ ఇటీవల తెలుగులో వీరసింహారెడ్డి చిత్రంలో బాలకృష్ణకు పోటీ ఇచ్చారు. ఈమెలో మొండి ధైర్యం కూడా ఉంది. నటిగా దశాబ్దం పూర్తి చేసుకున్న వరలక్ష్మి శరత్‌కుమార్ ఇప్పటి వరకు కొన్ని కారణాల వల్ల సైకిల్ తొక్కడం లాంటి వాటి జోలికి పోలేదట. అయితే ఇప్పుడు ఏకంగా బుల్లెట్ ఎక్కేవారు. సైకిల్ నుంచి స్టెప్ బై స్టెప్ బుల్లెట్ నడపడం వరకు నేర్చేసుకున్నారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అది తెగ వైరల్ అవుతోంది. దీని గురించి ఆమె పేర్కొంటూ బాల్యంలో కొన్ని కారణాల వల్ల తనకు బైక్ తోలడానికి ఇంట్లో అనుమతి ఇవ్వలేదన్నారు. అయితే బైక్ నడపడానికి భయాన్ని పోగొట్టడానికి ఇది సరైన టైమ్ అని భావించానన్నారు. దీంతో గత వారం బైక్ నడపడానికి తొలి మెట్టు అయిన సైకిల్ తొక్కడం నేర్చుకున్నానని, ఆ తరువాత స్కూటీ, ఇప్పుడు బుల్లెట్ కూడా నడుపుతున్నానని చెప్పారు. మొదట్లో కొంచెం కష్టం, బాధ అనిపించినా, భయాన్ని పోగొట్టడానికి ఇదంతా చేసినట్లు చెప్పారు. ఇక్కడ తాను కింద పడ్డాను అన్నది ముఖ్యం కాదని ఎలా లెగిశాను అన్నదే ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

ఫుల్ రీచార్జ్‌తో చియాన్ విక్రమ్


విక్రమ్

తమిళసినిమా: పాత్రలకు ప్రాణం పోయడానికి ముందు నటులు వాటిలో ఒదిగి పోవాలి. అలా మేకోవర్ అవ్వడంలో ఇప్పుడున్న నటుల్లో కమలహాసన్ తరువాత స్థానం విక్రమ్‌దే అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇంతకు ముందు అన్నియన్, ఐ వంటి చిత్రాలలో ఆయన శారీరక భాషే ఇందుకు చిన్న నిదర్శనం. తాజాగా అంతకు మించి అన్నట్లుగా తంగలాన్ చిత్రం కోసం విక్రమ్ మేకోవర్ అయ్యారు. ఈ చిత్రంలో ఆయన గెటప్ చూస్తే ఎవరైనా ఈయన విక్రమ్ అని చెబితే తప్ప గుర్తు పట్టనంతగా మేకోవర్ అయ్యారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేయగా విక్రమ్ గెటప్ అబ్బుర పరిచింది. వైవిధ్యభరిత కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ అయిన పా.రంజిత్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం ఇది. నటి మాళవిక మోహన్, పార్వతి, పశుపతి, ఇంగ్లండ్ నటుడు డేనియల్ కాల్టకిరోన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చాలా వరకు పూర్తి చేసుకుంది. కాగా ఇటీవలచిత్రం తదుపరి షూటింగ్ కోసం రిహార్సల్స్ చేస్తుండగా విక్రమ్ ప్రమాదానికి గురయ్యారు. దీంతో ఆయన ఆసుపత్రిలో చేరి చికిత్స చేసుకుని వచ్చారు. తంగలాన్ చిత్ర షూటింగ్‌ను కూడా రద్దు చేశారు. అయితే తాజాగా విక్రమ్ పూర్తిగా రీచార్జ్ అయ్యారు. దీంతో తంగలాల్ చిత్రం షూటింగ్‌ను ఈ నెల 15వ తేదీ నుంచి తిరిగి ప్రారంభించడానికి యూనిట్ వర్గాలు రెడీ అవుతున్నట్లు తాజా సమాచారం. మరో 12 రోజులు షూటింగ్ చేస్తే తంగలాన్ పూర్తి అవుతుందని తెలిసింది. ఇది కోలార్ బంగారు గనులను రూపొందించడానికి ముందు ఈ ప్రాంతంలోని ప్రజలు బంగారాన్ని తవ్వకుని తీసుకెళ్లే ఇతివృత్తంతో రూపొందుతున్న చిత్రమని తెలుస్తోంది.

చంద్రముఖి చిత్రం చూసిన తరువాతే..


వేదికపై రెజీనా చిత్ర యూనిట్ సభ్యులు

తమిళసినిమా: నటి సునయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం రెజీనా. ఎలో బీయర్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష నాయర్ నిర్మించి, సంగీతాన్నిన అందించిన ఈ చిత్రానికి మలయాళంలో పలు విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన డోమిన్ టి.సిల్వా తెరకెక్కించారు. భవీ కె.భవన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. కాగా క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందించిన రెజీనా చిత్ర టీజర్ గత మే నెల 30వ తేదీన విడుదల చేయగా మంచి స్పందన వచ్చిందని నిర్మాత తెలిపారు. చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం స్థానికరాయపేటలోని సత్యం థియేటర్లో నిర్వహించారు. ఇందులో దర్శకుడు వెంకట్ ప్రభు, నిర్మాత టి.శివ, చిత్రా లక్ష్మణన్, ఎస్కేప్ ఆర్టిస్ట్ మదన్, శక్తి పిలిమ్స్ ఫ్యాక్టరీ శక్తివేలన్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేదికపై నటి సునయన మాట్లాడుతూ 2006లో అమ్మానాన్నల మధ్య కూర్చొని టీవీ సీరియల్స్ చూసే చిన్న అమ్మాయినని, అప్పట్లో తనకు నటిగా రంగ ప్రవేశం చేయాలనే ఆలోచన లేదని పేర్కొన్నారు. అలాంటి సమయంలో సెలవులకు హైదరాబాద్ వెళ్లినప్పుడు చంద్రముఖి, గజిని చిత్రాలను చూశానని తెలిపారు. ఆ సమయంలో దక్షిణాది సినీ కథానాయకి అవ్వాలనే నిర్ణయించుకున్నట్టు చెప్పారు. అప్పుడు సినిమాపై పెంచుకున్న ఆసక్తి, సిన్సియారిటీ, నిజాయితీని ఇప్పటి వరకు కొనసాగిస్తున్నానన్నారు. ఈ చిత్ర దర్శక నిర్మాతల నుంచియూనిట్‌లో ప్రతి ఒక్కరికీ సమైక్యత ఉందని సునయన అన్నారు.

క్లుప్తంగా

సినీ దర్శకుడి హత్య

అన్నానగర్: పెరంబలూరులో సోమవారం బార్‌లోకి చొరబడి సినీ దర్శకుడిని కత్తితో పొడిచి హత్య చేసిన ముగ్గురు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పెరంబలూరు అరణారైకు చెందిన పిచ్చై కుమారుడు సెల్వరాజ్ (39). 2011లో ప్రముఖ సినీ దర్శకుడు మణివన్నన్ కుమారుడు రఘువన్నన్ నటించిన తమిళ దేశం చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తరువాత చిత్ర పరిశ్రమకు దూరమైన పలు వివాదాల్లో చిక్కుకున్నారు. అతనిపై పెరంబలూరు పోలీస్‌స్టేషన్‌లో అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సోమవారం సెల్వరాజ్ పెళ్లి రోజు, పుట్టిన రోజు కూడా. స్నేహితులతో కలిసి జరుపుకున్నాడు. అనంతరం సెల్వరాజ్ తన స్నేహితులతో కలిసి పెరంబలూరులోని బార్‌లో మద్యం తాగుతుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చారు. సెల్వరాజ్‌ను కత్తితో పొడిచి పారిపోయారు. సెల్వరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెరంబలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. హంతకులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. హోటల్‌లోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

అన్నానగర్: పాడి బ్రిడ్జ్ సమీపంలో మంగళవారం ఉదయం నీళ్ల లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. వానగరం సమీపంలోని నూంబాల్ ప్రాంతానికి చెందిన రామానుజం (34) పాడిలోని ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం యథావిధిగా బైక్‌పై విధులకు ఇంటి నుంచి బయలుదేరాడు. పాడి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే వెనుక నుంచి వాటర్ ట్యాంకర్ బైకుని ఢీ కొట్టింది. రామానుజంపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్ ధరించి ఉన్నా అతడి ప్రాణాలను కాపాడలేదు. లారీ చక్రాల కింద హెల్మెట్ కూడా నుజ్జునుజ్జు అయ్యింది. ప్రమాదం జరగగానే లారీని ఆపి డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న రెడ్‌హిల్స్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

రైల్వే సిగ్నల్ లైట్లు ధ్వంసం



పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

వేలూరు: ప్రియురాలు మాట్లాడడం లేదనే కోపంతో తిరుపత్తూరులో రైల్వే సిగ్నల్స్‌ను ధ్వంసం చేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుపత్తూరు రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం ప్రయాణికులు వేచి ఉన్నారు. ఆ సమయంలో మద్యం మత్తులో వచ్చిన ఒక యువకుడు సిగ్నల్స్ లైట్లను రాళ్లతో ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అతను తిరుపత్తూరు సమపంలోని బ్రాండ్‌లైన్‌కు చెందిన గోకుల్ రాజ్(30)గా తెలిసింది. అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని.. ఆమె తనతో మాట్లాడడం లేదనే కోపంతో సిగ్నల్ లైట్లపై రాళ్లు విసిరినట్లు చెప్పాడు. దీంతో రైల్వే పోలీసులు జోలార్‌పేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని రైల్వే అధికారులు పరిశీలించారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు

తిరువొత్తియూరు: పుదుచ్చేరిలో ముఖ్యమంత్రి రంగస్వామి హాజరైన ప్రభుత్వ కార్యక్రమంలో గేటు దూకి ప్రవేశించిన స్వతంత్ర ఎమ్మెల్యే నెహ్రూపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం పుదుచ్చేరి కంబన్ ఆర్ట్ గ్యాలరీలో పర్యావరణ దినోత్సవం జరిగింది. ఉరులయాన్ పేట నియోజకవర్గానికి చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే నెహ్రూ తన మద్దతుదారులతో లోపలికి వచ్చారు. పోలీసులు అడ్డుకోవడంతో గేటు దూకి లోపలికి వెళ్లి ఫంక్షన్ వేదికపై ఉన్న చీఫ్ సెక్రటరీ రాజీవ్ వర్మను చూసి స్మార్ట్ సిటీ ప్లాన్ ఏంటని, నగర ప్రాంతాలు చెత్తాచెదారంలా పడి ఉన్నాయని, డ్రైయిన్లు తొలగించక దుర్గంధం వెదజల్లుతున్నారని వరుస ప్రశ్నలను లేవనెత్తారు. ఎస్‌ఐ జాకీర్ హుస్సే ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కుప్పుసామి, అతని మద్దతుదారులపై ఒథియాంచల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అడ్డుకోవడంలో విఫలమైన ఇన్‌స్పెక్టర్ కన్నన్‌పై చర్యలు తీసుకున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కొరుక్కుపేట: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడమే ప్రమాదాలకు కారణమని గ్రేటర్ చెన్నై పోలీస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్)-నార్త్ చెన్నై శరవణన్ అన్నారు. మంగళవారం ఉదయం గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసు, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3232 సంయుక్తంగా ×ఇమాజిన్ రోడ్ సేఫ్టీ పేరుతో చెన్నై అన్నానగర్ ఆర్చ్ సిగ్నల్ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ 3232 జిల్లా గవర్నర్ మహవీర్ బోత్రా, గౌరవ అతిథిగా డీసీపీ (ట్రాఫిక్) శరవణన్ ప్రారంభించారు. ఇమాజిన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్‌లో భాగంగా సిగ్నల్స్ వద్ద కార్లు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆరుగురు హిజ్రాల బృందం ఎయిర్ హోస్టెలుగా చీరలు ధరించి అవగాహన కల్పించారు. డీసీపీ శరవణన్ మాట్లాడుతూ.. తివేగంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం వల్లే ప్రమాదాలు అధికమవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

ఖైదీలకు రుచికర మెనూ

- వారంలో 3 రోజులు మాంసాహారం
- శాఖాహారులకు ప్రత్యేకంగా వంటకాలు



పుళల్ జైలు



వంటకాలు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని జైళ్లలోని ఖైదీలకు రుచి, శుచితో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లాంఛనంగా పుళల్ జైల్లో ఈ కొత్త రకం వంటకాల మెనునూ మంగళవారం జైళ్ల శాఖ మంత్రి రఘుపతి, జైళ్ల శాఖ డీజీపీ అమరేష్ పూజారిలో పరిచయం చేశారు. వివరాలు.. రాష్ట్రంలో చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి, కడలూరు , పాళయం కోట్టై, మదురై తదితర 9 కేంద్ర కారాగారాలు, 3 మహిళా ప్రత్యేక జైళ్లు, సబ్, జిల్లా జైళ్లు మొత్తం 138 వరకు ఉన్నాయి. ఇందులో శిక్షపడ్డ వారు, విచారణ ఖైదీలు వేలాదిగా ఉన్నారు. వీరిని ఏ, బీ కేటగిరీలుగా విభజించి ఆహారం అందించడం జరుగుతోంది. ఇదివరకు వారంలో ఒక రోజు చికెన్ లేదా మటన్, ఒక రోజు గుడ్డు అందజేస్తూ వచ్చారు. అలాగే ఉప్మా, పొంగలి, రాగి సంగటి, రాగి గంజి, చట్నీలను ఆహారంగా అందజేస్తున్నారు. అయితే, ఖైదీలకు పౌష్టికాహారం అందించాలనే నినాదం ఇటీవల తెర మీదకు వచ్చింది. ఖైదీల సంక్షేమంపై నిపుణుల బృందం ఓ నివేదికను సైతం ప్రభుత్వానికి అందజేసింది.

రూ. 26 కోట్ల కేటాయింపు

ఇది వరకు ఒక ఖైదీకి రోజుకు రూ. 96 ఖర్చు పెట్టేవారు. ప్రస్తుతం ఈ మొత్తాన్ని రూ. 135గా పెంచారు. అదనంగా రూ. 26 కోట్లను కేటాయిస్తూ, ఖైదీలకు రుచికరమైన వంటకాలను అందజేయడానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం ప్రత్యేక మెనూ రెడీ చేశారు. ఒక్కో రోజు ఒక్కో వంటకం అందజేయనున్నారు. ఏ కేటగిరి ఖైదీలకు వారంలో నాలుగు రోజులు, బీ కేటగిరి ఖైదీలకు వారంలో మూడు రోజులు చికెన్ లేదా మటన్ వడ్డించనున్నారు. దివంగత డీఎంకే అధినేత కరుణానిధి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ మెనూను పరిచయం చేశారు. చెన్నై పుళల్ జైల్లో ఈ వంటకాలను మంగళవారం తయారు చేసి ఖైదీలకు వడ్డించారు. ఈ మెనూ మేరకు ఉదయం సాయంత్రం వేళలో ఖైదీలకు టీ లేదా కాఫీ, ఉప్మా, గోధుమ వంటకాలు, స్నాక్స్ అందజేయనున్నారు. మధ్యాహ్నం , రాత్రుల్లో సాంబార్, రసం, అన్నం , పచ్చడి పంపిణీ చేయనున్నారు. రోజూ మెనూలో చపాతి, గుడ్డు, కర్రి, లెమన్ రైస్, పుదినా రైస్, టమాట రైస్ వంటివి ఏదో ఒకటి ఉండేలా మెనూ రూపొందించడం విశేషం.

1.47 టన్నుల బీడీ ఆకులు స్వాధీనం

తిరువొత్తియూరు: తూత్తుకుడి హార్బర్ నుంచి అక్రమంగా తరలించేందుకు యత్నించిన 1.47 టన్నుల బీడీ ఆకులను మంగళవారం క్యూ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. మినీ లోడ్ వ్యాను, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. టూటికోరిన్ సౌత్ కోస్టల్ ఏరియా నుంచి బీడీ ఆకులను అక్రమంగా తరలిస్తున్నట్లు క్యూ డివిజన్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో సోమారం అర్ధరాత్రి నుంచి పోలీసులు నిఘా ఉంచారు. తెల్లవారుజామున కొందరు మినీ లోడ్ వ్యాన్‌లు, మూడు బైక్‌లలో సౌత్ బీచ్‌కు వెళ్లారు. అక్కడ నిలిపి ఉంచిన పడవలో బీడీ ఆకుల కట్టలను లోడ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా క్యూ డివిజన్ పోలీసులు చుట్టుముట్టారు. వెంటనే వాహనాలను వదిలి పారిపోయారు. 35 కిలోల బరువున్న 42 బస్తాల బీడీ ఆకులను స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. తమిళనాడులో బీడీ ఆకులు కిలో రూ.70కి విక్రయిస్తుండగా, శ్రీలంకలో రూ. 500కి విక్రయిస్తున్నారు.

తోటలో దాచిన 3 తుపాకులు సీజ్

అన్నానగర్: విరుదునగర్‌లోని వ్యవసాయ భూమిలో దాచిన మూడు తుపాకులు, 20 బుల్లెట్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లా వత్తిరాయి దక్షిణ వీధికి చెందిన శరవణకుమార్ (38) అనుమతి లేకుండా తుపాకులు, బులెట్లను ఉంచుకున్నట్లు నగర పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు మంగళవారం ఉదయం అతడిని పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేశారు. అతని ఇల్లు, తోటలో సోదాలు చేశారు. ఆ సమయంలో మూడు తుపాకులు, 20 బుల్లెట్లను గుర్తించారు. దీనికి సంబంధించి ప్లావకల్ డ్యామ్‌కు చెందిన రాజును అరెస్టు చేశారు. ఇంకా ఒకరి కోసం వెతుకుతున్నారు.

వేలూరు ప్రభుత్వాస్పత్రిలో నిర్లక్ష్యం

- రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు
- తలలో చిక్కుకున్న నట్టు తీయకుండా కుట్లు వేసిన వైద్య సిబ్బంది



గాయపడిన కార్తికేయన్ డ్రైవర్ తలలో ఉన్న నట్టు

వేలూరు: ప్రమాదంలో తలలో చిక్కుకున్న నట్టును బయటకు తీయకుండా కుట్లు వేసిన ఘటన వేలూరు ప్రభుత్వాస్పత్రిలో చోటుచేసుకుంది. తిరుపత్తూరు జిల్లా అంబూరు తాలుకా మిన్నూరు గ్రామానికి చెందిన కార్తికేయన్(45) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. సోమవారం ఉదయం లారీలో ఆంబూరు నుంచి వేలూరుకు వస్తున్నాడు. లారీ అగరంజేరి వద్ద వస్తున్న సమయంలో వెనుక వైపు వస్తున్న బస్సు ఢీకొనడంతో లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కార్తికేయన్‌కు తలపై తీవ్ర గాయాలైంది. వెంటనే వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో ఎక్స్‌రే, స్కాన్ తీసి సాధారణ వార్డుకు మార్చారు. అక్కడ తల, మొఖంపై నర్సులు కుట్లు వేశారు. సాయంత్రం 4 గంటలు అయినా వైద్యులు రాకపోవడం.. కార్తికేయన్‌కు నొప్పులు అధికం కావడంతో బంధువులు అరియూర్‌లోని నారాయణి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కార్తికేయన్‌కు ఎక్స్‌రే, స్కాన్ తీశారు. ప్రమాదంలో తలలో తగిలిన నట్టును కూడా బయటకు తీయకుండా ప్రభుత్వ నర్సులు కుట్లు వేసినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వాస్పత్రి డీన్ పాపాత్తికి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

అత్యుత్తమ విద్యా సేవలతోనే ర్యాంకులు

సాక్షి, చెన్నై : తాము అందిస్తున్న ఉత్తమ విద్యా సేవలు, విస్తృత పరిశోధనల వల్లే నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకులు వరించాయని సీమాట్స్ వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ఎన్‌ఎం వీరయ్యన్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, డీమ్డ్ వర్సిటీగా ఉన్న తమ సంస్థకు 2023 సంవత్సరానికి గాను ర్యాంకుల జాబితాలో 9 కేటగిరుల్లో ఒక్కో స్థానం దక్కినట్లు వివరించారు. ఉత్తమ విద్యా సేవలు, సిబ్బంది పని తీరు తదితర అంశాల మేరకు దంత వైద్య రంగానికి తొలి ర్యాంకు దక్కినట్లు పేర్కొన్నారు. అలాగే, న్యాయ విభాగంకు 11వ ర్యాంకు, యూనివర్సిటీ విభాగంలో 13వ ర్యాంకు , మెడికల్ విభాగంలో 18వ ర్యాంకు, ఓవరాల్ విభాగంలో 27వ ర్యాంకు , పరిశోధన విభాగంలో 36వ ర్యాంకు, ఇంజినీరింగ్‌లో 64, మేనేజ్‌మెంట్ విభాగంలో 71వ ర్యాంకు దక్కినట్లు తెలిపారు. ఇన్నోవేషన్ విభాగంలో 51 నుంచి 100 బ్యాండ్‌లలో సీమాట్స్ తనదైన ముద్ర వేసినట్లు చెప్పారు. విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పనితీరు, అత్యుత్తమ విద్యా పద్ధతులు, పరిశోధనలు ఇతర సేవలకు ఈ ర్యాంకులు లభించడం ఆనందంగా ఉందన్నారు.

జమాబంధికి 195 వినతులు



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణస్వామి, డిప్యూటీ కలెక్టర్ గాయత్రి సుబ్రమణ్యం

తిరువళ్లూరు: తాలుకా కార్యాలయంలో నిర్వహించిన జమాబంధి కార్యక్రమానికి తొలి రోజు 195 వినతులు రాగా వాటిలో 7 వినతులను తక్షణం పరిష్కరించి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. తిరువళ్లూరు తాలుకా కార్యాలయంలో జమాబంధి కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. తిరువళ్లూరు, సెల్లై, పెరుంబాక్కం, కాకలూరు, ఈకాడు, కల్యాణకుప్పం, ఈకాడు, పుట్లూరు, పెద్దకుప్పం తదితర 9 ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. తొలి రోజు ఇంటి పట్టాలు, పింఛన్, పట్టామార్పు, కుల ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్లతో సహా వేర్వేరు సమస్యలపై 195 మంది వినతి పత్రం సమర్పించారు. తిరువళ్లూరు తాలుకా కార్యాలయంలో జరిగిన జమాబంధి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గాయత్రిసుబ్రమణ్యం, పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి తదితరులు వినతి పత్రాలను స్వీకరించారు. అధికారులు స్వీకరించిన వినతుల్లో 7 మంది వినతులపై తక్షణం పరిష్కరించి అక్కడికక్కడే పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మదియగళన్, డిప్యూటీ తహసీల్దార్ అంబిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణేష్, వీఏఓ కృష్ణ, హెడ్ సర్వేయర్ సెంథిల్‌కుమరన్ పాల్గొన్నారు.

తల్లీకుమార్తె దుర్మరణం

సేలం: సేలం జిల్లాలో రోడ్డు దాటుతున్న బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో తల్లి, కుమార్తె దుర్మరణం చెందారు. తండ్రి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సేలం కొండలాంపట్టి సమీపంలోని కాల్‌పారపట్టి మేల్‌కాడు వలవు ప్రాంతానికి చెందిన వెంకటాచలం (70)కు భార్య మారియమ్మాల్ (60), కుమార్తె పూంగొడి (27) ఉన్నారు. మంగళవారం ఉదయం ముగ్గురూ బైక్‌పై కల్‌మావు కంపెనీ వద్ద రోడ్డు దాటడానికి ప్రయత్నించగా కోవై నుంచి సేలం వైపు వేగంగా వెళుతున్న కారు బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో మారియమ్మాల్, పూంగొడి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. వెంకటాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మత్స్యకారుల వలకు చిక్కిన డ్రోన్



సముద్రంలో చిక్కిన డ్రోన్

కొరుక్కుపేట: తిరువొత్తియూరు సముద్రం తీరంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలో ఆధునిక డ్రోన్ చిక్కుకుంది. దీని గురించి కాశిమేడు ఫిష్షింగ్ హార్బర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అప్పర్ టౌన్‌కు చెందిన అన్బు (54), టైసన్, కుమార్, ఆనంద్ అనే మత్స్యకారులు సోమవారం ఫైబర్ బోటులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో వలలో డ్రోన్ దొరికింది. దీంతో కాశిమేడు పోర్టు పోలీసులకు అప్పగించారు. వలకు చిక్కుకున్న డ్రోన్ ఒక అడుగు ఎత్తు, రెండు అడుగుల పొడవు ఉంది. డ్రోన్‌పై సాగర్ డిఫెన్స్ అని రాసి ఉంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే ఇంటిలో 23 పాముల గుర్తింపు

- బెంబేలెత్తిన స్థానికులు

అన్నానగర్: కృష్ణగిరి జిల్లా తెన్‌కనికోట్టై మేల్కోట్టై విజయనగర్ ప్రాంతానికి చెందిన గోపి. ఇతను తెన్‌కనికోట్టై ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నాడు. అతని ఇంటి కాంపౌండ్ వాల్‌కి ఉన్న రంధ్రం ద్వారా మంగళవారం నాగుపాము ప్రవేశించింది. ఇది చూసి అతను షాక్ అయ్యాడు. దీనిపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. దీంతో అటవీశాఖ అధికారులు పాములను పట్టే ముబారక్ (38), బుల్లెట్ ముబారక్ (34), సయ్యద్ ముజామిల్ (30)తో కలిసి ఘటనా స్థలానికి వచ్చాడు. అయితే ఆ రంధ్రంలో మరో 22 పాములు గుర్తించి వాటన్నింటినీ బంధించారు. ఆ సమయంలో ముబారక్ పాముకాటుకు గురయ్యాడు. అటవీశాఖ అధికారులు అతడిని రక్షించి తెన్‌కనికోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అనంతరం అటవీ అధికారులు ఆ పాములను స్థానికంగా ఉండే అడవిలో విడిచిపెట్టారు. ఒకే చోట నాగుపాములు ఉండడంతో స్థానికంగా కలకలం రేగింది.

విద్యార్థినిపై లైంగిక దాడి

అన్నానగర్: వడలూర్ సమీపంలో సోమవారం 8వ తరగతి చదువుతున్న బాలికను ఆహారం కొనిస్తానని తీసుకెళ్లి అత్యాచారం చేసిన కార్మికుడిపై పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. వివరాలు.. వడలూరు సమీపంలో ఉన్న నార్త్‌వెస్ట్ కాలనీకి చెందిన సెల్వరాజ్ (56) కార్మికుడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వడలూరు ప్రాంతంలో దుకాణం నడుపుతున్న ఓ మహిళకు అప్పుడప్పుడూ సాయం చేసేవాడు. ఈ స్థితిలో 3 నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన ఆ మహిళ ప్రస్తుతం ఆస్పత్రిలో తీవ్ర చికిత్స పొందుతోంది. దీంతో ఆమె తమ్ముడి కూతురు దుకాణాన్ని చూసుకుంటోంది. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ 14 ఏళ్ల బాలిక ప్రస్తుతం 8వ తరగతి చదువుతోంది. సెల్వరాజ్ తరచూ దుకాణానికి వెళ్లి విద్యార్థితో పరిచయం పెంచుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం దుకాణానికి వచ్చిన సెల్వరాజ్ రెస్టారెంట్ నుంచి ఆహారం కొనిస్తానని చెప్పి విద్యార్థినిని బైక్‌పై తీసుకెళ్లాడు. వడలూరు రైల్వే రోడ్డు వద్దకు రాగానే అకస్మాత్తుగా ద్విచక్రవాహనాన్ని నిలిపి.. బాలికను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. వెంటనే విద్యార్థిని అరవడానికి యత్నించింది. దీంతో కోపోద్రిక్తుడైన సెల్వరాజ్ విద్యార్థినిపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థిని తర్వాత బంధువులకు తెలిపింది. వెంటనే వారు వడలూరు మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సెల్వరాజ్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

తిరువొత్తియూరు: రోడ్డు ప్రమాదంలో చెన్నైకి చెందిన ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన ఘటన దిండివనంలో చోటుచేసుకుంది. చెన్నై ఎంజీఆర్ నగర్‌కు చెందిన హరి (19) ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కృపాకరన్ (17) స్నేహితులు. తమ స్నేహితుడి సోదరి వివాహానికి చెన్నై నుంచి తిరువణ్ణామలైకి స్నేహితులతో కలిసి బయలుదేరారు. హరి, కృపాకరన్ ఒక బైక్‌పై వెళుతున్నారు. దిండివనం సమీపంలోని పాదిరి వద్ద ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. హరి, కృపాకరన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఒలకూరు పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అటవీ గ్రామానికి అంబులెన్స్ వసతి



అంబులెన్స్ సేవను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్, ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు: వేలూరు జిల్లా అనకట్టు సమీపంలోని అల్లేరు అటవీ గ్రామ పంచాయతీలోని అత్తిమరత్తు కొల్లై గ్రామానికి చెందిన వీజి ప్రియ దంపతుల ఒకటిన్నర సంవత్సరాల కుమార్తె ధనుష్కను గత నెల 27వ తేదీ పాము కరిచింది. సరైన రోడ్డు వసతి, వైద్య సదుపాయం లేకపోవడంతో ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో రాష్ట్ర ప్రభుత్వం అల్లేరి అటవీ గ్రామానికి అంబులెన్స్ వసతి ఏర్పాటు చేయాలని సీఎం స్టాలిన్ కలెక్టర్ కుమరవేల్ పాండియన్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అల్లేరి కొండకు వెళ్లేందుకు చిన్నపాటి అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాహనాన్ని అనకట్టు బీడీఓ కార్యాలయంలో కలెక్టర్ కుమరవేల్ పాండియన్, ఎమ్మెల్యే నందకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అల్లేరి కొండలో జీవిస్తున్న ప్రజలకు త్వరగా వైద్య సదుపాయం అందేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు అంబులెన్స్‌లోనే చేయడం జరిగిందన్నారు. ఈ వాహనం ప్రతి రోజూ కొండ ప్రాంతానికి వెళ్లి వస్తుందన్నారు. మొదట ప్రథమ చికిత్స చేపట్టి అనంతరం కొండ కిందకు తీసుకురానున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ బాబు, సబ్ కలెక్టర్ కవిత, అనకట్టు చైర్మన్ భాస్కరన్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించటమే లక్ష్యం



భూమి పూజ చేస్తున్న పాఠశాల నిర్వాహకులు

కొరుక్కుపేట: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు వివేకానంద విద్యాలయ కరస్పాండెంట్ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు చెంగల్పట్టులోని పాఠశాలలో కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెంగల్‌పట్టు పరిసర ప్రాంతాల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న సంకల్పంతో కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. వివేకానంద విద్యా సొసైటీ సంయుక్త కార్యదర్శి రామమూర్తి, చెంగల్పట్టు విద్యా సొసైటీ ట్రస్టు అధ్యక్షుడు రాజశేఖర్, షణ్ముగం, కరస్పాండెంట్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

రెండో అంతస్తు నుంచి పడి..



మృతిచెందిన బాలుడు

కొరుక్కుపేట: ఇంటి రెండో అంతస్తు నుంచి పడి 12 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. చెన్నై చూలైమేడులోని భారతీయార్ రోడ్డుకు చెందిన దండపాణికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో కుమారుడు ప్రసన్న(12) 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ప్రసన్న మంగళవారం సాయంత్రం ఇంటి సమీపంలో స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో గాలిపటం తన ఇంటి సమీపానికి వచ్చింది. గమనించిన ప్రసన్న తన స్నేహితులతో కలిసి తన ఇంటి రెండో అంతస్తులోకి వెళ్లాడు. దానిని ఎలాగైనా తీసుకోవాలని మేడపైకి వెళ్లాడు. గాలులు వీయడంతో టెర్రస్‌పైకి వెళ్లిన ప్రసన్న మరో భవనం పైకి దూకుతున్న సమయంలో జారిపడ్డాడు. తల్లిదండ్రులకు అతన్ని హుటాహుటిన కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడి మృతితో తల్లి దండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. చులైమేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంతటి విషాదాన్ని దిగమింగుకుని కుటుంబ సభ్యులు ఏకాభిప్రాయంతో కుమారుడి అవయవాలను దానం చేశారు.


హిందూ కళాశాలకు గ్రీన్‌చాంపియన్ పురస్కారం



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకటేశపెరుమాల్

తిరువళ్లూరు: పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న పట్టాభిరామ్ డీఆర్‌బీసీసీ హిందూ తెలుగు మైనారిటీ కళాశాలకు గ్రీన్ చాంపియన్ పురస్కారం లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరువళ్లూరు కలెక్టర్ కార్యాలయంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించడం, అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ఆదర్శంగా నిలిచిన వారికి బహుమతులను అందజేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కామరాజర్ విగ్రహం వరకు సాగింది. ఈ ర్యాలీలో వందలాది మంది విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రీన్‌చాంపియన్ అవార్డు దక్కించుకున్న తెలుగు మైనారిటీ కళాశాలకు రూ. లక్ష చెక్కుతో పాటు ప్రశంసా పత్రాన్ని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీస్ కళాశాల కార్యదర్శి వెంకటేషపెరుమాల్‌కు అందజేశారు.

కోలాహలంగా వైకాశి ముత్తుపల్లకి ఉత్సవం



ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

తిరువొత్తియూరు: తంజావూరులో ముత్తు పల్లకి ఉత్సవాలు సోమవారం రాత్రి కోలాహలంగా జరిగింది. వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, వినాయకస్వామిని విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

తవ్వకాల్లో బంగారు ఆభరణాలు లభ్యం

కొరుక్కుపేట: వెంబకోటలో జరుగుతున్న రెండో విడత విడత తవ్వకాల్లో బంగారు కంకణం, ఆభరణాలు లభ్యమయ్యాయి. గతేడాది మార్చి 16న విరుదునగర్ జిల్లా వెంబకోట విజయగరి సలకులం, మెట్టుకోట్టయిల్ ఫారెస్ట్‌లో ఉత్తర తీరాన మొదటి దశ అంతర్గత సర్వే పనులు ప్రారంభించారు. ఇందులో 3,254 పురాతన వస్తువులు లభ్యమయ్యాయి. వీటన్నింటినీ పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ హాలులో ఉంచారు. ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెండో దశ తవ్వకాలు ప్రారంభించారు. ఈ తవ్వకాల్లో ఆట వస్తువులు, బొమ్మలు, అరుదైన కుండలు, రాతి గొడ్డలి, గాజులు, గిన్నెలు వంటి పెద్ద సంఖ్యలో కళాఖండాలు లభించాయి. ఈ క్రమంలో సోమవారం జరిపిన తవ్వకాల్లో 2 గ్రాముల బంగారు కడ్డీ, 2.2 గ్రాముల బంగారు బ్లేడ్, నాబ్ ఆకారంలో ఉన్న ఆభరణాలు లభ్యమయ్యాయి. రెండు ఆనకట్టల తవ్వకాల్లో ఇప్పటి వరకు 1200కు పైగా పురాతన వస్తువులు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు.

మా జీవితాల్లో వెలుగులు నింపారు

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కాంట్రాక్టు ఉద్యోగులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంపై వైద్య, ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తమ కల నెరవేరుతోందని ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం విజయవాడలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ.. తమ జీవితాల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం వెలుగులు నింపుతోందన్నారు. సీఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు జాన్ హెన్రీ, విజయవర్ధన్, కాపా నాగరాజు, మురళీకృష్ణ, రాజశేఖర్, శ్రీనివాస్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట నివాసం అటాచ్‌మెంట్ విచారణ 16కు వాయిదా

- లింగమనేని న్యాయవాది వాదనలను తిరస్కరించిన ఏసీబీ కోర్టు

సాక్షి, అమరావతి: అమరావతి భూ కుంభకోణాల కేసులో అప్పటి సీఎం, ప్రస్తుత ప్రతిపక్ష నేత చంద్రబాబు కరకట్ట నివాసం అటాచ్‌మెంట్ పిటిషన్‌పై ప్రతివాది లింగమనేని రమేశ్ తరఫు న్యాయవాది వాదనలను విజయవాడ ఏసీబీ కోర్టు మంగళవారం తిరస్కరించింది. కరకట్ట నివాసం అటాచ్‌మెంట్‌పై నిర్ణయం తీసుకునే ముందు తమ వాదనలు వినాలన్న ఆయన అభ్యర్థనను డిస్మిస్ చేసింది. కాగా, కరకట్ట నివాసం అటాచ్‌మెంట్ కోసం పిటిషన్ వేసిన సీఐడీ విచారణ అధికారి అభిప్రాయాన్ని వింటామని న్యాయమూర్తి తెలిపారు. విచారణ అధికారి వాదనలు రికార్డు చేసేందుకు గాను ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేశారు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు

- కేంద్ర కార్యదర్శి విని మహాజన్
- సీఎస్ జవహర్‌రెడ్డితో భేటీ



ఉన్నతాధికారులతో సమీక్షలో విని మహాజన్, సీఎస్ జవహర్‌రెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ కార్యక్రమం కింద ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య శాఖ కార్యదర్శి విని మహాజన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డితో ఆమె భేటీ అయ్యారు. అనంతరం జల్ జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమాలపై రాష్ట్రస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. తరువాత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ పథకంపై సమీక్షించారు. ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించాలన్నదే జల్ జీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమని.. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 2024 నాటికి రాష్ట్రంలోని అన్ని గృహాలకు కుళాయి కనెక్షన్ల ద్వారా తగినంత ప్రమాణంలో శుద్ధమైన తాగునీటిని అందించాలని కోరారు. ఇందుకు గ్రామ పంచాయతీలను పూర్తిగా బలోపేతం చేసి మహిళా స్వయం శక్తి సంఘాలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ఘన, ద్రవ వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, వ్యర్థాలను లాభదాయక వనరులుగా వినియోగించుకొనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలుపై కేంద్ర కార్యదర్శి విని మహాజన్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ విధిగా మరుగుదొడ్డి నిర్మించాలన్నారు.

విజయవంతంగా అమలుకు చర్యలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి ప్రతి ఇంటికీ కుళాయి, మరుగుదొడ్డి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాక వర్షాకాలంలో వచ్చే డయేరియా కేసులు పూర్తిగా తగ్గాయని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఘన, ద్రవ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి వాటిని సక్రమ విధానంలో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ కుళాయి, మరుగుదొడ్డి సౌకర్యాన్ని కల్పించేందుకు గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలపైనా ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు.

5 వైద్య కళాశాలల్లో వేగంగా మౌలిక సదుపాయాల కల్పన

- మంత్రి రజిని ఆదేశం



సాక్షి, అమరావతి: కొత్తగా ఏర్పాటైన ఐదు వైద్యకళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనను వేగంగా పూర్తిచేయాలని అధికారులను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. ఆమె మంగళవారం ఐదు కళాశాలలకు సంబంధించిన జిల్లాల కలెక్టర్లు, ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాల వైద్యకళాశాలలను ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించడానికి ఎన్ఎంసీ అనుమతులు లభించాయని చెప్పారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించడానికి అవసరమైన అన్ని వసతులు చకాచకా ఏర్పాటు చేయాలన్నారు. వసతుల కల్పనలో రాజీపడొద్దని సీఎం జగన్ ఆదేశించినట్టు చెప్పారు. వైద్య రంగం బలోపేతానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, 17 కొత్త వైద్యకళాశాలల ఏర్పాటు చేపట్టిందని తెలిపారు. మిగిలిన 12 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూడా దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మానవవనరుల కొరతకు తావులేకుండా 49 వేల ఉద్యోగాలను వైద్యశాఖలో భర్తీ చేసినట్లు ఆమె చెప్పారు. సమీక్షలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్ , ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, డీఎంఈ డాక్టర్ నరసింహం, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

నేరుగా శిక్షించడం చెల్లదు

1987లో ఓ ఉద్యోగికి ఉన్నతాధికారులు విధించిన శిక్ష రద్దు చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి : ఆరోపణలు వచ్చిన ఉద్యోగికి చార్జ్‌మెమో ఇవ్వకుండా, శాఖాపరమైన విచారణ జరపకుండా నేరుగా శిక్ష విధించడం చట్ట ప్రకారం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఇది ఉద్యోగుల సర్వీసు నిబంధనలకు, సహజ న్యాయ సూత్రాలకు కూడా విరుద్ధమని తేల్చి చెప్పింది. ఓ ఉద్యోగికి షోకాజ్ నోటీసు మాత్రమే ఇచ్చి, వివరణ సంతృప్తికరంగా లేదంటూ రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ 1987లో విధించిన శిక్షను రద్దు చేసింది. ఆ ఉద్యోగి అన్ని రకాల సర్వీసు ప్రయోజనాలకు అర్హుడని చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో ఆ ఉద్యోగి 36 ఏళ్ల తర్వాత ఆరోపణలు, శిక్ష నుంచి విముక్తుడయ్యారు. 31 ఏళ్ల వయస్సులో మొదలుపెట్టిన న్యాయ పోరాటంలో పదవీ విరమణ తర్వాత 67 ఏళ్ల వయస్సులో విజయం సాధించారు.

చార్జ్‌మెమో ఇవ్వకుండానే శిక్ష

విజయనగరానికి చెందిన సీహెచ్ లక్ష్మీ నర్సయ్య సెరీకల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవారు. ఆయన పనితీరు సంతృప్తికరంగా లేదంటూ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసు జారీ చేసి, ఎందుకు పెనాల్టీ విధించకూడదో వివరణ కోరారు. లక్ష్మీ నర్సయ్య ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని ఉన్నతాధికారులు తేల్చారు. ఆయనపై అభియోగాలు నమోదు చేయకుండా, చార్జ్‌మెమో ఇవ్వకుండా, శాఖాపరమైన విచారణ జరపకుండా నిరవధికంగా రెండు ఇంక్రిమెంట్లను నిలిపేస్తూ 1987 నవంబర్‌లో శిక్ష విధించారు. ఈ శిక్షపై లక్ష్మీ నర్సయ్య 1988లో చేసిన అప్పీల్‌ను అధికారులు కొట్టేశారు. దీనిపై 1989లో ఆయన పునర్విచారణ అధికారి ముందు రివిజన్ పిటిషన్ వేశారు. దీనిపై సుదీర్ఘ కాలం నిర్ణయం వెలువరించలేదు. 2005లో లక్ష్మీ నర్సయ్య వినతి పత్రం పెట్టుకున్న తరువాత పునర్విచారణాధికారి ఆ పిటిషన్‌ను కొట్టేశారు. దానిని సవాలు చేస్తూ అదే ఏడాది ఆయన ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ)లో పిటిషన్ వేశారు. 1987లో విధించిన శిక్షపై 2005లో పిటిషన్ ఎలా దాఖలు చేస్తారంటూ 2006లో ట్రిబ్యునల్ ఆ పిటిషన్‌ను కొట్టేసింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులపై ఆయన 2015లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపింది. లక్ష్మీనర్సయ్య తరఫున సీనియర్ న్యాయవాది ఎం.భాస్కరలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. జాప్యం కారణంగానే ట్రిబ్యునల్ పిటిషన్‌ను కొట్టేసిందని, జాప్యానికి పిటిషనర్ కారణం కాదని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2006లో ట్రిబ్యునల్ ఉత్తర్వులిస్తే 2015లో సవాలు చేశారని, ఈ అసాధారణ జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. జాప్యం ఉన్న మాట వాస్తవమేనని, అయితే ఈ ఒక్క కారణంతో పిటిషన్‌ను కొట్టేయడం సాధ్యం కాదంది. అధికారులు విధించిన శిక్షను రద్దు చేసింది.

నర్సింగ్ కళాశాల వేధింపుల ఘటనపై విచారణ

సాక్షి, అమరావతి: విజయవాడలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వేధింపులకు పాల్పడుతున్నాడంటూ విద్యార్థినులు ఆందోళనకు దిగిన ఘటనపై డీఎంఈ డాక్టర్ నరసింహం విచారణకు ఆదేశించారు. ఘటనపై విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను మంగళవారం ఆదేశించారు. జీజీహెచ్‌లోని ఒక వైద్యాధికారితో పాటు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, స్కూల్ నుంచి ఒక్కొక్కరు చొప్పున టీచింగ్ ఫ్యాకల్టీని కమిటీలో ఉంచాలని సూచించారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురంలోని నవోదయ కాలేజీ నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ అసభ్యకర చేష్టలతో వేధిస్తున్నాడంటూ విద్యార్థినులు సోమవారం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే.

వేగ జ్యువెలర్స్ లక్కీ డ్రా విజేతల ప్రకటన

అమరావతి: విజయవాడలోని నందమూరి రోడ్డులో ఉన్న వేగ జ్యువెలర్స్‌లో నిర్వహించిన డ్రా లో విజేతలుగా నిలిచిన ఖాతాదారుల వివరాలను యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. ఇందులో గోల్డ్‌రింగ్‌ను వి.సాయికృష్ణ కార్తీక్ , లెహంగాలను ఇషా కోగంటి, ఐక్య మద్ది, జీబీఎస్ లలిత గెలుపొందినట్లు వెల్లడించింది. విజేతలకు సంస్థ ప్రతినిధులు నవీన్,సుధాకర్‌లు బహుమతులు అందజేశారు.

టీడీపీ నేతల శవ రాజకీయం

- పాత కక్షలతో మహిళ హత్యను రాజకీయం చేస్తున్న టీడీపీ
- జీజీహెచ్ వద్ద హైడ్రామా.. నానా యాగీ
- ఆర్డీవో ఆదుకుంటామని చెప్పినా వినిపించుకోని వైనం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న కొండపి ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయస్వామి




మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఒంగోలు అర్బన్: రాజకీయంగా ఉనికిని కోల్పోతున్న తెలుగుదేశం పార్టీని బతికించుకునేందుకు ఆ పార్టీ నేతలు దిగజారి వ్యవహరిస్తున్నారు. రెండు కుటుంబాల మధ్య గొడవను అడ్డుపెట్టుకుని.. నిస్సిగ్గుగా శవ రాజకీయాలు చేస్తున్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం రావివారిపాలెం గ్రామంలో సవలం సుధాకర్ భార్య హనుమాయమ్మ(48) అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన సవలం కొండలరావు(బుజ్జి) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. కొన్నేళ్లుగా వీరి మధ్య భూ తగాదా ఉంది. అతను వచ్చినప్పుడల్లా గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో హనుమాయమ్మ సోమవారం తన ఇంటి ముందు కూర్చుని ఉండగా.. కొండలరావు తన ట్రాక్టర్ నాగేలు అడ్డతో ఆమెను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆమె కింద పడటంతో వెనుక టైరుతో తొక్కించాడు. దీన్ని అవకాశంగా తీసుకున్న టీడీపీ నేతలు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామి.. హనుమాయమ్మ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఒంగోలు జీజీహెచ్ వద్ద మంగళవారం హైడ్రామా నడిపారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఆదుకోవాలంటూ హడావుడి చేశారు. పాత కక్షలు, కుటుంబ తగాదాలతోనే సదరు మహిళను హత్య చేశారని ఆ గ్రామ ప్రజలంతా స్పష్టంగా చెబుతున్నా, రాజకీయ రంగు పులుముతూ ప్రభుత్వంపై, అధికార యంత్రాంగంపై, పోలీసులపై ఆరోపణలు గుప్పించారు. ఆందోళన చేస్తున్న వారి వద్దకు స్వయంగా వచ్చిన ఆర్డీవో, టంగుటూరు తహశీల్దార్‌లు.. మానవతా దృక్పథంతో వీలైనంత మేర ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అయినా టీడీపీ నేతలు వినిపించుకోకుండా నానా యాగీ చేశారు. టీడీపీ నేతల వైఖరిని కళ్లారా చూసిన వారంతా.. ఇదేం రాజకీయం అంటూ ఆశ్చర్యపోయారు. ఇదిలా ఉండగా, మహిళ మృతదేహానికి రిమ్స్‌లో పోస్టుమార్టం పూర్తయింది. మృతురాలి భర్త తన అన్న భార్యపై కూడా అనుమానం వ్యక్తం చేశాడు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తూ.. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

- విజయవాడ పటమటకు చెందిన 45 ఏళ్ల రమేష్ ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. ఏడాది కిందట ఉద్యోగం కోల్పోయాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టు ముట్టడంతో తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యాడు. నిద్ర పట్టక పోవడం , దీర్ఘ ఆలోచనలు చేయడంతో పలు రోగాల బారిన పడ్డాడు. ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా జబ్బు ఏమీ లేదని తిప్పి పంపేవారు. ఆ తర్వాత తీవ్రమైన మానసిక ఒత్తిడి కారణంగానే ఇలా జరుగుతుందని వైద్యులు తేల్చారు.

- లబ్బీపేటకు చెందిన 35 ఏళ్ల వెంకటేష్ ప్రభుత్వ ఉద్యోగి. ప్రతిరోజూ అర్ధరాత్రి దాటే వరకూ సెల్‌ఫోన్ చూస్తూ, ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లే సమయానికి గానీ నిద్రలేచే వాడు కాదు. నిత్యం ఇలా హడావుడిగా బయలు దేరడం, ఆఫీసుకు పరుగులు పెట్టే క్రమంలో ఒత్తిడికి గురయ్యాడు. అవి తీవ్ర రూపం దాల్చడంతో సైకాలజిస్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

మనసు కడలిలో ఒత్తిడి ఉప్పెన



చిత్తవుతున్న మనిషి ఆరోగ్యం

- పెరుగుతున్న మానసిక సమస్యలు
- వ్యాధి నిరోధక శక్తిపై ప్రభావం
- హార్మోన్ల అసమతుల్యతతో మహిళల్లో రుతుక్రమ సమస్యలు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- మానసిక ఉల్లాసంపై దృష్టి పెట్టాలని నిపుణుల సూచన


లబ్బీపేట(విజయవాడతూర్పు): తల తిరుగుతుంది.. కడుపులో తిప్పుతుంది.. గుండె పట్టుకుంటుంది.. ఏ పనినీ సక్రమంగా చేయనివ్వదు.. చివరకు ఆత్మహత్యకు దారి తీస్తుంది..! అదే డిప్రెషన్. ఇది ఈ కాలపు ప్రధాన సమస్య. ఒకప్పటి పాతరోజుల్లో జీవితంలో ఎప్పుడోగానీ ఒత్తిడి ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురయ్యేది కాదు. కానీ ఇటీవల అందరూ నిత్యం ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. నిరంతరం ఒత్తిడికి గురయ్యే వారిలో వ్యాధి నిరోధక శక్తి లోపిస్తుందని, ఇన్‌ఫెక్షన్స్ పెరుగుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇలా గుర్తించండి..

నిద్రలేమి, ఎల్లప్పుడూ దిగులుగా ఉండటం.. ఏకాగ్రతా లోపించడం వంటి సమస్యలు ఉంటే మానసిక నిపుణుల సలహా ఎంతో అవసరం. ఇలాంటి వారు క్లిష్ట పరిస్థితుల్లో నికోటిన్, డ్రగ్స్, ఆల్కాహాల్‌తో పాటు, ఆహారం ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. పిల్లల్లో తరచూ కోపం, చికాకు పడటం, తలను గోడకేసి కొట్టుకునే ప్రయత్నం చేస్తుంటారు. మానసిక అశాంతికి కారణమయ్యే వ్యతిరేక భావనలు పెరిగిపోతుంటే తక్షణమే కౌన్సెలింగ్ పొందడం , ఆరోగ్య సలహా తీసుకోవడానికి మొహమాట పడకూడదు. మీ సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఇలాంటి సమస్యలతో బాధపడుతుంటే వెంటనే నిపుణులను సంప్రదించాలి.

కొరవడిన మానసికోల్లాసం

నగరంలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా ప్రాంగణాలు లేని పరిస్థితి నెలకొంది. ఉదయం 8 నుంచి రాత్రి 7 వరకూ పుస్తకాలతోనే కుస్తీ పట్టించడంతో వారిలోని సృజనాత్మకత దెబ్బతినడంతో పాటు, జ్ఞాపకశక్తిని కోల్పోతున్నట్లు, ఒత్తిళ్లకు గురవుతున్నట్లు మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. ఆటపాటలతో చదివిన వారిలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని, బట్టీ చదువుల్లో రోబోలుగా మారుతున్నారు. వారిలో సామాజిక, నైతిక విలువలు కూడా పెంపొందడం లేదని చెబుతున్నారు.



ఒత్తిళ్లతో రుగ్మతలు



తీవ్రమైన ఒత్తిళ్లకు గురయ్యే వారు అనేక రుగ్మతలకు గురవుతుంటారు. ముఖ్యంగా హార్మోన్ల అసమతుల్యతతో మహిళల్లో పీరియడ్స్ సంబంధిత సమస్యలు వస్తున్నాయి. నిద్రలేకపోవడం, ఎక్కువ ఆహారం తినడం కారణంగా ఊబకాయులుగా మారిపోతున్నారు. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. సరైన సమయంలో కౌన్సెలింగ్, చికిత్స పొందడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చు.

– డాక్టర్ విజయలక్ష్మి, మానసిక వైద్య నిపుణురాలు, విజయవాడ

యువతలో తీవ్రమైన ఒత్తిడి



ప్రస్తుతం యువత ఎక్కువగా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. వారిపై సెల్‌ఫోన్, సోషల్ మీడియా ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. వాటికి అడిక్ట్ అవడంతో ఇతర వాటిపై దృష్టి సారించలేక పోతున్నారు. చదువులో రాణించలేకపోవడం, ఉద్యోగంలో పనిపై దృష్టి పెట్టలేక పోవడం, వ్యాపారాలు, ఇలా అనేక రంగాల వారు కౌన్సెలింగ్ కోసం మా వద్దకు వస్తున్నారు. దేనినైనా అవసరం మేరకు వినియోగించాలి.

– డాక్టర్ గర్రే శంకరరావు, సైకాలజిస్టు

ఒత్తిడితో దుష్ప్రభావాలు

- నిద్ర పట్టక పోవడం
- ఆకలి లేక పోవడం, లేక ఎక్కువ ఆహారం తినడం
- ఎక్కువ తినేవారు ఒబెసిటీకి గురవడం
- హార్మోన్ల సమతుల్యత లోపించడంతో మహిళల్లో పీరియడ్స్ ఇబ్బందులు
- మధుమేహం, రక్తపోటు అదుపులో లేకపోవడం
- తీవ్రమైన ఒత్తిడి ఉన్న వారిలో హృద్రోగ సమస్యలు
- వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో ఇన్‌ఫెక్షన్స్ సోకడం జరుగుతుంది.

ఇలా జయించొచ్చు

- రోజుకు 7 గంటలు తగ్గకుండా నిద్రపోవాలి, ఒకే సమయానికి రోజూ పడుకోవాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- యోగ, మెడిటేషన్‌పై దృష్టి సారించి, క్రమం తప్పకుండా పాటించాలి
- సెల్‌ఫోన్ చూడటం మాని, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి.
- భావోద్వేగాలు, ప్రవర్తనలపై అదుపు కలిగి ఉండాలి.
- అసమానతలు, సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకోవాలి.

ప్రభుత్వ భూముల్లో.. పేదలపై పెత్తనం



ప్రభుత్వ భూముల్లో పెత్తందారులు పెత్తనం చెలాయిస్తున్నారు. అసైన్డ్ పట్టాలిచ్చారంటూ స్థానికులు, అధికారులను నమ్మించి దర్జాగా అనుభవిస్తున్నారు. పక్కనే ఉన్న మిగులు భూముల్లో దళితులు ఆటస్థలం కోసం చదును చేసుకుంటే వారిపై దౌర్జన్యానికి దిగారు. తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం, బాలాయపల్లి మండల పరిధిలోని రామాపురంలో వెలుగుచూసిన టీడీపీ నేతల ఆక్రమణ పర్వంపై 'సాక్షి' ఫోకస్..

- నిమ్మతోటలు సాగుచేసుకుంటున్న వైనం
- అసైన్డ్ భూపట్టాలిచ్చారంటూ నమ్మిస్తున్న స్థానికులు
- పదేళ్లుగా అనుభవిస్తున్నా వారి జోలికెళ్లని అధికారులు
- దళితులు.. గిరిజనుల ఆట స్థలం కోసం చదునుచేస్తే దౌర్జనం
- బాలాయపల్లిలో వెలుగుచూసిన టీడీపీ నేతల ఆక్రమణల పర్వం



ఆక్రమించిన భూముల్లో నిమ్మసాగు

సాక్షి, తిరుపతి: రామాపురం పరిధిలో సర్వే నంబర్ 177లో 348.98 ఎకరాల మేతపోరంబోకు భూమి ఉంది. అదేవిధంగా సర్వే నంబర్ 189లో 37.7 ఎకరాల చెరువు పోరంబోకు, సర్వే నంబర్ 178/1, 179, 180లో ప్రభుత్వ, చెరువు పోరంబోకు భూమి ఉంది. కోట్ల రూపాయల విలువచేసే ఈ భూములపై టీడీపీ నేతల కన్నుపడింది. రామాపురం మారుమూల గ్రామం కావడంతో అప్పట్లో అధికారుల రాకపోకలు పెద్దగా ఉండేవి కావు. ఇదే అదునుగా టీడీపీ నేతలు కొద్దికొద్దిగా ఆక్రమించుకోవడం ప్రారంభించారు. చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు అదే గ్రామ పరిధిలోని దళిత, గిరిజనులు ఆ భూములవైపు వెళ్లకుండా అడ్డుకుంటూ వచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భూ పంపిణీ పథకం కింద స్థానిక దళిత, గిరిజనులను జాబితాలో చేర్చినట్లు సమాచారం. అయితే పెత్తందారులు వారి పేర్లను తొలగించినట్లు స్థానికులు ఆరోపించారు.

పెత్తందార్లను ఎదిరిస్తే సాంఘిక బహిష్కరణే!

పెత్తందారులంతా ఏకమై రామాపురం పరిధిలో ఉన్న ప్రభుత్వ, చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎవరెవరు ఎంతెంత ఆక్రమించుకోవాలో మాట్లాడుకున్నారు. పేరు, పలుకుబడి ఉన్న వారు ఆరు ఎకరాల చొప్పున ఆక్రమించుకుంటే.. వారితో ఉన్న మరి కొందరు 1, 2, 3 ఎకరాల చొప్పున ఆక్రమించుకున్నారు. ఆక్రమించుకున్న భూమిలో నిమ్మచెట్లు సాగుచేశారు. పదేళ్ల క్రితం పెట్టిన చెట్లు కావడంతో ప్రస్తుతం పెద్దవయ్యాయి. ఆక్రమణదారులకు స్థానిక అధికారులు పూర్తిసహాయ సహకారాలు అందిస్తున్నట్టు దళిత, గిరిజనులు ఆరోపిస్తున్నారు. వారిని కాదని ఎదురు తిరిగితే సాంఘిక బహిష్కరణకు గురికాక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆట స్థలం ఏర్పాటు చేసుకుంటే దౌర్జన్యం

స్థానిక యువకులు కొందరు బీడుగా ఉన్న ప్రభుత్వ భూమి రెండెకరాల్లో క్రికెట్ ఆడుకునేందుకు ఆటస్థలంగా తీర్చుకున్నారు. జీర్ణించుకోలేని పెత్తందారులు స్థానిక రెవెన్యూ అధికారులను రెచ్చగొట్టి యువకులపైకి పంపారు. ఆటస్థలాన్ని ధ్వంసం చేశారు. అదేవిధంగా దళిత, గిరిజనులు కొందరు బీడుగా ఉన్న భూమిలో నిమ్మచెట్లు పెట్టడంతో.. పెత్తందారులు అధికారుల సహకారంతో ఆ చెట్లను పీకించేశారు. సర్వే నంబర్ 177లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టారు.



బీసీ, ఎస్సీ, ఎస్టీలు కొందరు ఏకమై ఇటీవల తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడం గమనార్హం.



దళిత, గిరిజనులు నాటిన నిమ్మచెట్లను పీకేసిన పెత్తందారులు (ఫైల్)

> **ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు**
>
> అసైన్డ్‌మెంట్ పట్టాలున్న వారు మాత్రం సాగుచేసుకోవచ్చు. మిగిలిన ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చర్యలు తప్పవు. రామాపురంలోని ప్రభుత్వ భూములపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.
>
> – కిరణ్‌కుమార్, ఆర్డీఓ, గూడూరు డివిజన్

అనారోగ్యాలను దూరం చేసే చల్లని చిరునవ్వు ..
విధి నిర్వహణలో అంకితభావం ..
రోగులపాలిట ఆమె అపర నైటింగేల్ ...
సమాజ క్షేమం కోరేవారికి తర తమ భేదాలుండవు అని
తన చేతల్లో చూపుతోంది కామారెడ్డి జిల్లా బాన్సువాడ
ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న ఆరోగ్యజ్యోతి.

సేవాజ్యోతి



పాతికేళ్లుగా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఎంతోమంది మన్ననలు అందుకున్నారు ఆరోగ్యజ్యోతి. ఆమె సేవలను గుర్తించి ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్నాటక వారు 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్-2023' అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. మంగళవారం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుని సేవాజ్యోతిగా గుర్తింపు పొందింది ఆరోగ్యజ్యోతి.

బోధన్ పట్టణానికి చెందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తోంది. 1998లో స్టాఫ్ నర్స్ ఉద్యోగంలో చేరి నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రెండేళ్లు పనిచేసిన ఆమె 2000 సంవత్సరంలో బోధన్ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి అక్కడే ఇరవై ఏళ్లుగా విధులు నిర్వర్తించింది. 2019 లో హెడ్ నర్స్‌గా పదోన్నతి పొందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి, అక్కడే విధుల్లో కొనసాగుతోంది. కరోనా కాలంలో వైద్యులతో కలిసి రోగులకు ఎన్నో సేవలందించిన ఈ నైటింగేల్ పాతికేళ్ల కాలంలో ఎక్కడ ఉద్యోగం చేసినా విధి నిర్వహణకు అంకితమై పనిచేస్తూ వచ్చింది. దీంతో ఆమె అందరికీ తలలో నాలుకలా మారింది. ఆపరేషన్ థియేటర్‌తోపాటు ప్రసూతి వార్డుల్లోనే ఆమె ఎక్కువగా విధులు నిర్వర్తించింది. అధికారుల నుంచి ఎన్నో మన్ననలు, సామాజిక సేవలకు గాను అవార్డులనూ పొంది సేవాగుణంలో ముందువరసలో నిలిచింది.

మాకెంతో గర్వకారణం

సేవతో అందరి మన్ననలు పొందే ఆరోగ్య జ్యోతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్-2023 అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మేమంతా గర్వించదగ్గ విషయం. ఈ అవార్డు స్ఫూర్తి మిగతా అందరిలో కలగాలని కోరుకుంటున్నాను.

– డాక్టర్ శ్రీనివాసప్రసాద్,
సూపరింటెండెంట్,
బాన్సువాడ ఏరియా ఆస్పత్రి

అందరి సహకారంతో...

సేవా కార్యక్రమాల్లో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది. ఉద్యోగ నిర్వహణలో తోటి ఉద్యోగులు, వైద్యుల సహకారం, ప్రోత్సాహంతోనే ముందుకు సాగుతున్నాను. నా చిన్నప్పుడు మా అమ్మానాన్నలు ఎంతోమందికి సాయం అందించేవారు. వాళ్లను చూసి నాకూ అలవాటైంది. నా ప్రయత్నాల్లో మా వారు అండగా నిలిచారు. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను.

– ఆరోగ్యజ్యోతి,
హెడ్‌నర్స్, బాన్సువాడ



కూతురి మరణంతో..

ఆరోగ్య జ్యోతి కూతురు అనుకోని పరిస్థితుల్లో విద్యుత్‌షాక్‌కు గురై మరణించింది. కూతురి మరణంతో ఆవేదనకు గురైన ఆరోగ్యలక్ష్మి తన సేవలను మరింత విస్తృతం చేయాలని సంకల్పించింది. ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టింది. వైద్యరంగంలో తనకున్న పరిచయాలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేసే కార్యక్రమాలు చేపడుతుంటుంది. బీపీ, షుగర్, గుండె సంబంధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టి రోగులకు అండగా నిలుస్తోంది. అలాగే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా చేపట్టి, గర్భిణీలు, బాలింతలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం శిబిరాలు ఏర్పాటు చేసి ఆదుకుంటుంది.



బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ -2023 అవార్డు అందుకుంటున్న ఆరోగ్యజ్యోతి

– ఎస్.వేణుగోపాల్ చారి,
సాక్షి, కామారెడ్డి

మలీషా మాణిక్యమే

మనలో టాలెంట్ ఉండాలేగానీ పాతాళంలో ఉన్నా సరే రివ్వున ఎగసి మిలమిల మెరిసే తారల్లా అందరి చూపులను మనవైపు తిప్పుకోవచ్చు అని చెబుతోంది మలీషా ఖార్వ. ముంబై మురికివాడ ధారావిలో పుట్టిపెరిగిన 15 ఏళ్ల మలీషా నేడు లగ్జరీ బ్రాండ్ మోడల్‌గా మారి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.



సాదాసీదాగా సాగిపోతున్న మలీషా జీవితాన్ని మలుపు తిప్పే సంఘటన ఒకటి జరిగింది. అదేమిటంటే, ఓ మ్యూజిక్ వీడియో తీయడానికి ఇండియా వచ్చిన హాలీవుడ్ నటుడు రాబర్ట్ హాఫ్‌మాన్.. తన పని పూర్తి చేసుకుని తిరిగి తన దేశానికి వెళ్లిపోదామనుకున్నాడు. కానీ అదే సమయంలో కరోనా మహమ్మారిని కట్టడి చేసేందుకు దేశంలో లాక్‌డౌన్ విధించడంతో.. ఇక్కడే ఉండిపోవలసి వచ్చింది. ఈ సమయంలోనే అనుకోకుండా అతడికి మలీషాతో పరిచయం అయ్యింది. తాను కలిసిన వాళ్లందరిలోనూ ఆమె విభిన్నంగా, ముఖ కవళికలు చూడముచ్చటగా కనిపించడంతో హాఫ్‌మాన్, 'పెద్దయ్యాక ఏమవాలనుకుంటున్నావు?' అని ఆమెను సరదాగా అడిగాడు. క్షణం కూడా తడుముకోకుండా 'నేను మోడల్‌ని కావాలనుకుంటున్నాను'' అని



మలీషా



కిడ్నాప్ చేస్తారని భయం వేసింది!

"ప్రియాంక చోప్రాలా మోడల్ అవాలని, నోరా ఫతేహీ డ్యాన్స్ చేయాలని ఉండేది. కానీ మాది చాలా పేద కుటుంబం. ఈ మురికి వాడ నుంచి ఆ స్థాయికి ఎలా ఎదగాలి అని ఆలోచిస్తూ ఉండేదాన్ని. మోడలింగ్ మేనేజర్‌ను కలిశాక... 'ఎవరో ఒకతను నా ఫొటోలు తీస్తుంటే ఎందుకితను నా ఫొటోలు తీస్తున్నాడు? బహుశా కిడ్నాప్ చేస్తాడేమో' అని భయం వేసింది. అది గమనించిన ఆ మేనేజర్ 'అలాంటిదేం లేదు. నీ ఫొటోలు పాపులర్ అవుతాయి' అని చెప్పడంతో భయం పోయింది. ఆ ఫొటోలు చూసిన మేనేజర్ 'నీ కళ్లు చాలా బావున్నాయి. మోడల్‌వి అవుతావా?' అని అడిగారు. అప్పుడు నేను మా నాన్నను అడగాలని చెప్పాను. వెంటనే ఆయన నాన్న గారిని కలిసి మోడలింగ్ గురించి వివరించి చెప్పారు. నాన్న వెంటనే మా తాతయ్యవాళ్లతో చెప్పి ఒప్పించడంతో ఇప్పుడు నా కలలను నిజం చేసుకోవడానికి దారి దొరికింది. మోడలింగ్ చేస్తూ ఉన్నత చదువులు చదువుతాను" అని ఎంతో ఆత్మవిశ్వాసంతో, మరెంతో సంతోషంతో చెప్పింది.

చెప్పింది మలీషా. ఆ చిన్నారి కలలను నిజం చేసేందుకు రాబర్ట్ 'గో ఫండ్ మి' పేజీ క్రియేట్ చేశాడు. దీంతోబాటు ఆమెను ఓ మోడలింగ్ మేనేజర్‌కు పరిచయం చేశాడు. అంతటితో ఆగక మలీషా పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీ క్రియేట్ చేశాడు.

అప్పటినుంచి మోడలింగ్ మేనేజర్ చెప్పినట్లు చేస్తూ మోడల్‌గా ఫొటోలు దిగేది మలీషా. ఆ ఫోటోలు ప్రముఖ ఫారెస్ట్ ఎసెన్షియల్ బ్రాండ్‌కు నచ్చడంతో ... వారు కొత్తగా ప్రవేశపెట్టిన 'ద యువతి కలెక్షన్స్'కు మలీషాను మోడల్‌గా తీసుకున్నారు. ఫారెస్ట్ ఎసెన్షియల్ స్టోర్‌కు వెళ్లిన మలీషా అక్కడ ఉన్న పోస్టర్లు, బ్రాండ్ ఉత్పత్తులపై తన ఫోటో రావడంతో తెగ సంబరపడిపోయింది. మలీషా సంబరపడిపోతున్న వీడియోను బ్రాండ్ వారు అధికార ఇన్‌స్టాగ్రామ్ పేజీలో విడుదల చేశారు. ఈ వీడియోకు యాభైలక్షలకుపైగా వ్యూస్, లైక్‌లు రావడంతో సోషల్ మీడియాలో మలీషా బాగా పాపులర్ అయ్యింది. ఈ వీడియో చూసిన నెటిజనులంతా ఆమెను ''ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్''గా అభివర్ణిస్తున్నారు.

మోడలింగ్‌తోపాటు నటనలో కూడా తన టాలెంట్ చూపిస్తోన్న మలీషా ''లీవ్ యువర్ ఫెయిరీ టేల్'' డాక్యుమెంటరీలో నటించింది. పీకాక్ మ్యాగజీన్‌పైనేగాక, సమీరారెడ్డి, కుషాకపిలతో పాటు మలీషా ఫోటో 'కాస్మో ఇండియా మ్యాగజీన్'పైన కూడా రావడం విశేషం. పదోతరగతి చదువుతోన్న మలీషా పరిణితి చెందిన అమ్మాయిలా కనిపిస్తుంది. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతుంది. తనకొచ్చిన పాపులారిటీతో భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు మలీషా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. తన కలలు నిజం కావాలని ఆశిద్దాం.

బ్యూటిప్స్

రంధ్రాలు మాయం చేసే.. మెంతి ప్యాక్!

రాత్రంతా నానబెట్టుకున్న టీస్పూను మెంతులను నీళ్లు తీసేసి మిక్సీ జార్ లో వేయాలి. దీనికి ఆరు వేపాకులు, రెండు కీరదోసకాయ ముక్కలు జోడించి పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ముల్తానీ మట్టి, అర టీస్పూను నిమ్మరసం వేసి చక్కగా కలిపి, ముఖానికి పూతలా వేసుకుని ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత చేతులని తడిచేసుకుని ఐదు నిమిషాలపాటు మర్దన చేసి చల్లటి నీటితో కడిగేయాలి. ● వారానికి ఒకసారి క్రమం తప్పకుండా ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం మీద అసహ్యంగా కనిపిస్తోన్న రంధ్రాలు, డార్క్ సర్కిల్స్, మొటిమల తాలుకు మచ్చలు పోయి ముఖం చర్మం బిగుతుగా మారి, మృదువైన నిగారింపుని సంతరించుకుంటుంది. ● మెంతుల్లోని యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఏజింగ్ గుణాలు ముఖ చర్మానికి తేమనందించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.



Vక్టరీ కోడ్

యూత్ పల్స్

యాపిల్ వరల్డ్ వైడ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (డబ్ల్యూడబ్ల్యూడీసీ) కొద్దిరోజుల క్రితం కాలిఫోర్నియాలోని యాపిల్ పార్క్‌లో మొదలైంది. యువతలోని టెక్ ప్రేమికులకు ఇది పండగలాంటి బిగ్ ఈవెంట్. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ మార్పులకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవడం ఒక కోణం అయితే, 'డబ్ల్యూడబ్ల్యూడీసీ'లో పాల్గొనే అవకాశం సొంతం చేసుకున్న 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల మాటలతో స్ఫూర్తి పొందడం మరో కోణం...

సాంకేతిక దిగ్గజం 'యాపిల్' ప్రతి సంవత్సరం స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ నిర్వహిస్తుంది. 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్-2021' విజేతలలో న్యూజెర్సీకి చెందిన అభినయ దినేష్ ఒకరు. భారతీయ మూలాలు ఉన్న అభినయ పదిహేను సంవత్సరాల వయసులో 'గ్యాస్ట్రో ఎట్ హోమ్' అనే యాప్‌ను క్రియేట్ చేసింది. జీర్ణకోశ సంబంధిత వ్యాధులతో బాధ పడేవారికి అవసరమైన సమాచారానికి ఉపకరించే యాప్ ఇది.

'అనుకున్న ఐడియాను యాప్‌గా రూపొందించడం అనేది కష్టంతో కూడుకున్న పని' అంటోంది అభినయ.

భారతీయ మూలాలు ఉన్న అవితా విజయ్ (ఆస్ట్రేలియా) తొమ్మిదేళ్ల వయసులోనే యాపిల్ 'డబ్ల్యూడబ్ల్యూడీసీ-2016' విజేతలలో ఒకరిగా నిలిచింది. యాపిల్ ఐఫోన్, ఐపాడ్‌ల కోసం యాప్స్‌ను క్రియేట్ చేసింది.

'కోడింగ్ అనేది చాలా కష్టం' అంటూనే కోడింగ్‌పై అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తోంది.

గత సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల జాబితాలో జస్కరన్ సింగ్, గీతాన్ష్ ఆత్రే, సుయాష్‌లు ఉన్నారు. పదమూడు సంవత్సరాల వయసులో సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని గీతాన్ష్ కోడింగ్ జర్నీ మొదలు పెట్టాడు.



ఈ సంవత్సరం విజేతలలో...

ఇండోర్ (మధ్యప్రదేశ్)కు చెందిన ఆస్మీ జైన్ ఒకరు. ఇరవై సంవత్సరాల ఆస్మీ జైన్ యూజర్ ఐ మూమెంట్స్‌ను ట్రాక్ చేసే యాప్‌ను డిజైన్ చేసింది. కంటిసమస్యలు ఎదుర్కొనే వారికి ఉపయోగపడే యాప్ ఇది. వైద్యరంగానికి అవసరమయ్యే యాప్‌లను తయారు చేయాలనేది ఆస్మీ లక్ష్యం.

'నా ప్యాషన్‌ను ప్రపంచంతో షేర్ చేసుకోవడానికి కోడింగ్ అనేది ఒక సాధనంలా ఉపయోగపడుతుంది' అంటుంది ఆస్మీ.

ఇరవై అయిదు సంవత్సరాల మార్త మైఖేల్‌కు పురాజీవశాస్త్రం అంటే ఇష్టం. ఇటలీ నేపుల్స్ నగరంలోని 'యాపిల్ డెవలప్‌మెంట్ అకాడమీ' స్టూడెంట్. ఈ సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతలలో మార్త ఒకరు.

మెమొరీ గేమ్ యాప్ ప్లేగ్రౌండ్‌కు రూపకల్పన చేసిన మార్త 'ఇతరులతో నా భావాలను పంచుకోవడంలో, కొత్తదారులు వెదుక్కోవడంలో కోడింగ్ నాకు ఉపయోగపడింది' అంటుందామె.

జంతుసంరక్షణ, పర్యావరణ సంరక్షణకు సంబంధించిన యాప్‌లను రూపొందించాలనేది ఆమె భవిష్యత్ లక్ష్యం.

'డబ్ల్యూడబ్ల్యూడీసీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడమే ఒక అదృష్టం అంటే అంతకంటే అదృష్టం ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన అసాధారణమైన స్టూడెంట్స్‌తో మాట్లాడే అవకాశం రావడం. వారి ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు' అంటుంది చైనీస్ స్టూడెంట్ ఝూంగ్.

'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్-2021' విజేతలలో ఝూంగ్ ఒకరు.

మెషిన్ లెర్నింగ్, ఏఆర్ చిత్రాలు, సంగీతాలను మిళితం చేస్తూ 'సీ యువర్ స్పోర్ట్స్' అనే ప్రాజెక్ట్‌కు సొంతంగా రూపకల్పన చేసింది ఝూంగ్.

'గత రెండు సంవత్సరాలుగా స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ విన్నర్స్ గురించి తెలుసుకోవడం ఆసక్తిగా మారింది. వారి మాటలు నాకు ఎంతో స్ఫూర్తిని ఇస్తాయి' అంటుంది బెంగళూరుకు చెందిన ఇంజినీరింగ్ స్టూడెంట్ శ్రీరాగ.

నిజానికి ఇది శ్రీరాగ మాటే కాదు... తమ వయసులో ఉన్నవారి విజయాల నుంచి స్ఫూర్తి పొంది తాము కూడా ఏదైనా సాధించాలనుకునే యువతరం మనసులోని మాట.

సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!

యాపిల్ వారి స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్‌లో పాల్గొనడానికి అతీతశక్తులు అవసరం లేదు. ఆసక్తి, ఆత్మవిశ్వాసం ఉంటే చాలు. 'కోడింగ్'ను ఇష్టపడే యువతరానికి ఇదొక గొప్ప అవకాశం. 'కోడింగ్‌పై ప్యాషన్ ఉంటే చాలు టాపిక్ మీ ఇష్టం' అంటుంది యాపిల్. ఈ చాలెంజ్‌లోని విజేతలకు బహుమతులు, యాపిల్ డెవలపర్ ప్రోగ్రామ్‌లో సంవత్సర కాల సభ్యత్వం ఒక విషయం అయితే ప్రపంచవ్యాప్త గుర్తింపు అనేది పెద్ద విశేషం. విజేతల విజయాలు వారికి మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది యువతకు స్ఫూర్తిని ఇస్తున్నాయి. 'నేనెందుకు ప్రయత్నం చేయకూడదు' అని సాధన మొదలు పెడుతున్నారు. సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!

సౌండ్ హీలింగ్

మానసిక ప్రశాంతతకూ, ఒత్తిడి దూరం కావడానికీ సంగీతం ఒక సాధనం అని తెలుసు. కాని 'సౌండ్ హీలింగ్' వేరు. కచ్చితమైన పౌనఃపున్యం దగ్గర ధ్వని తరంగాలను సృష్టిస్తే అవి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా సాంత్వన కలిగిస్తాయని చెబుతోంది డాక్టర్ అంజు శర్మ. సౌండ్ హీలింగ్ కోసం ఆమె నిర్వహిస్తున్న శిబిరాలు మంచి ఆదరణ పొందుతున్నాయి.

ధ్వనితో చేయొచ్చు చికిత్స



'మీరు కారులో వెళుతున్నారు. వెనుక నుంచి ఎవరో అదే పనిగా హార్న్ కొడుతున్నారు. మీకు కోపం వస్తుందా రాదా? మీరు అదే కారులో ప్రయాణిస్తున్నారు. లోపల ఇష్టమైన పాట వస్తోంది. మీ మూడ్ హాయిగా ఉంటుందా లేదా? అంటే మీరు ఏది వింటున్నారో అది మిమ్మల్ని రోగగ్రస్తం చేయగలదు... ఆరోగ్యవంతం చేయగలదు. ఏది వింటున్నాం, ఏది అంటున్నాం అనే దాని మీద దృష్టి పెడితే మీ చెవులకు చేరుతున్న ధ్వనులు, మీ గొంతు నుంచి వెలువడుతున్న ధ్వనులు... వీటిని మంత్రమయం, సంగీతమయం, శుభమయం, శాంతిమయం చేసుకుంటే మీరు మానసికంగా, భౌతికంగా, ఉద్వేగపరంగా సమతులంగా జీవించగలరు' అంటోంది డాక్టర్ అంజు శర్మ.

దేశంలో 'సౌండ్ ఎనర్జీ మాస్టర్'గా జనం ఆరోగ్యం కోసం పని చేస్తున్న అతి తక్కువ మహిళల్లో అంజు శర్మ ఒకరు. ఈమె సౌండ్ థెరపీ ద్వారా అంటే రకరకాల పౌనఃపున్యాలు వెలువరించే పరికరాల ద్వారా ధ్వనులు వినిపిస్తూ మెదడుకు, శరీరానికి తరంగాలు పంపుతూ శరీరం లోపలి అసమతుల్యతను, అపభ్రంశతను తొలగిస్తోంది.

శబ్ద ఔషధం

'మిమ్మల్ని ఎవరో తిట్టారు. ఆ తిట్టిన మాటను మీరు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. అంటే ఆ శబ్దం మీ శరీరంలోకి వెళ్లిపోయింది. నెగెటివ్ ఎనర్జీలాగా ఉండిపోయింది. అదే మీరు ఒక మంచి మంత్రం విన్నారు. ఆశీర్వాదం విన్నారు. లేదంటే ఆలయ గంట విన్నారు. ఆ శబ్దాలు మీ లోపలికి వెళ్లాయి. అవి పాజిటివ్ ఎనర్జీగా పని చేస్తాయి. మాత్ర లోపలికి పోతే ఎలా ఔషధంగా పని చేస్తుందో శబ్దం మీ చెవి ద్వారా లోపలికి పోతే ఔషధంగా పని చేస్తుంది. సౌండ్ థెరపీలో ప్రకృతిలో వినవచ్చే శబ్దాల ద్వారా, సంగీత పరికరాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా, మానవ కంఠాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా స్వస్థత పరుస్తాం' అని తెలుపుతోంది అంజు శర్మ.



▼ 'సౌండ్ హీలింగ్' చేస్తున్న డాక్టర్ అంజు శర్మ ▲



నీటి సవ్వడి

'మనం పారుతున్న నీటి సవ్వడి వింటే ఆస్వాదిస్తాం. వాన శబ్దం విన్నా హాయిగా ఉంటుంది. ఎందుకు? మన శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. నీటి శబ్దం శరీరంలో రిథమ్ కోల్పోయిన నీటి కణాలను మళ్లీ రిథమ్‌లోకి తెస్తుంది. అందుకే ఎప్పుడైనా మానవ సంబంధాలతో వచ్చే స్ట్రెస్‌లో ఉంటే గనగ నీటి శబ్దం వినాలి. సాంత్వనం లభిస్తుంది' అని చెబుతుంది ఆమె. అప్పుడప్పుడు ప్రకృతిలోకి వెళ్లి ధ్యానం చేయడం కూడా ఆరోగ్యానికి మంచిదని చెబుతుందామె. 'ప్రకృతిలో వచ్చే శబ్దాలు ఒకవైపు మీ చెవిన పడుతుంటే ధ్యానం వల్ల మీరు మౌనాన్ని సాధన చేస్తుంటే మీ మనసు శరీరాలు ఎంతో ఓదార్పు పొందుతాయి' అంటుందామె. గృహిణులు ఇంట్లో పనులు చేసుకుంటున్నప్పుడు ఏదో ఒక ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాన్ని వినడం మంచిదని అంటుంది అంజు శర్మ. 'సీరియల్స్‌లో వినిపించే కలుషిత శబ్దాల కుట్రల డైలాగులు మీ లోపలికి వెళ్లి ఎలాంటి అనారోగ్యం కలిగిస్తాయో మీరు తెలుసుకోవాలి' అని హితవు చెబుతుంది.

కూనిరాగాల మేలు

'కొందరు కూనిరాగాలు తీసుకుంటూ పని చేసుకుంటారు. వయసు మళ్లిన వాళ్లకు కూనిరాగాలు దివ్య ఔషధంలా పని చేస్తాయి. కూనిరాగాలు శాంతిని కలుగచేస్తాయి. అలాగే అప్పుడప్పుడు చప్పట్లతో ధ్వని పుట్టించి వింటే మంచిది' అని తెలిపిందామె. 'మన శరీరంలో ప్రతి అణువుకు కంపించే శక్తి ఉంది. బయటి నుంచి వినే ధ్వనులు ఆ కంపనాలకు హాయిని కలిగించి అనుసంధానం కాగలిగితే రోగ కారక కణాలు ఏర్పడవు' అని తెలుపుతోంది అంజు శర్మ.



హంపితో హారిక గేమ్ 'డ్రా'

కెయిన్స్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి 'డ్రా' నమోదు చేసింది. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపితో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హారిక 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. మూడో రౌండ్ తర్వాత హారిక 1.5 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో, హంపి ఒక పాయింట్‌తో ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నారు.



షూటర్ మేఘన బృందానికి స్వర్ణం

జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ షూటర్ సాదుల మేఘన స్వర్ణ పతకంతో మెరిసింది. జర్మనీలో జరుగుతున్న ఈ టోర్నీలో మేఘన (577 పాయింట్లు), పాయల్ ఖత్రీ (572), సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ (570)లతో కూడిన భారత జట్టు 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఓవరాల్‌గా మేఘన జట్టు 1719 పాయింట్లు స్కోరు చేసింది. వ్యక్తిగత విభాగంలో మేఘన నాలుగో స్థానంలో నిలిచింది.

'టెస్టు' కిరీటం కోసం...

నేటి నుంచి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ • అమీతుమీ తేల్చుకోనున్న భారత్, ఆస్ట్రేలియా తటస్థ వేదికపై సమరానికి ఇరు జట్లు సిద్ధం • మధ్యాహ్నం గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సరిగ్గా రెండేళ్ల క్రితం... భారత జట్టు తొలి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరింది. 2019–21 మధ్య 12 టెస్టుల్లో విజయాలు సాధించి అద్భుత ఫామ్‌తో తుది పోరుకు అర్హత సాధించింది. అయితే అసలు సమరంలో చతికిలపడి రన్నరప్‌గా సంతృప్తి చెందింది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు న్యూజిలాండ్‌కంటే ఒక మ్యాచ్ ఎక్కువే గెలిచినా... స్లో ఓవర్ రేట్ కారణంగా నాలుగు పాయింట్లు కోల్పోయి దురదృష్టవశాత్తూ ఫైనల్ అవకాశాలు చేజార్చుకొని తీవ్ర నిరాశకు గురైంది. ఇప్పుడు ఇరు జట్లకు తొలిసారి చాంపియన్‌గా నిలిచేందుకు మరో అవకాశం వచ్చింది. ఇటీవలే ఇరు జట్లు నాలుగు టెస్టుల సిరీస్‌లో తలపడిన నేపథ్యంలో దానికి కొనసాగింపుగా అన్నట్లు మరో టెస్టు వచ్చేసింది. తటస్థ వేదికలో జరిగే హోరాహోరీ పోరులో ఎవరిది పైచేయి అవుతుందనేది ఆసక్తికరం.



లండన్: రోహిత్, కోహ్లి, అశ్విన్... భారత ప్రపంచ కప్ విజయాల్లో భాగస్వాములు... స్మిత్, వార్నర్, స్టార్క్ కూడా అదే తరహాలో ఆసీస్ విశ్వ విజేతగా నిలిచిన జట్టులో సభ్యులు... వీరంతా పరిమిత ఓవర్ల టోర్నీలో మాత్రమే కాకుండా టెస్టుల్లోనూ వరల్డ్ చాంపియన్‌గా నిలవాలని కోరుకుంటున్న సీనియర్ ఆటగాళ్లు... పుజారా, రహానే, లయన్, ఖ్వాజా తమ టెస్టు టీమ్‌ల తరఫున చిరస్మరణీయ ప్రదర్శనలు చేసినా ఇంకా విశ్వ విజేత టీమ్ సభ్యులు అనిపించుకోని ఆటగాళ్లు... కెరీర్‌లో కనీసం 50కి పైగా టెస్టులు ఆడి, 33 ఏళ్లు దాటిన వీరందరికి టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ వేదికపై సత్తా చాటేందుకు చివరి అవకాశం. గత రెండేళ్లుగా ప్రపంచ టెస్టు క్రికెట్‌లో ఆధిపత్యం ప్రదర్శించిన రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య అతి పెద్ద సమరానికి రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. గత ఫైనల్ సౌతాంప్టన్‌లో జరగ్గా, ఈసారి ఓవల్ మైదానం తుది పోరుకు వేదికైంది. ఇందులో విజేతగా నిలిచే జట్టుకు తొలిసారి డబ్ల్యూటీసీ టైటిల్ దక్కుతుంది. బలాబలాల్లో సమ ఉజ్జీలుగా కనిపిస్తున్న ఇరు జట్ల మధ్య ఆసక్తికర పోరు ఖాయం. కెప్టెన్లు రోహిత్ శర్మ, ప్యాట్ కమిన్స్‌లకు ఇది 50వ టెస్టు కావడం విశేషం.

ఫైనల్ 'డ్రా' అయితే...

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేత జట్టుకు వెండి గదతోపాటు 16 లక్షల డాలర్లు (రూ. 13 కోట్ల 20 లక్షలు), రన్నరప్ జట్టుకు 8 లక్షల డాలర్లు (రూ. 6 కోట్ల 60 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. ఒకవేళ ఫైనల్ 'డ్రా'గా ముగిస్తే రెండు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, పుజారా, కోహ్లి, రహానే, జడేజా, భరత్/ఇషాన్‌కిషన్, అశ్విన్/శార్దుల్, షమీ, సిరాజ్, ఉమేశ్.
ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, ఖ్వాజా, లబుషేన్, స్మిత్, హెడ్, గ్రీన్, క్యారీ, స్టార్క్, లయన్, బోలండ్.

పిచ్, వాతావరణం

సాధారణంగా పిచ్‌పై మంచి బౌన్స్ ఉంటుంది. అది పేసర్లకు అనుకూలం కాగా, మంచి షాట్లకు కూడా అవకాశం ఉంటుంది. స్వింగ్ ప్రభావం తక్కువ. నిలదొక్కుకుంటే బ్యాటర్లు చక్కగా పరుగులు రాబట్టవచ్చు. అయితే జూన్ నెలలో తొలిసారి టెస్టు జరుగుతుండటంతో ఎవరికీ పిచ్‌పై పూర్తి స్పష్టత లేదు. వర్షం ఇబ్బంది కలిగించకపోవచ్చు. రిజర్వ్ డే కూడా ఉంది.

14 ఓవల్ మైదానంలో భారత జట్టు ఇప్పటి వరకు 14 టెస్టులు ఆడింది. 2 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఐదింటిలో ఓడిపోయింది. 7 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది.

38 ఓవల్ మైదానంలో ఆస్ట్రేలియా జట్టు ఇప్పటి వరకు 38 టెస్టులు ఆడింది. 7 మ్యాచ్‌ల్లో నెగ్గింది. 17 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 14 మ్యాచ్‌లను 'డ్రా'గా ముగించింది.

106 భారత్, ఆస్ట్రేలియా మధ్య ఓవరాల్‌గా 106 టెస్టులు జరిగాయి. 44 టెస్టుల్లో ఆస్ట్రేలియా... 32 టెస్టుల్లో భారత్ గెలుపొందాయి. ఒక టెస్టు 'టై'గా ముగియగా... 29 టెస్టులు 'డ్రా' అయ్యాయి.

కేఎస్ భరత్‌కు అవకాశం దక్కేనా!



ఆడిన ఆఖరి టెస్టులో (ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టు) తుది జట్టును చూస్తే ఒకటి, రెండు స్థానాలు మినహా ఇతర ఆటగాళ్లందరికీ చోటు ఖాయం. అయితే మారిన వేదికలో పరిస్థితులు, వాతావరణాన్ని బట్టి చూస్తే తుది జట్టు విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్‌లో సందిగ్ధత కొనసాగుతోంది. టాప్-4లో రోహిత్, గిల్, పుజారా, కోహ్లి ఉండగా, శ్రేయస్ అయ్యర్ లేకపోవడంతో ఐదో స్థానంలో రహానే ఆడతాడు. ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజాకు చోటు ఖాయం. అయితే ఓవల్ మైదానాన్ని బట్టి చూస్తే భారత్ నలుగురు పేసర్లతో ఆడుతుందా లేదా రెండో స్పిన్నర్‌కు అవకాశం దక్కుతుందా చూడాలి. మ్యాచ్‌కు ముందు రోజు రోహిత్ కూడా సీనియర్ బౌలర్ అశ్విన్ స్థానంపై హామీ ఇవ్వలేకపోయాడు. షమీ, సిరాజ్‌లతో పాటు ఉమేశ్ యాదవ్, జైదేవ్ ఉనాద్కట్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. రెండో స్పిన్నర్ అవసరం లేదనుకుంటే శార్దుల్ ఠాకూర్‌కు అవకాశం ఉంది. అయితే ప్రధానంగా వికెట్ కీపర్‌పైనే చర్చ కొనసాగుతోంది. కీపింగ్ నైపుణ్యాన్ని బట్టి చూస్తే ఆంధ్ర వికెట్ కీపర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్‌ను ఎంచుకోవాలి. అయితే దూకుడైన బ్యాటింగ్‌తో పాటు ఎడంచేతి వాటం కావడం ఇషాన్ కిషన్ అవకాశాలు పెంచుతోంది. అయితే ఇప్పటి వరకు ఒక్క టెస్టు కూడా ఆడని ఇషాన్‌ను కీలకపోరులో అరంగేట్రం చేయిస్తారా అనేది సందేహమే. ఐపీఎల్ కారణంగా భారత ఆటగాళ్లంతా టి20ల్లోనే ఆడినా, ఆటతో 'టచ్'లోనే ఉన్నారు. కీలక ఆటగాడు పుజారా ఇటీవలి కౌంటీ క్రికెట్ అనుభవం జట్టుకు ఉపయోగపడనుంది.

హాజల్‌వుడ్ స్థానంలో బోలండ్...

భారత్‌తో పోలిస్తే ఆస్ట్రేలియాకు తమ తుది జట్టు విషయంలో పూర్తి స్పష్టత ఉంది. వార్నర్ పునరాగమనంతో హ్యాండ్స్‌కోంబ్‌ను తప్పించగా, గాయపడిన హాజల్‌వుడ్ స్థానంలో మరో పేసర్ బోలండ్‌కు స్థానం దక్కింది. ముగ్గురు రెగ్యులర్ పేసర్లతో పాటు కామెరాన్ గ్రీన్ రూపంలో మరో మీడియం పేసర్ అందుబాటులో ఉన్నాడు. ఐపీఎల్ ఆడిన వార్నర్, గ్రీన్ మినహా మిగతావారంతా టెస్టు స్పెషలిస్టులుగా ఈ మ్యాచ్ కోసం ఆసీస్ గడ్డపై పూర్తి స్థాయిలో సిద్ధమయ్యారు. ఓవల్ పరిస్థితులు తమ దేశంలోలాగే ఉండటం ఆ జట్టుకు సానుకూలాంశం.

జొకోవిచ్ జోరు...

• ఫ్రెంచ్ ఓపెన్‌లో 12వసారి సెమీస్‌లోకి
• క్వార్టర్స్‌లో ఖచనోవ్‌పై విజయం



పారిస్: ఆరంభంలో తడబడినా... తన అనుభవాన్నంతా రంగరించి పోరాడిన సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ తన కెరీర్‌లో 12వసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ 4–6, 7–6 (7/0), 6–2, 6–4తో 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా)పై గెలిచాడు. 3 గంటల 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 57 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ నెట్ వద్ద 25 పాయింట్లు గెలిచాడు. టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) మధ్య క్వార్టర్ ఫైనల్ విజేతతో సెమీఫైనల్లో జొకోవిచ్ ఆడతాడు.

తొలిసారి సెమీస్‌లో సబలెంకా, ముకోవా

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్), అన్‌సీడెడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) తమ కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరారు. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో సబలెంకా 6–4, 6–4తో స్వితోలినా (ఉక్రెయిన్)పై, ముకోవా 7–5, 6–2తో పావ్లీచెంకోవా (రష్యా)పై గెలిచి గురువారం జరిగే సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు బెలారస్ మద్దతు ఇస్తున్న నేపథ్యంలో... మ్యాచ్ ముగిశాక సబలెంకాకు కరచాలనం ఇవ్వకుండానే స్వితోలినా కోర్టు నుంచి వెళ్లిపోయింది. సబలెంకా తొలి రౌండ్ ప్రత్యర్థి మార్టా కొస్టెక్ (ఉక్రెయిన్) కూడా ఇలాగే వ్యవహరించింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) క్వార్టర్ ఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ తొలి సెట్‌లో 5–1తో ఆధిక్యంలో ఉన్న దశలో ఆమె ప్రత్యర్థి సురెంకో (ఉక్రెయిన్) గాయం కారణంగా వైదొలిగింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో జ్వెరెవ్ (జర్మనీ) 6–1, 6–4, 6–3తో దిమిత్రోవ్ (బల్గేరియా)పై, ఎచెవరీ (అర్జెంటీనా) 7–6 (10/8), 6–0, 6–1తో నిషియోకా (జపాన్)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

సింధు, సైనా నిష్క్రమణ

• తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్స్
• ప్రణయ్, లక్ష్య సేన్ కూడా అవుట్
• ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్, ప్రియాన్షు



సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధు, మాజీ విజేత సైనా నెహ్వాల్... సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21–18, 19–21, 17–21తో ప్రపంచ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్) చేతిలో... 2010 చాంపియన్ సైనా 13–21, 15–21తో ప్రపంచ మాజీ విజేత రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. మరో మ్యాచ్‌లో ఆకర్షి కశ్యప్ 17–21, 9–21తో సుపనిద కతెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. కిడాంబి శ్రీకాంత్ 21–15, 21–19తో వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)పై, ప్రియాన్షు 21–12, 21–15తో సునెయామ (జపాన్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రణయ్ 15–21, 19–21తో నరోకా (జపాన్) చేతిలో, లక్ష్య సేన్ 21–18, 17–21, 13–21తో చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ధ్రువ్–అర్జున్ (భారత్) ద్వయం 21–16, 21–15తో లుకాస్ కోర్వీ-లాబర్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది.

సినిమా

ఇక షురూ


● మహేశ్‌బాబు

'గుంటూరు కారం' మళ్లీ షురూ అంటున్నారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఇందులో పూజా హెగ్డే, శ్రీ లీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 12న హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ షెడ్యూల్ దాదాపు నెల రోజులకు పైగా ఉంటుందట. ఈ షెడ్యూల్‌లో సినిమాలోని ప్రధాన తారాగాణం పాల్గొంటారని సమాచారం. 'గుంటూరు కారం' చిత్రం జనవరి 13న విడుదల కానుంది.

చలో మైసూర్

ఒక పాట, ఒక పవర్‌ఫుల్ ఫైట్ కోసం రామ్, శ్రీలీల, బోయపాటి అండ్ టీమ్ మైసూర్ వెళ్లారు. ఈ సందర్భంగా మైసూర్‌లో రామ్, శ్రీలీల సెల్ఫీలు దిగి, సందడి చేశారు. రామ్, శ్రీలీల జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన ఒక యాక్షన్ సీక్వెన్స్, ఒక పాటను మైసూర్‌లో చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. మంగళవారం ఆరంభమైన ఈ షెడ్యూల్ ఈ నెల 15 వరకు సాగుతుంది. ఈ షెడ్యూల్‌తో ఒక్క పాట మినహా సినిమా పూర్తవుతుంది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 20న రిలీజ్ కానుంది.


● శ్రీలీల, రామ్

భారతీయుడికి విలన్?


● ఎస్‌జె సూర్య

ఎస్.జె. సూర్యలో దర్శకుడు (తెలుగులో 'ఖుషి నాని, పులి'), హీరో (తమిళంలో పలు చిత్రాలు), విలన్ (తెలుగు 'స్పైడర్') ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండు మూడు చిత్రాల్లో విలన్‌గా నటిస్తున్నారు సూర్య. వాటిలో శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న 'గేమ్ చేంజర్' ఒకటి. మరొకటి 'ఇండియన్ 2' అని సమాచారం. అయితే 'ఇండియన్ 2' గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఇండియన్ 2'. 1996లో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు ఇది సీక్వెల్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, ప్రియా భవానీ శంకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకి సంబంధించిన ఓ షెడ్యూల్ చెన్నైలో ముగిసింది. కాగా నెక్ట్స్ షెడ్యూల్‌ను అమెరికాలో ప్లాన్ చేసింది చిత్రయూనిట్. దాదాపు పది రోజుల పాటు ఈ షెడ్యూల్ జరగనుంది.

పాటల పనిలో...


● వెంకీ కుడుముల, కాసర్ల శ్యామ్, జీవీ ప్రకాశ్

మాస్, రొమాంటిక్, మెలోడీ... ఇలా నితిన్ సినిమాకి సందర్భానికి తగ్గ ట్యూన్లు చేయించుకునే పని మీద బిజీగా ఉన్నారు వెంకీ కుడుముల. ట్యూన్ కట్టే పని మీద జీవీ ప్రకాశ్, పాట రాసే పని మీద కాసర్ల శ్యామ్ ఉన్నారు. ఇదంతా నితిన్, రష్మికా మందన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న చిత్రం కోసమే. చిత్ర సంగీతదర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ ఆధ్వర్యంలో చెన్నైలో మ్యూజిక్ సిట్టింగ్స్ ఆరంభమయ్యాయి. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు చేస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి.

కథే హీరో

– వీజే సన్నీ



''హీరోగా కాదు.. ఓ ఆర్టిస్టుగా కెరీర్‌లో ముందుకు వెళ్లాలనుకుంటున్నాను. కథ నచ్చితే విలన్ పాత్ర చేసేందుకు కూడా సిద్ధమే'' అన్నారు వీజే సన్నీ. సప్తగిరి, వీజే సన్నీ హీరోలుగా డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన సినిమా 'అన్‌స్టాపబుల్'. రజిత్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వీజే సన్నీ మాట్లాడుతూ– ''బిగ్‌బాస్' నుంచి బయటకు వచ్చిన తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. ముప్పైకి పైగా మాస్ కథలు విన్నాను. కానీ నాకు మాత్రం కామెడీ, థ్రిల్లర్, హారర్ బ్యాక్‌డ్రాప్‌లోని సినిమాలంటే ఇష్టం. డైమండ్ రత్నబాబుగారు చెప్పిన 'అన్‌స్టాపబుల్' కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నాను. దీంతో ఈ సినిమా చేయడానికి అంగీకరించాను. నేను కథనే హీరోగా నమ్ముతాను. ఈ సినిమా కథ బాగుంది. ఈ సినిమా ఆడియన్స్‌కు బోర్ కొట్టదని గ్యారంటీ ఇవ్వగలను. ఈ చిత్రంలో కోహినూర్ కల్యాణ్ పాత్రలో నేను, జిలానీ రామ్‌దాస్ పాత్రలో సప్తగిరిగారు పోటాపోటీగా నటించాం. డబ్బు కారణంగా అనుకోని పరిస్థితుల్లో చిక్కుకున్న కల్యాణ్, రామ్‌దాస్ ఎలా బయటపడ్డారు అన్నదే ఈ చిత్రకథ'' అన్నారు.

ఆదిపురుష్ మా అదృష్టం – ప్రభాస్

• తిరుపతిలో పెళ్లి.. • ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తా


● భూషణ్‌కుమార్, కృతీ సనన్, ప్రభాస్, ఓం రౌత్, దేవ దత్తా, సన్నీ సింగ్



'ఏడు నెలల క్రితం 'ఆదిపురుష్' ట్రైలర్‌ను నా ఫ్యాన్స్ కోసం త్రీడీలో చూపించమని, వారి రెస్పాన్స్ చూడమని ఓం రౌత్‌తో చెప్పాను. ఫ్యాన్స్ చూపిన ధైర్యం, ప్రోత్సాహమే మమ్మల్ని ముందుకు నడిపించింది. నిజానికి 'ఆదిపురుష్'ను సినిమా అనకూడదు. ఇది రామాయణం. ఈ సినిమా చేయడం మా అదృష్టం'' అని ప్రభాస్ అన్నారు. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆదిపురుష్'. రామాయణం ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో రాముడి పాత్రలో ప్రభాస్, జానకిగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, హనుమంతునిగా దేవ దత్తా, లంకేశ్వరుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. భూషణ్‌కుమార్, క్రిషణ్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్ వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతిలో జరిగిన 'ఆదిపురుష్' సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ఇంకా ప్రభాస్ మాట్లాడుతూ – ''ఓ సందర్భంలో 'రామాయణం' చేస్తున్నావా? అని చిరంజీవిగారు అడిగారు. అవును.. సార్ అన్నాను.. 'అది నిజంగా అదృష్టం. అందరికీ దొరకదు. నీకు దొరికింది' అన్నారు. 'ఆదిపురుష్' వేడుకకు వచ్చిన చినజీయర్ స్వామిగారికి, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిగారికి, తిరుపతి పోలీసులకు థ్యాంక్స్. స్టేజ్ మీద తక్కువగా మాట్లాడి, ఎక్కువగా సినిమాలు చేస్తాను. ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తాను'' అన్నారు. పెళ్లి గురించి అభిమానులు అడగ్గా. ''పెళ్లా.. ఎప్పుడైనా..తిరుపతిలోనే చేసుకుంటాలే...'' అని నవ్వుతూ సమాధానమిచ్చారు ప్రభాస్.

త్రిదండి చినజీయర్ స్వామీజీ మాట్లాడుతూ– ''రామాయణంలో ఉండే అరణ్య కాండ, యుద్ధకాండలో ఉన్న ప్రధానమైన కథను చరిత్రగా లోకానికి అందించాలనే ఆశతో ఈ సినిమా చేస్తున్నామని చెప్పారు. ఇంతకంటే ఈ లోకానికి మహోపకారం ఉండదు. రాముడి పాత్రలో సమాజానికి మళ్లీ ఓ కొత్త ఆధ్యాత్మిక చైతన్య తరంగాన్ని అందిస్తున్న ప్రభాస్‌గారికి, సీతగా చేసిన కృతీ సనన్, దర్శకుడు ఓం రౌత్ అండ్ టీమ్‌కు, ముఖ్యంగా 'జై శ్రీరామ్' మంత్రాన్ని పాడిన అజయ్, అతుల్‌కు బ్లెస్సింగ్స్. జై శ్రీరామ్'' అన్నారు.

మరో ముఖ్య అతిథి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ – ''రామాయణంలో కొన్ని ప్రధాన ఘట్టాలను తీసుకుని 'ఆదిపురుష్' సినిమా నిర్మించడం జరిగింది. మన భారతదేశ చిత్రపరిశ్రమకు ఇంకా గొప్ప పేరు తీసుకువచ్చే విధంగా ఈ సినిమాని చిత్రీకరించారు. హాలీవుడ్‌లో 'టైటానిక్', 'అవతార్' వంటి భారీ గ్రాఫిక్స్ సినిమాలు వచ్చాయి. ఆ స్థాయిలో గతంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి' మన తెలుగు పరిశ్రమకే కాకుండా భారత చిత్రపరిశ్రమకే ఎంతో కీర్తి తెచ్చింది. ఆ తర్వాత 'ఆదిపురుష్' కూడా భారీ గ్రాఫిక్స్‌తో అదే స్థాయిలో రూపొందింది. మన భారతదేశ చరిత్రకు రామాయణం, మహాభారతం.. ఈ రెండూ గొప్ప ఇతిహాసాలు. అటువంటి రామాయణంలోని కొన్ని ఘట్టాలను తీసుకుని ఆధునిక టెక్నాలజీతో ఈ 'ఆదిపురుష్'ని చేయడం అనేది గొప్ప కార్యక్రమం. ముఖ్యంగా యువతీ యువకులకు ఆదర్శంగా ఉండేలా, వారికి కళ్లకు కట్టేలా ఇలాంటి గొప్ప సినిమా నిర్మించినందుకు నటీనటులు, సాంకేతిక నిపుణులకు ప్రత్యేక అభినందనలు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రామాయణం ఆధారంగా రూపొందిన ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.


● విక్రమ్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ప్రభాస్, చినజీయర్‌స్వామి

ఓం రౌత్ మాట్లాడుతూ– ''తన తండ్రి కోసం భూషణ్‌కుమార్ ఇలాంటి భారీ చిత్రాన్ని నిర్మించారు. తనకు మాత్రమే కాదు.. నాక్కూడా ఇది చాలా ముఖ్యమైన సినిమా. ఇక డార్లింగ్ (ప్రభాస్) లేకపోతే ఈ సినిమా చేయడం నాకు సాధ్యం అయ్యేది కాదు. 'ఆదిపురుష్' చేశామంటే అది మన డార్లింగ్ వల్లే. 'ఆదిపురుష్' నా సినిమానో, మీ సినిమానో, డార్లింగ్ సినిమానో కాదు.. ఇది భారతీయ సినిమా. రామాయణం కథ ఎక్కడ జరుగుతుంటే అక్కడికి హనుమంతులు వస్తారని మా అమ్మగారు చెప్పారు. ప్రపంచంలో ఎక్కడైనా ఎప్పుడైనా ఏ థియేటర్లో అయినా 'ఆదిపురుష్' షో ప్రదర్శితమవుతుంటే అక్కడ ఓ సీటును ఖాళీగా ఉంచాలని నిర్మాతలను, డిస్ట్రిబ్యూటర్స్‌ను కోరుతున్నాను. ఎందుకంటే హనుమాన్ వచ్చి చూస్తారు (భావోద్వేగంతో..). ఆశీర్వదిస్తారు'' అన్నారు.

భూషణ్‌కుమార్ మాట్లాడుతూ – ''రాముడి సినిమా చేయాలనే మా నాన్న గుల్షన్‌కుమార్‌గారి కల ఓం రౌత్‌గారితో నెరవేరింది. రామాయణాన్ని నిర్మించినందుకు మా నాన్న గర్వపడతారు. ఈ సినిమాని ఓం చూపించిన విధానం అద్భుతం. ఇవాళ ఎమోషనల్ అవుతున్నాను. ఎందుకంటే ఇది సినిమా కాదు.. ఒక ఎమోషన్. మా నాన్నగారే నాకు రాముడు'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	5	62,793
నిఫ్టీ ▲	5	18,599

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,278	▲	8
డోజోన్స్	33,466	▲	297
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,628	▲	28
డాక్స్	15,922	▲	29
షాంఘై	3,195	▼	37
నికాయ్	32,506	▲	289

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	60,096	▲ 495
బంగారం (99.5 స్వచ్ఛత)	59,856	▲ 495
వెండి (కిలో)	71,904	▲ 442

హోండా ఎలివేట్ వచ్చేసింది

2030కల్లా మరో 5 ఎస్‌యూవీలు



న్యూఢిల్లీ: వాహన తయారీలో ఉన్న జపాన్ సంస్థ హోండా.. భారత మార్కెట్లో 2030 నాటికి అయిదు కొత్త ఎస్‌యూవీలను పరిచయం చేయనుంది. వీటిలో ఎలివేట్ ఎలక్ట్రిక్ మోడల్ సైతం ఉందని హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో టకుయా సుమురా తెలిపారు. మధ్యస్థాయి ఎస్‌యూవీ ఎలివేట్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఎలివేట్ సాయంతో కంపెనీ తన స్థానాన్ని మరింత బలపర్చుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం సిటీ, అమేజ్ సెడాన్లను భారత్‌లో విక్రయిస్తున్నాం. మొత్తం ప్యాసింజర్ వాహన విభాగంలో సెడాన్ల వాటా 10 శాతమే. ఈ విభాగంలోనే కంపెనీ పోటీపడుతోంది. అలాగే ఈ మోడళ్లు మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నాయి. ఎలివేట్‌ను తొలిసారిగా భారత్‌లో ప్రవేశపెట్టాం. రానున్న రోజుల్లో ఈ మోడల్ ప్రధాన ఉత్పాదనగా ఉంటుంది. కొత్తగా వచ్చే మోడళ్లు ప్రీమియం సెగ్మెంట్లో పోటీ పడతాయి. ఎలివేట్ ఎగుమతి కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దుతాం. ఇక 2022–23లో 1.2 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేశాం. 2024–25లో దీనిని 1.7 లక్షల యూనిట్లకు చేరుస్తాం' అని వివరించారు. 2040 నాటికి బ్యాటరీ ఎలక్ట్రిక్, ఫ్యూయల్ సెల్ వాహనాలను మాత్రమే విక్రయిస్తామని హోండా మోటార్ కో ఆసియా హెడ్ తోషియో కువహర తెలిపారు.

గిడ్డంగిని విక్రయించిన జీఎంఆర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ సంస్థ జీఎంఆర్ గ్రూప్ తాజాగా శంషాబాద్ విమానాశ్రయంలో ఉన్న 8,18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలోని గిడ్డంగిని విక్రయించింది. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్‌ఐఏఎల్) నుంచి సింగపూర్‌కు చెందిన ఐఎల్‌పీ కోర్ వెంచర్స్ ఐ పీటీఈ దీనిని చేజిక్కించుకుంది. డీల్ విలువ రూ.188 కోట్లు. ఈ మొత్తాన్ని విమానాశ్రయ అభివృద్ధికి వెచ్చించనున్నట్టు కంపెనీ మంగళవారం ప్రకటించింది.

బ్రాండెడ్ ఆభరణాల వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్

'నావెల్ జ్యువెల్స్'పై
రూ. 5,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: వ్యాపార దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్ తాజాగా బ్రాండెడ్ ఆభరణాల రిటైల్ వ్యాపారంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. 'నావెల్ జ్యువెల్స్' పేరిట నెలకొల్పిన కొత్త వెంచర్ ద్వారా దేశవ్యాప్తంగా భారీ స్థాయి జ్యుయలరీ రిటైల్ స్టోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. నూతన వృద్ధి చోదకాలను అందిపుచ్చుకునేందుకు, మరిన్ని కొత్త ఉత్పత్తులతో దేశీ మార్కెట్లో కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ వ్యూహాత్మక పోర్ట్‌ఫోలియో ఉపయోగపడగలదని ఆయన పేర్కొన్నారు. లైఫ్‌స్టయిల్ రిటైల్ విభాగంలో తమకున్న అనుభవం, వినియోగదారుల ప్రాధాన్యతలను అర్థం చేసుకునే నైపుణ్యాలు .. కొత్త వెంచర్‌కు ఉపయోగకరంగా ఉండగలవని చెప్పారు.

టాటా.. రిలయన్స్‌తో పోటీ..

నావెల్ జ్యువెల్స్ బ్రాండ్‌తో ఆదిత్య బిర్లా గ్రూప్.. టాటా తనిష్క్, రిలయన్స్ జ్యువెల్స్ వంటి బ్రాండ్స్‌తో పోటీపడనుంది. ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) రత్నాభరణాల మార్కెట్ వాటా దాదాపు 7 శాతంగా ఉంది. దేశీ ఆభరణాల మార్కెట్ 2025 నాటికి 90 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

బజాజ్ మ్యూచువల్ ఫండ్ వ్యాపారం ప్రారంభం

ఈ నెలాఖరుకు మూడు పథకాలు

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారంలోకి బజాజ్ ఫిన్‌సర్వ్ అడుగు పెట్టింది. వచ్చే కొన్నేళ్లలో పెద్ద సంస్థగా అవతరించాలనే లక్ష్యంతో ఉన్నట్టు ప్రకటించింది. ఈ నెలాఖరులోపు లిక్విడ్, మనీ మార్కెట్ తదితర మూడు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (స్థిరాదాయ/డెట్) పథకాలను ప్రారంభించనున్నట్టు తెలిపింది. ఆ తర్వాత కొన్ని రోజులకు నియంత్రణ సంస్థ అనుమతితో మరో 4 కొత్త పథకాలను తీసుకురానున్నట్టు గ్రూప్ ఛైర్మన్, ఎండీ సంజీవ్ బజాజ్ ప్రకటించారు. ఇప్పటికే మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో 42 సంస్థలు ఉన్నాయి. తమ గ్రూపు పరిధిలో ఎనిమిది సబ్సిడరీలు ఉన్నాయని, 7 కోట్ల మంది కస్టమర్లకు ఆర్థిక ఉత్పత్తులను అందిస్తున్నట్టు సంజీవ్ చెప్పారు.

యాపిల్ 'విజన్ ప్రో'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆగ్‌మెంటెడ్ రియాలిటీ హెడ్‌సెట్‌ను టెక్ దిగ్గజం యాపిల్ ఎట్టకేలకు ఆవిష్కరించింది. యూఎస్ కాలిఫోర్నియాలోని కూపర్టీనో నగరంలో ఉన్న ఆపిల్ పార్క్‌లో జరుగుతున్న వరల్డ్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్–2023 వేదికగా విజన్ ప్రో పేరుతో ఈ ఉత్పత్తిని పరిచయం చేసింది. ప్రారంభ ధర సుమారు రూ.2,88,742. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంటుంది. యాపిల్ సీఈవో దీనిని స్పేషియల్ కంప్యూటింగ్‌గా అభివర్ణించారు. త్రీ–డైమెన్షనల్ కెమెరా, మైక్రోఫోన్ సిస్టమ్‌తో రూపొందింది. 12 కెమెరాలు, ఆరు మైక్రోఫోన్స్‌తోపాటు విభిన్న సెన్సార్స్ ఏర్పాటు చేశారు. వీడియోలు, చిత్రాలను సులభంగా క్యాప్చర్ చేస్తుంది. వీటిని వినియోగదారులు 3డీలో వీక్షించవచ్చు అని కంపెనీ తెలిపింది.

ఆఖర్లో 'కొనుగోళ్ల' రికవరీ

- ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు
- 18,599 వద్ద స్థిరపడిన నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం అయిదు పాయింట్లు
- ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన సూచీలు చివరి అరగంట కొనుగోళ్లతో రికవరీ అయ్యి ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారని ట్రేడర్లు తెలిపారు. ఉదయం సెన్సెక్స్ 49 పాయింట్ల నష్టంతో 62,738 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 313 పాయింట్ల పరిధిలో 62,554 వద్ద కనిష్టాన్ని, 62,867 గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి అయిదు పాయింట్ల స్వల్ప లాభంతో 62,793 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18,601 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,532 – 18,623 పరిధిలో ట్రేడైంది. ఆఖరికి అయిదు పాయింట్లు పెరిగి 18,599 వద్ద స్థిరపడింది. ఐటీ, మెటల్, ఇంధన, ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వడ్డీరేట్ల ఆధారిత బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, పారిశ్రామిక, కమోడిటీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 0.50%, 0.30 శాతం చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.386 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.489 కోట్ల షేర్లు అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 82.60 స్థాయి వద్ద స్థిరపడింది. 'ఐటీ రంగ షేర్లలో అనూహ్యంగా అమ్మకాల ఒత్తిడి తలెత్తడంతో స్టాక్ మార్కెట్‌లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అయితే ఆటో, బ్యాంక్స్ షేర్ల ర్యాలీతో సూచీలు కనిష్ట స్థాయి నుంచి రికవరీ అయ్యాయి. ఇటీవల మార్కెట్ గరిష్ట స్థాయి వద్ద తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవుతుంది. గడిచిన 3 ట్రేడింగ్ సెషన్లో ఎఫ్ఐఐలు నికర అమ్మకందారులుగా నిలవడం కూడా సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచినట్లైంది. ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి వెల్లడయ్యే వరకు సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ పరిమిత శ్రేణిలోనే ట్రేడవ్వొచ్చు' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు.

లక్ష కోట్ల డాలర్లకు ఇంటర్నెట్ ఎకానమీ

- 2030 నాటికి ఆరింతలు పెరుగుతుందని అంచనా
- ఈ–కామర్స్ విభాగం దన్ను
- గూగుల్, టెమాసెక్, బెయిన్ సంయుక్త నివేదిక



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ విభాగం దన్నుతో దేశీ ఇంటర్నెట్ ఎకానమీ 2030 నాటికి ఆరింతలు పెరగనుంది. 1 లక్ష కోట్ల డాలర్లకు చేరనుంది. గూగుల్, టెమాసెక్, బెయిన్ అండ్ కంపెనీ విడుదల చేసిన సంయుక్త నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2022లో భారత ఇంటర్నెట్ ఎకానమీ 155–175 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. బీ2సీ ఈ–కామర్స్ విభాగం, బీ2బీ ఈ–కామర్స్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్ ప్రొవైడర్లు, ఓవర్ ది టాప్ సంస్థల (ఓటీటీ) వంటి ఆన్‌లైన్ మీడియా దేశీ ఇంటర్నెట్ ఎకానమీకి వృద్ధి కారకాలుగా ఉండగలవని గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ సంజయ్ గుప్తా తెలిపారు. భవిష్యత్తులో చాలా మటుకు కొనుగోళ్లు డిజిటల్‌గానే జరగనున్నాయని పేర్కొన్నారు. డిజిటల్ ఆవిష్కరణలకు అంకుర సంస్థలు బాటలు వేయగా, కోవిడ్ మహమ్మారి అనంతరం చిన్న–మధ్య–భారీ తరహా సంస్థలు మార్కెట్లో దీటుగా పోటీ పడేందుకు డిజిటల్ సాంకేతికతలను గణనీయంగా ఉపయోగించడం ఆరంభించాయన్నారు. ప్రపంచ జీడీపీ వృద్ధికి భారత్ కొత్త ఆశాదీపంగా మారిందని టెమాసెక్ ఎండీ (ఇన్వెస్ట్‌మెంట్స్) విశేష్ శ్రీవాస్తవ్ తెలిపారు. డిజిటల్ సాంకేతికతలను ఆర్థిక కార్యకలాపాల్లో విస్తృతంగా వినియోగించే ఆర్థిక వ్యవస్థను ఇంటర్నెట్ ఎకానమీగా పరిగణిస్తారు.

నివేదిక ప్రకారం..

- బీ2సీ ఈ–కామర్స్ 2022లో 60–65 బిలియన్ డాలర్లుగా ఉండగా 2030 నాటికి 5–6 రెట్లు పెరిగి 350–380 బిలియన్ డాలర్లకు చేరనుంది.
- బీ2బీ ఈ–కామర్స్ 8–9 బిలియన్ డాలర్ల నుంచి 13–14 రెట్లు పెరిగి 105–120 బిలియన్ డాలర్లకు ఎగియనుంది.
- సాఫ్ట్‌వేర్–యాజ్–ఎ–సర్వీస్ విభాగం 5–6 రెట్లు వృద్ధి చెంది 12–13 బిలియన్ డాలర్ల నుంచి 65–75 బిలియన్ డాలర్లకు చేరనుంది.

టాప్‌గేర్‌లో సోనాలిక ట్రాక్టర్ అమ్మకాలు



న్యూఢిల్లీ: సోనాలికా ట్రాక్టర్స్ కంపెనీ మే నెలలో 13,072 ట్రాక్టర్లను అమ్మినట్లు తెలిపింది. గతేడాది ఇదే మే నెలలో విక్రయించిన 12,615 యూనిట్లతో పోలిస్తే ఇవి 11.42% శాతం, పరిశ్రమ అంచనాల కంటే నాలుగు రెట్లు అధికమని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక నెలలో ఇవే అత్యధిక అమ్మకాలని కంపెనీ జాయింట్ ఎండీ రమణ్ మిట్టల్ తెలిపారు. తమ ట్రాక్టర్ల తయారీ అత్యాధునిక సాంకేతికత వినియోగిస్తున్నందున రైతుల నుంచి తమ బ్రాండ్‌కు విశేష ఆదరణ లభిస్తుందని రమణ్ అన్నారు.

మారుతీ సుజుకీ 4,500 సర్వీస్ కేంద్రాలు



పార్థో బెనర్జీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ సర్వీస్ నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా 4,500ల కేంద్రాల మార్కును చేరుకుంది. హైదరాబాద్‌లోని రాంపల్లి సర్వీస్ సెంటర్ ఈ ఘనతను సొంతం చేసుకుంది. 2022–23లో భారత్‌లో 310 సర్వీస్ టచ్ పాయింట్లను ఏర్పాటు చేశామని సంస్థ సర్వీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'పట్టణేతర ప్రాంతాల్లో అత్యధికంగా ఇవి ప్రారంభం అయ్యాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో సర్వీస్ కేంద్రాలను అందుబాటులోకి తేవడం సంస్థ చరిత్రలో తొలిసారి. 2023–24లో కొత్తగా 350 కేంద్రాలను నెలకొల్పుతాం. సర్వీసు కోసం నగరాల్లో 10–15 కిలోమీటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 25 కిలోమీటర్లకు మించి కస్టమర్ ప్రయాణించకూడదు అన్నది మా లక్ష్యం. సర్వీస్ టచ్ పాయింట్స్ 2,271 నగరాలు, పట్టణాల్లో విస్తరించాయి. 335 సర్వీస్ ఆన్ వీల్స్ వర్క్‌షాప్స్ ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 326 సర్వీస్ సెంటర్లు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా అత్యధికంగా 2.23 కోట్ల వాహనాలకు సర్వీసు అందించాం' అని వివరించారు.

జాబ్ పాయింట్

ఐబీలో 797 జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్(జేఐవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 797(యూఆర్–325, ఎస్సీ–119, ఎస్టీ–59, ఓబీసీ–215, ఈడబ్ల్యూఎస్–79).
» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ/విద్యా సంస్థ నుంచి డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ అప్లికేషన్స్)లేదా బ్యాచిలర్ డిగ్రీ (ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఫిజిక్స్/మేథమేటిక్స్ సబ్జెక్టులుగా ఉండాలి) లేదా బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 27ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు/ఓబీసీలకు మూడేళ్లు చొప్పున వయసు సడలింపు ఉంటుంది.
» **వేతనం:** రూ.25,500 నుంచి రూ.81,100
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(100 మార్కులు), స్కిల్ టెస్ట్(30 మార్కులు), ఇంటర్వ్యూ(20 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, చీరాల, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.06.2023.
» **వెబ్‌సైట్:** www.mha.gov.in

ఇండియన్ నేవీలో 100 అగ్నివీర్(ఎంఆర్) పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్(ఎంఆర్) ఖాళీల భర్తీకి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2023(నవంబర్ 23) బ్యాచ్ పేరున శిక్షణ ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100(పురుషులు–80, మహిళలు–20).
» **అర్హత:** పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థి 01.11.2002 నుంచి 31.04.2005 మధ్యలో జన్మించి ఉండాలి.
» అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
» **కనిష్ట ఎత్తు ప్రమాణాలు:** పురుషులు 157సెం.మీ. మహిళలు 152 సెం.మీ. ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష(సీబీఈ), రాతపరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష(పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **శిక్షణ:** అగ్నివీర్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబర్ నెలలో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
» **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000 వేతనం లభిస్తుంది.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీ భాషల్లో మొత్తం 50 బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఒక్కొక్కటి 1 మార్కు చొప్పున 50 మార్కులను కలిగి ఉంటుంది. సైన్స్, మ్యాథమేటిక్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో పదో తరగతి స్థాయిల్లో ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. నాలుగు తప్పు సమాధానాలకు ఒక మార్కు కోత విధిస్తారు.
» **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది:** 15.06.2023.
» **శిక్షణ ప్రారంభం:** 2023 నవంబర్ నెలలో
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఏపీఎస్ఎఫ్‌సీ, విజయవాడలో 14 పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** మేనేజర్(ఫైనాన్స్)–06, డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్)–03, అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్/లా)–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ లేదా బీఈ/ బీటెక్, ఎంబీబీఎస్, పీజీడీఎం, డిగ్రీ/పీజీ(లా ఇన్ బిజినెస్/కమర్షియల్ లాస్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 21 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు మేనేజర్ పోస్టులకు రూ.1,01,970 నుంచి రూ.1,74,790, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు రూ.76,730 నుంచి రూ.1,62,780, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు రూ.54,060 నుంచి రూ.1,40,540 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 15.06.2023.
» **వెబ్‌సైట్:** www.esfc.ap.gov.in

బీటెక్‌తో.. ఇస్రో సైంటిస్ట్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో.. ఇంజనీరింగ్ ఉత్తీర్ణులకు స్వాగతం పలుకుతోంది. సైంటిస్ట్/ఇంజనీర్ హోదాల్లో.. కొలువుదీరే అవకాశం కల్పిస్తోంది!! గ్రూప్–ఎ గెజిటెడ్, నాన్–గెజిటెడ్ కొలువులతో కెరీర్ ప్రారంభించే అవకాశం అందిస్తోంది! ఇందుకోసం ఇస్రో చేపట్టే నియామక ప్రక్రియలో విజయం సాధించాల్సి ఉంటుంది. ఇటీవల ఇస్రో.. 303 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీకి ప్రకటన ఇచ్చింది. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఇస్రో భర్తీ చేసే సైంటిస్ట్ పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» సైంటిస్ట్/ఇంజనీర్ ఉద్యోగాలకు ఇస్రో ప్రకటన
» బీటెక్ మెకానికల్, సీఎస్ఈ, ఈసీఈ అర్హతతో అవకాశం
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» నెలకు రూ.56,100 కనీస మూల వేతనం

ఇంజనీరింగ్ ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాల దిశగా అడుగులు వేస్తుంటారు. గేట్ స్కోర్ ఆధారంగా నియామకాలు చేపట్టే పీఎస్‌యూలకు దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. ఇలాంటి అభ్యర్థులకు ఇస్రో సైంటిస్ట్ జాబ్స్ చక్కటి అవకాశంగా చెప్పొచ్చు.

ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డ్

ఇస్రోతోపాటు, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో సైంటిస్ట్, ఇంజనీర్ ఉద్యోగాల భర్తీ కోసం సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పేరిట ప్రత్యేక నియామక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిస్తే.. సైంటిస్ట్, ఇంజనీర్స్‌గా ఖరారు చేస్తారు. గత ఏడాది వరకు ఈ పోస్ట్‌లకు గేట్ స్కోర్ ఆధారంగానే నియామక ప్రక్రియ జరిగేది. ఈ ఏడాది తొలిసారి సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఇస్రో సొంత నియామక ప్రక్రియ చేపడుతోంది.

అయిదు విభాగాలు.. 303 పోస్ట్‌లు

- తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం అయిదు విభాగాల్లో 303 సైంటిస్ట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఆ వివరాలు..
- సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(ఎలక్ట్రానిక్స్)–90 పోస్ట్‌లు: **అర్హత:** ఈసీఈ బ్రాంచ్‌లో కనీసం 65 శాతం మార్కులు లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(మెకానికల్)–163 పోస్ట్‌లు: **అర్హత:** మెకానికల్ బ్రాంచ్‌లో కనీసం 65 శాతం మార్కులు లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(కంప్యూటర్ సైన్స్)–47 పోస్ట్‌లు: **అర్హత:** సీఎస్ఈ బ్రాంచ్‌లో 65 శాతం మార్కులు లేదా 6.84 జీపీఏతో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- పీఆర్‌ఎల్‌లో సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(ఎలక్ట్రానిక్స్)–2 పోస్ట్‌లు: **అర్హత:** ఈసీఈ బ్రాంచ్‌లో 65 శాతం మార్కులతో లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- పీఆర్‌ఎల్‌లో సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(కంప్యూటర్ సైన్స్)–1 పోస్ట్: **అర్హత:** సీఎస్ఈ బ్రాంచ్‌లో 65 శాతం మార్కులతో లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారు ఆగస్ట్ 31, 2023 నాటికి సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.
- **వయసు:** జూన్ 14, 2023 నాటికి 28 ఏళ్ల లోపు ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

- సైంటిస్ట్/ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో రాత పరీక్ష ఉంటుంది. మలి దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ రెండింటికీ నిర్దేశిత కటాఫ్‌లు, వెయిటేజీని నిర్దేశించి.. దానికి అనుగుణంగా తుది విజేతల జాబితా రూపొందిస్తారు.

100 మార్కులకు రాత పరీక్ష

- తొలి దశలో రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్–ఎలో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 80 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.
- పార్ట్–బిలో న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, డయాగ్రమెటిక్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్, డిడక్టివ్ రీజనింగ్ విభాగాల నుంచి 15 ప్రశ్నలు–20 మార్కులకు ఉంటాయి.
- పార్ట్–ఎ, పార్ట్–బి కలిపి మొత్తం వంద మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పార్ట్–ఎలో 1/3వంతు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

మలి దశ పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, ఆయా విభాగాల్లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుని.. ఒక్కో పోస్ట్‌కు అయిదుగురిని(1:5 నిష్పత్తి) చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయిస్తారు.



వెయిటేజీ విధానం

- రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా ఫైనల్ సెలక్షన్ ఉంటుంది. రాత పరీక్షలో ప్రతిభకు 50 శాతం; ఇంటర్వ్యూ మార్కులకు 50 శాతం వెయిటేజీని గణించి.. దాని ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.
- ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు రాత పరీక్షలో రెండు విభాగాల్లో కలిపి 50 శాతం మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూలో 50 శాతం మార్కులు.. మొత్తంగా 60 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలలో 40 శాతం చొప్పున.. రెండూ కలిపి సగటున 50 శాతం మార్కులు స్కోర్ చేయాల్సి ఉంటుంది.

ప్రారంభ వేతనం రూ.56,100

ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిచి కొలువులో చేరిన వారికి పే లెవల్–10తో సైంటిస్ట్/ఇంజనీర్‌గా నియామకం ఖరారు చేస్తారు. ప్రారంభ వేతనం నెలకు రూ.56,100గా ఉంటుంది. వీటికి అదనంగా డీఏ, హెచ్‌ఆర్‌ఏ, టీఏ వంటి ఇతర అలవెన్స్‌లు సైతం అందిస్తారు. నియామకం ఖరారు చేసుకున్న వారు ఇస్రో, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్ హోదాకు

ఇస్రోలో సైంటిస్ట్/ఇంజనీర్‌గా కొలువుదీరిన అభ్యర్థులు భవిష్యత్తులో విశిష్ట శాస్త్రవేత్త స్థాయికి(డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్) చేరుకునే అవకాశం ఉంది. సర్వీస్‌లో చేరిన నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌డిగా.. ఆ తర్వాత నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్ఈగా.. అనంతరం మరో నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్ఎఫ్‌గా పదోన్నతులు లభిస్తాయి. ఆ తర్వాత మరో అయిదేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌జీ, మరో అయిదేళ్లకు.. సైంటిస్ట్ జి హోదా లభిస్తుంది. సైంటిస్ట్ జి హోదాలో ఆరేళ్లు పూర్తి చేసుకుంటే.. ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్ హోదా, మరో రెండేళ్లు సర్వీస్ పూర్తి చేసుకుంటే.. డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్‌గా పదోన్నతి లభిస్తుంది.

విజయం సాధించాలంటే

- పార్ట్–ఎ: ఈ విభాగంలో పూర్తిగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్ నుంచే ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి బీటెక్ స్థాయిలో సంబంధిత సబ్జెక్ట్ పుస్తకాలను ఎక్కువగా చదవాలి. ఆయా అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో చదవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, గేట్ తదితర పరీక్షల ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం కూడా లాభిస్తుంది.
- పార్ట్–బి: ఈ విభాగంలో 15 ప్రశ్నలు అడుగుతారు. కానీ ఇందులోనూ కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. దీంతో..అభ్యర్థులు డయాగ్రమెటిక్ రీజనింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. దీనికి సంబంధించి వెన్ డయాగ్రమ్స్, లాజికల్ ఇమేజ్ సీక్వెన్సెస్‌ను ప్రాక్టీస్ చేయాలి. అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్‌కు సంబంధించి ప్యాట్రన్స్, కాలమ్స్, రోస్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి. న్యూమరికల్, వెర్బల్ రీజనింగ్‌లకు సంబంధించి.. బేసిక్ అర్థమెటిక్, నంబర్ సిరీస్, అనాలజీ, సిలాజిమ్, కోడింగ్, డీ–కోడింగ్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: జూన్ 14, 2023
- రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశం
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.isro.gov.in/ICRB_Recruitment7.html
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://apps.ursc.gov.in/CentralBE-2023/advt.jsp

క్లుప్తంగా...

14న ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష



ఏయూక్యాంపస్: రాష్ట్రంలో బీఈడీ, స్పెషల్ బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఏపీ ఎడ్‌సెట్-2023 ప్రవేశ పరీక్షను ఈ నెల 14వ తేదీ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 36 నగరాల్లోని 77 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై తీర్పు 9న

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 9న ఉత్తర్వులు వెల్లడిస్తామని ప్రత్యేక సీబీఐ కోర్టు మంగళవారం పేర్కొంది. అనారోగ్యంతో బాధపడుతున్నానని, దాదాపు నెలన్నరగా చంచల్‌గూడలో జైలులో ఉంటున్నానని, ఇప్పటికే కస్టడీ విచారణ కూడా ముగిసిందని.. వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ ఇవ్వాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 24 నుంచి చంచల్‌గూడ జైల్లో ఉంటున్న భాస్కర్‌రెడ్డి గతవారం అస్వస్థతకు గురికావడంతో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం మళ్లీ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో బెయిల్ కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు.

విద్యా దీవెన, వసతి దీవెన చెత్త కార్యక్రమాలు

- టీడీపీ నేత నారా లోకేశ్

కడప రూరల్: వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా దీవెన, వసతి దీవెన చెత్త కార్యక్రమాలని టీడీపీ నేత నారా లోకేశ్ విమర్శించారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం కడపలో రెడ్డి సామాజిక వర్గం ప్రతినిధులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పాలనలో రెడ్డి సామాజికవర్గానికి కనీస గౌరవం దక్కడం లేదని.. తాము అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. రెడ్డి సామాజికవర్గంలోని పేదలను ఆదుకోవడంతో పాటు రెడ్డి భవనం ఏర్పాటు చేస్తామన్నారు. ఒకే చోట నుంచి పరిపాలన సాగిస్తామని.. అభివృద్ధిని వికేంద్రీకరిస్తామన్నారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తథ్యం

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

సాక్షి, హైదరాబాద్: తెలుగువారి ప్రతిభ ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికయిన ఆయనను టీటీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో సన్మానించారు. బాబు మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి ఏదో ఒకరోజు తప్పకుండా పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో టీడీపీ అధికారంలో లేకపోయినా పార్టీ శ్రేణుల ఉత్సాహం బాగుందని ప్రశంసించారు. దేశంలో తెలంగాణ అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తోందంటే.. టీడీపీ వేసిన పునాదే అందుకు కారణమని స్పష్టం చేశారు. తెలుగు వాళ్లు ప్రపంచం నలుమూలలా ఉన్నారంటే.. అది తెలుగుదేశం పార్టీ ఘనతేనన్నారు. టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బలిజలకు ద్రోహం చేశారు

- కాపు బలిజలపై లోకేశ్‌కు అవగాహన లేదు
- గ్రేటర్ రాయలసీమ బలిజసంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి

కడప రూరల్: తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు బలిజ వర్గానికి తీవ్ర అన్యాయం చేశారని గ్రేటర్ రాయలసీమ బలిజసంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి మురళీకృష్ణ చెప్పారు. చంద్రబాబు తనయుడు లోకేశ్‌కు కాపు బలిజలపై ఏ మాత్రం అవగాహన లేదని విమర్శించారు. కడపలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేశ్ తమకు అండగా ఉన్న బలిజలకు ఏమాత్రం న్యాయం చేయలేదని చెప్పారు. రాజకీయంగా ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదన్నారు. గొప్పలు చెప్పుకొనే తండ్రీతనయులు రాయలసీమ బలిజలను విస్మరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

అవినాశ్ ముందస్తు బెయిల్ రద్దు చేయండి


సుప్రీంకోర్టులో నర్రెడ్డి సునీత పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ : ఎంపీ అవినాశ్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని నర్రెడ్డి సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అవినాశ్‌రెడ్డికి మే 31న ముందస్తు బెయిలు మంజూరు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ మంగళవారం సునీత స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసర విచారణ కోరుతూ బుధవారం సునీత తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో ప్రస్తావించే అవకాశం ఉంది.

ఏడాదిలోనే జీతాల వ్యయం.. రూ.8,068 కోట్లు పెరుగుదల

2022-23 కాగ్ ప్రాథమిక గణాంకాల్లో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలోని పలు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వోద్యోగుల వేతనాల వ్యయం భారీగా పెరిగింది. అదే సమయంలో పెన్షన్ల వ్యయం కూడా భారీగానే అయింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 2022-23 ఆర్థిక ఏడాదికి సంబంధించిన ప్రాథమిక గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఏడాది వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలు, పెన్షన్ల వ్యయం భారీగా పెరిగింది. మరోపక్క.. తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల కన్నా ఏపీలోనే ఉద్యోగుల వేతనాల వ్యయం అధికంగా ఉందని కాగ్ తెలిపింది. నివేదిక ముఖ్యాంశాలు ఏమిటంటే..



- ▲ 2021-22తో పోలిస్తే రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగుల వేతనాల వ్యయం 2022-23లో రూ.8,068.39 కోట్లు పెరిగింది.
- ▲ ప్రభుత్వోద్యోగుల పెన్షన్ల వ్యయం 2021-22తో పోలిస్తే 2022-23లో రూ.2,257.29 కోట్లు పెరిగింది.
- ▲ 2021-22 ఆర్థిక ఏడాదిలో ప్రభుత్వోద్యోగుల వేతనాల వ్యయం ఏపీలో రూ.40,895.83 కోట్లు ఉండగా 2022-23లో అది ఏకంగా రూ.48,964.22 కోట్లకు పెరిగింది.
- ▲ అలాగే, 2021-22లో ప్రభుత్వోద్యోగుల పెన్షన్ల వ్యయం రూ.20,326.67 కోట్లు కాగా, 2022-23లో అది రూ.22,583.96 కోట్లకు పెరిగింది.

..ఇలా రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలు, పెన్షన్ల వ్యయం ఏటేటా పెరుగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 11వ పీఆర్సీని అమలుచేయడంతో పాటు ఉద్యోగులకు డీఏలు ఇవ్వడంతో వేతనాల వ్యయం భారీగా పెరుగుతోంది. మరోవైపు.. వైద్య ఆరోగ్య శాఖలో ఏ ఒక్క పోస్టు ఖాళీలేకుండా రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తోంది.

సమాలోచనలతో అభివృద్ధి సాధిద్దాం

- గిరిజనులకు రాష్ట్రపతి ఇద్రౌపది ముర్ము పిలుపు
- ఈనెల 12న గిరిజనులతో సమావేశమవ్వనున్న రాష్ట్రపతి
- దేశంలో 75 పీవీటీజీలకు చెందిన 1,500 మందికి ఆహ్వానం
- ఏపీ నుంచి 180 మంది ఎంపిక



సాక్షి, అమరావతి: అత్యంత బలహీన గిరిజన తెగలు(పీవీటీజీ) సమున్నతాభివృద్ధి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై.. ఆ తెగల ప్రతినిధులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమాలోచనలు జరపాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 12న పీవీటీజీలకు చెందిన ప్రతినిధులతో రాష్ట్రపతి ఢిల్లీలో సమావేశమవుతారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రపతి తెలుసుకుంటారు. వారి అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ చేపట్టేలా చర్యలు తీసుకుంటారు. దేశంలో మొత్తం 75 అత్యంత బలహీన గిరిజన తెగలకు చెందిన 1,500 మంది ప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. దీని కోసం ఏపీలోని ఆరు ఐటీడీఏల పరిధిలోని తొమ్మిది పీవీటీజీల నుంచి 180 మందిని ఎంపిక చేశారు. బోడో గదబ, బొండో పోర్జా, డొంగ్రీయ కోండ్, గుటోబ్ గదబ, కోండ్ పోర్జా, కొండ సవర, కొండరెడ్డి, కుటియా కోండ్, పరంగి పోర్జా తెగల నుంచి 20 మంది చొప్పున గిరిజన ప్రతినిధులను ఎంపిక చేశారు. దేశంలో ఒడిశా తర్వాత ఏపీ నుంచే అత్యధిక మంది ఈ సమావేశానికి హాజరు కాబోతున్నారు. వీరంతా ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి విశాఖ రైల్వేస్టేషన్ నుంచి హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి ఢిల్లీ వెళ్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆ ఎక్స్‌ప్రెస్‌లో మూడు బోగీలను రిజర్వ్ చేశారు. రాష్ట్రపతితో సమావేశం అనంతరం 15వ తేదీ రాత్రి తిరిగి ఢిల్లీ నుంచి బయలుదేరి వస్తారు. గిరిజన ప్రతినిధులను సమన్వయం చేసుకునేందుకు, తగిన ఏర్పాట్లు చేసేందుకు రాష్ట్ర లైజనింగ్ ఆఫీసర్‌గా ట్రైకార్ జనరల్ మేనేజర్ సీహెచ్ మణికుమార్‌ను నియమించారు. ఆయన నేతృత్వంలో ఐటీడీఏ అధికారులు ఎన్.సీతారామయ్య(పాడేరు), వి.సత్యవరప్రసాద్(పాడేరు), జి.తిరుపతిరావు(పార్వతీపురం), కె.సుదీష్(రంపచోడవరం) కూడా ఢిల్లీకి వెళ్తారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రైతులకు రెట్టింపు ఆదాయమే లక్ష్యం

- తొలి విడతలో 10 రకాల ఉత్పత్తులకు గ్యాప్ సర్టిఫికేషన్
- ప్రస్తుత ఖరీఫ్ నుంచే అమలు
- రాష్ట్రస్థాయి సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

సాక్షి, అమరావతి: ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించే రైతులకు మంచి వ్యవసాయ అభ్యాసం (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్-గ్యాప్) సర్టిఫికేషన్ జారీ చేయడం ద్వారా రెట్టింపు ఆదాయం కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. వ్యవసాయ, ఉద్యాన, ఆహార శుద్ధి ఉత్పత్తులకు మెరుగైన ఎగుమతి అవకాశాలు అనే అంశంపై విజయవాడలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. సీజన్‌లో ధర లభించని ఉత్పత్తులను ఎగుమతి చేయడం ద్వారా రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఎగుమతిదారులు, వ్యాపారులు, రైతులు, రైతు ఉత్పత్తిదారులను అనుసంధానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పోర్ట్ పార్క్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతులు పాటిస్తూ పురుగు మందుల అవశేషాల్లేని పంటలను ఉత్పత్తి చేస్తేనే అంతర్జాతీయ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడంతోపాటు పెద్దఎత్తున ఎగుమతి చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తొలి విడతగా 10 రకాల ఉత్పత్తులకు గ్యాప్ సర్టిఫికేషన్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ సర్టిఫికేషన్ ఉంటే కనీసం 100 దేశాలకు నేరుగా ఎగుమతి చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.

రైతుకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా..

వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ.. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా రైతులకు ఎగుమతిదారులకు మధ్య ప్రభుత్వం వారధిగా పనిచేస్తుందన్నారు. ఇందుకోసం పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లు పంటల వారీగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్'గా కాపీ కొడుతూ అడ్డంగా దొరికిపోయారు

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో వాట్సాప్ ద్వారా మాస్ కాపీయింగ్
- స్నేహితుల కోసం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన మెరిట్ విద్యార్థి
- ఐదుగురు మైనర్ల నుంచి స్మార్ట్ ఫోన్లు స్వాధీనం
- నాలుగు పోలీస్ స్టేషన్లలో కేసులు

సాక్షి, హైదరాబాద్: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ పరీక్షలో కొందరు విద్యార్థులు స్మార్ట్ కాపీయింగ్‌కు పాల్పడుతూ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కడపకు చెందిన ఉపాధ్యాయుడి కుమారుడైన ఓ విద్యార్థికి టెన్త్‌లో 600కు 600 మార్కులు, ఇంటర్మీడియెట్‌లో 1,000కి 940 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లోనూ 94 శాతం మార్కులు సాధించాడు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సమీపంలో గల కార్పొరేట్ కాలేజీలో చదువుతున్న ఇతడికి ఒక సోదరుడితోపాటు ముగ్గురు స్నేహితులు ఉన్నారు. ఈ ఐదుగురూ ఆదివారం జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాశారు. కడప విద్యార్థికి సికింద్రాబాద్ ప్యాట్నీ సమీపంలో ఉన్న ఎస్‌వీఐటీ కాలేజీలో పరీక్షా కేంద్రం రాగా, అతని సోదరుడికి మౌలాలిలో, ఇద్దరు స్నేహితులకు (వీరిద్దరూ సోదరులు) మల్లాపూర్‌లో, మరొకరికి ఎల్బీ నగర్‌లోని కళాశాలల్లో సెంటర్లు వచ్చాయి. తన సోదరుడితో పాటు స్నేహితులకు కూడా మంచి మార్కులు రప్పించాలని భావించిన కడప విద్యార్థి ఐదుగురితో ఓ వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. కళాశాలల్లో తనిఖీ చేసే సిబ్బంది కళ్లుగప్పిన ఈ ఐదుగురూ పరీక్ష కేంద్రాల్లోకి తమ స్మార్ట్‌ఫోన్లు తీసుకువెళ్లారు.

కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలు తీసి..

ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షను అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్‌లో ఒక ప్రశ్న తర్వాత మరో ప్రశ్న ప్రత్యక్షమవుతూ ఉంటే.. విద్యార్థులు జవాబులు టిక్ చేస్తూ పోతుంటారు. కడప విద్యార్థి కంప్యూటర్ స్క్రీన్‌పై తాను టిక్ చేసిన ప్రతి జవాబును ప్రశ్నతో సహా కనిపించేలా స్మార్ట్‌ఫోన్‌లో ఫొటోలు తీసి, వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడం ద్వారా మిగిలిన నలుగురికీ చేరేలా చేశాడు. ఎస్‌వీఐటీ కాలేజీలో పరీక్ష హాలు పెద్దదిగా ఉండటం, ఇన్విజిలేటర్ విధుల్లో ఉన్న సిబ్బంది ఒకేచోట కూర్చుండిపోవడంతో దాదాపు గంటన్నర పాటు ఈ తతంగాన్ని ఎవరూ గుర్తించలేదు. 10.30 గంటల సమయంలో మల్లాపూర్ కేంద్రంలో ఇన్విజిలేటర్ అక్కడి విద్యార్థి వద్ద స్మార్ట్‌ఫోన్ ఉండటాన్ని గమనించారు. అందులో ఉన్న వాట్సాప్ గ్రూపులో కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలను చూసిన ఆయన సదరు విద్యార్థిని ప్రశ్నించగా విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్‌వీఐటీ కాలేజీ పరీక్ష కేంద్రంలోని కడప విద్యార్థి నుంచి ఈ ఫొటోలు వస్తున్నట్టు తెలుసుకుని ఆ సెంటర్ అధికారికి సమాచారం ఇచ్చారు. ఆయన పరీక్ష కేంద్రంలోకి వెళ్లి కడప విద్యార్థిని తనిఖీ చేయగా.. అతడి వద్ద స్మార్ట్‌ఫోన్ లభించింది. ఇదే క్రమంలో మౌలాలి, ఎల్బీ నగర్‌లోని పరీక్ష కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న మరో ముగ్గురినీ పట్టుకున్నారు. ఈ ఘటనలపై ఆదివారం రాత్రి మార్కెట్, మల్కాజిగిరి, ఎల్బీ నగర్, నాచారం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.

నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం?

పట్టుబడిన విద్యార్థులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఐదుగురి ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నారు. ఈ పరీక్ష నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ నిర్లక్ష్యం కారణంగానే సరైన తనిఖీలు లేక స్మార్ట్ ఫోన్లు పరీక్ష కేంద్రంలోకి వెళ్లాయని అధికారులు చెబుతున్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న తనిఖీ సిబ్బంది, ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లకూ నోటీసులు ఇచ్చి విచారించడంతో పాటు వాంగ్మూలం నమోదు చేయాలని భావిస్తున్నారు.

పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలు

- రాష్ట్రవ్యాప్తంగా పోస్టుల ఖాళీలను బ్లాక్ చేయట్లేదు
- వివిధ మాధ్యమాలు, పత్రికల్లో వచ్చే దుష్ప్రచారాన్ని నమ్మొద్దు
- ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక రెగ్యులర్ టీచర్ ఉండేలా చర్యలు
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి : ఉపాధ్యాయ బదిలీలను షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీల్లో ఖాళీల నోటిఫికేషన్‌పై సామాజిక, డిజిటల్ మాధ్యమాలు, పత్రికలు, వాట్సాప్ గ్రూపుల్లో భయాందోళనలు, సందేహాలు రేకెత్తించేలా ప్రచారం జరుగుతోందన్నారు. ఎక్కువ ఖాళీలు ఉన్న చోటు తప్ప ఎక్కడా కూడా ఎక్కువ పోస్టులను బ్లాక్ చేయట్లేదన్నారు. బదిలీ చేయాల్సిన మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య (తప్పనిసరి/అభ్యర్థన) ఆధారంగా జిల్లాలో మంజూరైన పోస్టులు, పనిచేసే పోస్టులు, ఖాళీ స్థానాలను ప్రదర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో తగినంత మంది ఉపాధ్యాయులు ఉండేలా చేసేందుకు కొన్నిచోట్ల ఖాళీలను చూపించట్లేదన్నారు. హైస్కూల్, హైస్కూల్ ప్లస్‌లో ప్రతి సబ్జెక్టుకు ఒక రెగ్యులర్ స్కూల్ అసిస్టెంట్ ఉండాలని ప్రాథమిక లక్ష్యంగా బదిలీలు చేస్తున్నట్లు సురేష్‌కుమార్ వివరించారు.

20 మంది విద్యార్థులకు ఒక రెగ్యులర్ టీచర్

ఇక బదిలీల కోసం 82,587 మంది ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్-2)/ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. అనంతరం అభ్యంతరాల ప్రక్రియను పూర్తిచేసి ఈనెల 3న తుది సీనియారిటీ జాబితాను ప్రదర్శించామన్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లు ఇచ్చినట్లు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. కేవలం తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలను బ్లాక్ చేసేలా ఐదారు జిల్లాల్లో మాత్రమే పరిమితం చేశామన్నారు. అలాగే, పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నందున అన్ని జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్ట్ కోసం ఖాళీలను బ్లాక్ చేస్తున్నట్లు తెలిపారు. ఐదు జిల్లాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) పోస్టులకు ఎలాంటి ఖాళీలు బ్లాక్ చేయలేదని.. మిగిలిన జిల్లాల్లో ప్రతి 20 మంది విద్యార్థుల కోసం కనీసం ఒక రెగ్యులర్ టీచర్‌ని నియమించాలని నిబంధన పెట్టినట్లు సురేష్‌కుమార్ స్పష్టంచేశారు. అనంతపురంలో ఖాళీలు ఎక్కువగా ఉన్నందున స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, హిందీ, తెలుగు పోస్టుల కొన్నింటిని మాత్రమే తప్పనిసరిగా బ్లాక్ చేయాల్సి వచ్చిందన్నారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నందున ఇక్కడ పదోన్నతులు చేపట్టలేదన్నారు. స్కూల్ అసిస్టెంట్ (పీఈ-ఫిజికల్ ఎడ్యుకేషన్) ప్రమోషన్ కోసం అర్హులైన అభ్యర్థులు లేరని చెప్పారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చేసిన అభ్యర్థన మేరకు ఈ ఏడాది వేసవి సెలవుల్లోనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

నిధులు మళ్లించాం.. కానీ ఎక్కడికో తెలియదు

▶ మొదటి పేజీ తరువాయి

వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆమెను పరీక్షించిన డాక్టర్ కొన్ని మాత్రలు సూచించి విచారణ కొనసాగించవచ్చని చెప్పారు. సీఐడీ అధికారులు మళ్లీ విచారణ చేపట్టిన కొద్దిసేపటికే మరోసారి తనకు ఆరోగ్యం సహకరించడం లేదని శైలజా కిరణ్ పేర్కొన్నారు. విచారణను అర్థాంతరంగా ముగించేందుకు ప్రయత్నించగా సీఐడీ అధికారులు పూర్తి సహనం వహిస్తూ విచారణను కొనసాగించారు.



శైలజను విచారించి వస్తున్న సీఐడీ అధికారులు

మళ్లించాం... ఎక్కడికో తెలియదు!

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల నుంచి వసూలు చేసిన నిధులను ఎక్కడికి మళ్లించారనే విషయాన్ని తెలుసుకోవడంపై సీఐడీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. బ్రాంచీల కార్యాలయాల్లోని రికార్డుల ప్రకారం రూ.వేల కోట్లు చందాదారుల నుంచి వసూలు చేసినట్లు తేలింది. బ్యాంకు ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన రూ.793.50 కోట్లను అటాచ్ చేసేందుకు సీఐడీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చందాదారుల నుంచి భారీగా వసూలు చేసిన మిగతా నిధులను ఎక్కడికి మళ్లించారన్నది అంతుచిక్కని వ్యవహారంగా మారింది. రికార్డుల్లో సరైన వివరాలు లేకుండా ఆడిటర్ల ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. సీఐడీ అధికారులు అదే విషయంపై శైలజా కిరణ్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది. ఏపీలోని 37 బ్రాంచి కార్యాలయాల ద్వారా వసూలు చేసిన చందా నిధులను ఇతర సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టామని పేర్కొనట్లు సమాచారం. నిర్దిష్టంగా ఎక్కడెక్కడ పెట్టుబడులుగా పెట్టారన్నది మాత్రం ఆమె వెల్లడించలేదు. దీనిపై సీఐడీ అధికారులు ఎంత ప్రశ్నించినా తనకేమీ తెలియదని శైలజా కిరణ్ చెప్పడం గమనార్హం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులకు చిట్టీల మొత్తాన్ని ఎందుకు చెల్లించలేకపోతోందని సీఐడీ అధికారులు శైలజా కిరణ్‌ను ప్రశ్నించగా సూటిగా సమాధానం ఇవ్వలేదు. చందాదారుల సొమ్ము భద్రంగా ఉందంటూ తప్పించుకునే యత్నం చేశారు. అదే నిజమైతే చిట్టీల మొత్తం ఎందుకు చెల్లించలేకపోతున్నారని సీఐడీ అధికారులు ప్రశ్నించగా ఆమె స్పందించలేదు.

మరోసారి విచారణ

విచారణకు శైలజా కిరణ్ సహకరించకపోవడంతో ఆమెకు మరోసారి నోటీసులు జారీ చేయాలని సీఐడీ అధికారులు నిర్ణయించారు. ఆమెకు అనుకూలంగా ఉన్న రోజే విచారించాలని భావిస్తున్నారు. ఈమేరకు త్వరలో మరోసారి నోటీసులు జారీ చేయనున్నారు. ఆ తరువాత రామోజీరావును కూడా మరోసారి విచారించాలని సీఐడీ భావిస్తోంది.

చట్టాన్ని ఉల్లంఘించి... నిధులు కొల్లగొట్టి!

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ద్వారా చెరుకూరి రామోజీరావు, శైలజ భారీగా ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో ఆధారాలతో సహా వెల్లడైంది. రిజిస్ట్రేషన్ల శాఖ ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించి ఆర్థిక అక్రమాలను నిర్ధారించారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982 ప్రకారం చందాదారుల నుంచి వసూలు చేసిన నిధులను సంబంధిత బ్రాంచీ కార్యాలయాలున్న నగరాలు/పట్టణాల్లోని జాతీయ బ్యాంకుల్లోనే జమ చేయాలి. అందుకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ రూ.వేల కోట్లను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి మళ్లించింది. చిట్‌ఫండ్స్ సంస్థలు తమ నిధులను ఇతర వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టకూడదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ మాత్రం తమ చందాదారుల నిధులను అత్యంత మార్కెట్ రిస్క్ ఉండే మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లోకి మళ్లించింది. తమ కుటుంబ వ్యాపార సంస్థల్లో పెట్టుబడిగా పెట్టింది. చిట్‌ఫండ్స్ సంస్థలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారుల చిట్టీల మొత్తాన్ని పూర్తిగా వారికి ఇవ్వకుండా రశీదులిస్తూ 4 – 5 శాతం వడ్డీ చెల్లిస్తోంది. అంటే అక్రమంగా డిపాజిట్లు సేకరిస్తోంది. పెద్ద ఎత్తున నల్లధనాన్ని తమ సంస్థ ముసుగులో చలామణిలోకి తెస్తున్నట్లు కూడా సీఐడీ గుర్తించింది. గత డిసెంబర్ నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు వేయడం లేదు. ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల టర్నోవర్ నిలిచిపోయింది. చందాదారుల సొమ్మును గుర్తుతెలియని సంస్థల్లో పెట్టుబడిగా పెట్టింది. ఆ నిధులు ఇప్పటికిప్పుడు వచ్చే అవకాశం లేదు. దీంతో చందాదారులకు చిట్టీల మొత్తం చెల్లించలేకపోతోంది.

ప్రగల్భాల పిల్లి లోకేశ్

- బాబు, లోకేశ్ సైకోల్లా ప్రజల్ని పీడించారు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కె. రవిచంద్రారెడ్డి



సాక్షి,అమరావతి: చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఎంత హీనంగా సంబోధించి కించపర్చారో ప్రజలందరికీ తెలుసునని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కనుమూరి రవిచంద్రారెడ్డి అన్నారు. లోకేశ్ ఓ ప్రగల్భాల పిల్లి అని చెప్పారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ వారి గురించి చెప్పుకోవడానికి ఏమీ లేక, వైఎస్సార్‌సీపీ నేతలపై బురద చల్లుతున్నారని, బూతుల రాజకీయమే విధానంగా మార్చుకున్నారని చెప్పారు. టీడీపీ తెలుగు బూతుల పార్టీగా మారిందని అన్నారు. అచ్చెన్న, అయ్యన్న వంటి పనికిమాలిన బీసీ నాయకులతో పాటు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీ పెద్దలను తిట్టిస్తూ శునకానందం పొందుతున్నారన్నారు. బాబు హయాంలోనే సైతాన్ పాలన నడిచిందని, తండ్రీ కొడుకులిద్దరూ సైకోల్లా ప్రజల్ని పీడించారని తెలిపారు. బాబు, లోకేశ్ రాజకీయాలకు అనర్హులన్నారు. వారిద్దరూ నోరు అదుపులో పెట్టుకొని, సీఎం వైఎస్ జగన్‌పై బురదజల్లడం మానుకోవాలని హెచ్చరించారు. లోకేశ్ ఫ్రస్ట్రేషనంతా చంద్రబాబు మీద తీర్చుకుంటే మంచిదన్నారు. నెల్లూరులో టీడీపీ నుంచి ఒక అమాంబాపతుగాడు కాకిలా అరుస్తున్నాడని ధ్వజమెత్తారు. ఆయన మీద వైఎస్సార్‌సీపీ వర్గం దాడి చేసిందంటూ కొత్త డ్రామా ఆడుతున్నాడన్నారు. దారిన పోయే పిచ్చి కుక్కనైనా ఎవరైనా కొడతారేమో కానీ, అలాంటి పిచ్చి కాకిని ఎందుకు కొడతారని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం అవినీతికి తావు లేకుండా, కులం, మతం, వర్గం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై పిచ్చి విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

ఐదున్నరేళ్లు... 11 భాషలు

- హైదరాబాద్ బుడతడికి వరల్డ్ ఇన్‌ఫ్లుయెన్సర్ అవార్డ్

సాక్షి, హైదరాబాద్: ఏ ఫర్ యాపిల్, బీ ఫర్ బాల్ అని చదువుకునే వయసులో ఏకంగా 11 ప్రపంచ భాషల్లో వర్ణమాల అక్షర క్రమాన్ని స్పష్టంగా చెబుతూ అబ్బురపరుస్తున్నాడు నగరానికి చెందిన ఐదున్నరేళ్ల బాలుడు ఉజ్జిల్ విక్టర్. ఆంగ్లం, రష్యన్, స్పానిష్, గ్రీక్, టర్కిష్, కాప్టిక్, హిబ్రూ, అరబిక్, జపనీస్ వంటి 11 అంతర్జాతీయ భాషల్లో వర్ణమాల అక్షర క్రమాన్ని వివరంగా చెప్పగలడు ఉజ్జిల్. తన అసాధారణ ప్రతిభతో 'ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకున్నాడు. నగరంలోని టోలీచౌకీకి చెందిన విక్టర్, రీనా దంపతుల సంతానం ఉజ్జిల్. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయ కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తల్లి రీనా మాట్లాడుతూ.. ఏ విషయాన్నయినా గుర్తించుకోవడంలో ఉజ్జిల్ చురుగ్గా ఉంటాడని, తను పెరుగుతున్న క్రమంలోనే ఇది గమనించామని చెప్పారు. నాలుగున్నరేళ్ల వయసులోనే 50 కూడికలను 5 నిమిషాల్లో పూర్తి చేసి మొదటి వరల్డ్ రికార్డును సాధించాడని పేర్కొన్నారు.



ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని ప్రభాకర్ ఎన్నికయ్యారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు జరిగిన ఐఏఎల్ 11వ జాతీయ మహాసభ చివరి రోజున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఏఎల్ అధ్యక్షునిగా ఆర్.ఎస్.చీమా (పంజాబ్), ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని ప్రభాకర్ (తెలంగాణ) ఎన్నికయ్యారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మరో నలుగురు కూడా ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

ఐసీసీ 'మూట్ కోర్టు'కు లక్కిరాజు

ఐసీసీ మూట్ కోర్టుకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవాన్ని చండీగఢ్‌కు చెందిన న్యాయవాదితో పాటు తాను అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా స్టాండింగ్ కౌన్సిల్, తిరుమల తిరుపతి దేవస్థానం న్యాయవాది పద్మారావు లక్కిరాజు పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులు(ఐసీసీ), ఇంటర్నేషనల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక ఐసీసీ మూట్ కోర్టు పోటీల్లో ఆయన పాల్గొన్నారు. దాదాపు రెండేళ్ల అనంతరం ఈ కార్యక్రమాన్ని ఐసీసీ నిర్వహిస్తోంది. హేగ్‌లోని లైడెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జూన్ 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం 9వ తేదీ వరకు కొనసాగనుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943